



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 118 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | మంగళవారం 20 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-


# ఉద్యోగాలిచ్చేలా ఎదగాలి

**రూ. 50 కోట్లతో ఏపీ ఎన్నార్టీ కార్పస్ ఫండ్ - విదేశీ విద్య కోసం ప్రభుత్వ గ్యారెంటీతో రుణాలు**

**జ్యూరిచ్ తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో సీఎం చంద్రబాబు**
**20 దేశాల నుంచి కుటుంబాలతో డయాస్పోరాకు హాజరైన తెలుగు ప్రజలు**




**జ్యూరిచ్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు జాతి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే తనకు సంతృప్తిగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. వివిధ దేశాల్లో స్థిరపడ్డ తెలుగు ప్రజలు ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి చేరాలని సీఎం ఆకాంక్షించారు. వినూత్న రీతిలో ఆలోచన చేస్తే... ఉద్యోగాలు చేసే ఎన్నార్టీలు పారిశ్రామిక వేత్తలుగా మారడం పెద్ద కష్టం కాదని అభిప్రాయపడ్డారు. దావోస్ తొలి రోజు పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జ్యూరిచ్‌లో ఏర్పాటు చేసిన తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."దావోస్ కు నేను తొలిసారి వచ్చినప్పుడు భారతీయులు తక్కువగా ఉన్నారు... తెలుగు వాళ్లు అసలు లేరు. ప్రస్తుతం ఉన్నది విజయవాడలోనా.. తిరుపతిలోనా అనేలా జ్యూరిచ్ లో పరిస్థితి ఉంది. 20 దేశాల నుంచి తెలుగు వారు ఈ కార్యక్రమానికి మిగతా .. 2లో..

విధ్వంస పాలన క్రెడిట్ జగన్‌ది..

## విజనరీ క్రెడిట్ చంద్రబాబుది

**మంత్రి నిమ్మల రామానాయుడు**



**పాలకొల్లు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను జగన్ దారి మళ్లిస్తే.. దళితులు, క్రైస్తవులు, మైనార్టీల సంక్షేమమే ప్రధాన అజెండాగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో రూ.కోటి 80 లక్షలతో క్రైస్తవ శ్మశాన వాటిక మిగతా .. 2లో..

బీఆర్ఎస్, వైకాపా కుమ్మక్కై

## చంద్రబాబుపై ఆరోపణలు

**ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** బీఆర్ఎస్, వైకాపా కుమ్మక్కై ఏపీ సీఎం చంద్రబాబుపై ఆరోపణలు చేస్తున్నాయని తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఈ రెండు పార్టీలది ఒకే అజెండా అని విమర్శించారు. గోదావరి జలాలపై బురద రాజకీయాలు చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో నిర్వహించిన మిగతా .. 2లో..

ప్రతి ఆసుపత్రిలో

## కీమోథెరఫీ సెంటర్లు

**మంత్రి దామోదర రాజనర్సింహా**



**నాగర్‌కర్నూల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి నిరుపేద కుటుంబానికి నాణ్యమైన విద్య, వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. నాగర్‌కర్నూల్‌లో పర్యటించిన ఆయన రూ.40 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 109 ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. రాష్ట్రంలోని మిగతా .. 2లో..

నైనీ బొగ్గు గనుల టెండర్లపై

## సీబీఐ విచారణకు ఆదేశించాలి

**మాజీ మంత్రి హరీశ్‌రావు**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నైనీ బొగ్గు గనుల టెండర్లపై సీబీఐ విచారణకు ఆదేశించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. భాజపా, కాంగ్రెస్ మధ్య చీకటి ఒప్పందం ఉందని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఆరు గ్యారంటీలను పక్కన పెట్టి మిగతా .. 2లో..

## భారత్‌కు యూఏఈ అధ్యక్షుడు..

**స్వయంగా స్వాగతం పలికిన మోదీ**



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భారత్ పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ప్రధాని మోదీ స్వయంగా స్వాగతం పలికారు. కరచాలనం చేసి, ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం మిగతా .. 2లో..

స్విస్‌తో వాణిజ్య సంబంధాల బలోపేతానికి

## సహకరించండి

- ఏపీలో పెట్టుబడులకు స్విస్ కంపెనీలను ప్రోత్సహించండి
- స్విస్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్‌తో మంత్రి లోకేష్ భేటీ




**జ్యూరిచ్ (స్విట్జర్లాండ్), విశ్వం వాయిస్ న్యూస్ :** స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్‌తో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ స్విట్జర్లాండ్‌తో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఆసక్తిగా ఉందని చెప్పారు. ఇందుకోసం స్విస్ కంపెనీలకు ఆహ్వానం పలుకుతున్నామని మిగతా .. 2లో..

పశు ఆరోగ్య శిబిరాల ద్వారా

## పశుగణ రంగానికి పునర్వైభవం

- లింగ నిర్ధారిత వీర్యనాళికలతో పెయ్య దూడల ఉత్పత్తి పెంపు
- గుడ్లు, పాలు, మాంస ఉత్పత్తుల్లో దేశంలోనే ఏపీ అగ్రస్థానం దిశగా అడుగులు
- జన్మభూమి తరహాలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు, పశుపోషకులకు భరోసా
- ఈ నెల 19 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శిబిరాల ఏర్పాటు
- నిడమానూరులో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి/నిడమానూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పశుగణ రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని వ్యవసాయ, పశుసంవర్ధక శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పశువుల ఆరోగ్య పరిరక్షణ, ఉత్పాదకత పెంపు, వ్యాధుల నియంత్రణ మరియు పశుపోషణ ఖర్చుల తగ్గింపే లక్ష్యంగా జన్మభూమి తరహాలో రాష్ట్రవ్యాప్తంగా ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల 19 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఈ శిబిరాల కార్యక్రమాన్ని విజయవాడ రూరల్ మండలంలోని నిడమానూరు గ్రామంలో సోమ వారం ఉదయం ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి మిగతా .. 2లో..



పెళ్లి కుదిరింది..

## అంతలోనే అనంతలోకానికి..

**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. గండేపల్లి మండలం తాళ్లూరుకు చెందిన తలారి రవి(26) ప్రత్తిపాడు నుంచి బైకుపై తన గ్రామానికి వెళ్తుండగా వెనుక నుంచి ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో రవి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి మిగతా .. 2లో..

సమ్మక్క, సారలమ్మలను

## దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి



**మేడారం, విశ్వం వాయిస్ న్యూస్ :** మేడారంలో గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పునఃప్రారంభించారు. అనంతరం తన కుటుంబంతో కలిసి వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనవడితో కలిసి నిలువెత్తు బంగారాన్ని సీఎం సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా గద్దెల ప్రాంగణంలో పైలాన్‌ను రేవంత్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆ టార్గెట్ రీచ్ అయ్యేవరకు..

## జీతం తీసుకోనన్న కలెక్టర్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పేదల సంక్షేమాన్ని కాంక్షిస్తూ.. ఓ కలెక్టర్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. పేదల కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలు వారికి అందేవరకు తాను జీతం తీసుకోనని ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు తనతో పాటు అధికారులు అందరూ ఈ విషయంపై పూర్తి శ్రద్ధ పెట్టేలా చర్యలు తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. దీంతో స్థానికంగా ఆయన గురించి చర్చ మొదలయ్యింది. ఆయనే రాజస్థాన్‌లోని రాజ్‌సమండ్ జిల్లా కలెక్టర్ అరుణ్ కుమార్ హసిజా. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం రూపొందించిన మూడు పథకాలను మిగతా .. 2లో..

## సమయం ఆసన్నమైంది..

**గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ కీలక పోస్ట్**



**విశ్వం వాయిస్ న్యూస్ :** వనరుల పరంగా ఎంతో కీలక దీవి అయిన గ్రీన్‌లాండ్‌ను చేజిక్కించుకుంటామంటూ ట్రంప్ చేస్తున్న హెచ్చరికలను గ్రీన్‌లాండ్, డెన్మార్క్‌లతో పాటు ఐరోపా దేశాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డెన్మార్క్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీన్‌లాండ్ భద్రతకు రష్యా నుంచి ముప్పు పొంచి ఉందని నాటో 20 ఏళ్లుగా చెబుతున్నా మిగతా .. 2లో..

ఆలయానికి రూ.2 కోట్లు విరాళం..

## వృద్ధ దంపతుల ఔదార్యం



**నంద్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆలయానికి ఆస్తిని విరాళంగా రాసిచ్చి.. వృద్ధ దంపతులు ఔదార్యాన్ని చాటుకున్నారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం జలదుర్గం మిగతా .. 2లో..



డ్రైవర్‌కు ఫిట్స్..

## ఆర్టీసీ బస్సు బోల్తా

**గరివిడి, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయనగరం జిల్లా గరివిడి మండలం అప్పన్నవలస వద్ద సోమవారం ఓ ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మిగతా .. 2లో..

అప్పుడు ప్రతిక్షణం చంద్రబాబు కోసం

## ఎదురుచూశా..

**పాదయాత్ర ప్రారంభించిన బండ్ల గణేశ్**



**షాద్‌నగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** తాను చేపడుతున్న 'సంకల్పయాత్ర'కు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదని సినీ నిర్మాత బండ్ల గణేశ్ అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబుపై అభిమానంతో దేవుడికి మొక్కు చెల్లించేందుకు దీన్ని చేపట్టినట్లు తెలిపారు. షాద్‌నగర్ నుంచి తిరుమలకు పాదయాత్ర ప్రారంభించనున్న నేపథ్యంలో బండ్ల గణేశ్ మాట్లాడారు. వైకాపా హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు అరెస్టయిన సమయంలో మొక్కుకున్న మొక్కును తీర్చుకునేందుకు ఈ పాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. "ఇది రాజకీయ యాత్ర కాదు. దేవుడికి మొక్కు చెల్లించుకునేందుకు, చంద్రబాబుపై అభిమానంతో చేస్తున్నాను. దీనికి ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదు. నాకు ఉదయం 4.30 గంటలకే నిద్ర లేచే అలవాటుంది. ఆ రోజు టీవీలో చంద్రబాబు అరెస్ట్ వార్త చూడగానే షాక్‌కి గురయ్యాను. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర, ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన వ్యక్తి ఆయన. అలాంటి వ్యక్తిని అరెస్ట్ చేయడమేంటని ఆశ్చర్యపోయాను. గుంటూరుకు తీసుకొచ్చి బెయిల్ ఇస్తారనుకున్నాను. రాజమహేంద్రవరం జైలుకు పంపించారు. రోజులు గడిచేకొద్దీ నాకు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ఉద్యోగాలిచ్చేలా ఎదగాలి

రావడం సంతోషంగా ఉంది. 195 దేశాల్లో తెలుగు వారు ఉన్నారు...148 దేశాల్లో ఎన్నార్టీ వ్యవస్థను ఏర్పాటు చేశాం. విదేశాల్లో ఉన్నా తెలుగు సంప్రదాయాలను పాటిస్తూ సంక్రాంతి పండుగ జరుపుకున్నారు. విజన్ 2020, ఐటీ గురించి నేను మాట్లాడిన రోజుల్లో అందరూ విమర్శించారు. కానీ నేను ఆనాడు తీసుకున్న నిర్ణయం వల్ల 195 దేశాలకు తెలుగు వారు వెళ్లడానికి అవకాశం కల్పించింది. తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలను ప్రారంభించడం గర్వకారణం. 2047కు భారత దేశం ప్రపంచంలో నెంబర్ ఎకానమీ దేశంగా అవతరిస్తుంది. భారత దేశానికి అత్యంత బలమైన నాయకత్వం నరేంద్ర మోదీ రూపంలో ఉంది. ఉన్నత విద్యను అభ్యసించిన వారిని... యువకులను పార్టీలో, ప్రభుత్వంలో ప్రోత్సహిస్తున్నాం. అందుకే లోకేష్, రామ్మోహన్ నాయుడు, టీజీ భరత్ వంటి వారికి పదవులు దక్కాయి. రామ్మోహన్ నాయుడు కేంద్రంలో యువ కెబినెట్ మంత్రి."అని ముఖ్యమంత్రి అన్నారు.

### ఎన్నికల్లో ఎన్నార్టీల సహకారం మరవలేం.

"సవాళ్లను ఎదుర్కోవాలి... ఇబ్బందులను అధిగమించాలి... దీన్ని యువత అందిపుచ్చుకోవాలి. పదవులు వస్తే గ్లామరే కాదు... రాళ్లు కూడా పడతాయి. వీటిని ఎదుర్కొనడం యువత అలవరచుకోవాలి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్నార్టీలు అద్భుతంగా పని చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని పవన్ కళ్యాణ్ సహకరించారు, బీజేపీ కలిసి వచ్చింది. రాష్ట్రానికి పూర్వ వైభవం తేవాలి... సహకరించమని ఎన్నార్టీలను కోరితే క్షణం కూడా ఆలోచన చేయకుండా తరలి వచ్చారు... కూటమి కోసం పని చేశారు. రాష్ట్రంలోని నేతలు, కార్యకర్తలతో సమానంగా కొందరు ఎన్నార్టీలు కూడా కేసులు పెట్టించుకున్నారు. ప్రజల ఆశీస్సులు, మీ సహకారంతో 93 స్ట్రైక్ రేట్ తో అద్భుత విజయం సాధించాం. విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి పునర్ నిర్మించడం సాధ్యమా...? అని అందరూ ఆందోళ చెందారు. కానీ 18 నెలల కాలంలో బ్రాండ్ పునరుద్ధరించాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో పని చేస్తున్నాం. అభివృద్ధి విషయంలో మంత్రులు, నేను పోటీ పడ్డాం. పెద్ద ఎత్తున పెట్టుబడులు సాధించాం. దేశంలో వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయి. అలాగే దేశానికి వచ్చిన అతి పెద్ద పెట్టుబడి గూగుల్ రూపంలో ఏపీకే వచ్చింది. ఆర్సెల్లార్ మిట్టల్ రూ. 1 లక్ష కోట్ల పెట్టుబడితో ఉక్కు పరిశ్రమ స్థాపిస్తున్నారు. కాకినాడలో గ్రీన్ అమోనియ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశాను. ఏఎం గ్రీన్ సంస్థ 10 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. తక్కువ ఖర్చుతో కరెంట్ ఉత్పత్తి చేసేలా పరిశ్రమలు స్థాపిస్తున్నాం. అలాగే తక్కువ ఖర్చుతో విద్యుత్ కొనుగోళ్లు చేపడుతున్నాం. విద్యుత్ విషయంలో సంస్కరణలు చేపట్టడం వల్ల డేటా సెంటర్లు రాష్ట్రానికి వస్తున్నాయి. మొత్తంగా రూ. 22 లక్షల కోట్ల పెట్టుబడులపై కసరత్తు చేస్తున్నాం. ఇది సాకారమైతే 20 లక్షల ఉద్యోగాలు కల్పించగలం. రాష్ట్రంలోని మారుమూల గ్రామాల నుంచి వచ్చి విదేశాల్లో స్థిరపడ్డారు... మీ ఊళ్లల్లో ఉన్న వారిని అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. రాష్ట్రాన్ని మూడు రీజియన్లుగా చేసి అభివృద్ధి చేస్తున్నాం. యూరప్ లో లిచెన్ స్టైన్ చాలా చిన్న దేశం. టెక్నాలజీని అందిపుచ్చుకోవడం వల్లే లిచెన్ స్టైన్ సంపన్న దేశంగా ఎదిగింది. అందుకే క్వాంటం, ఏఐ, స్పేస్, డ్రోన్ టెక్నాలజీ అందిపుచ్చుకుంటున్నాం. డ్రోన్ల ద్వారా ప్రజలకు, వ్యవసాయ, వైద్య రంగాలకు సేవలు అందించేలా చూస్తాం. డ్రోన్ ఆపరేషన్లకు పర్మిషన్లు ఇచ్చే బాధ్యతను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తీసుకోవాలని కోరుతున్నాను. ఎలక్ట్రానిక్స్, హెల్త్ డివైసెస్, ఫార్మా రంగాల అభివృద్ధిపై రాష్ట్రం దృష్టి సారించింది. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజారోగ్యం మెరుగయ్యేలా చర్యలు చేపడుతున్నాం. ప్రకృతి సేద్యం ద్వారా నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. నీటి భద్రతకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఏపీ రిజర్వాయర్ల లో 958 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఏఐకు చిరునామాగా భారతీయులు, తెలుగు వాళ్లే ఉన్నారు. దీన్ని అందిపుచ్చుకుని మరింత అభివృద్ధి సాధించాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

### ఒకరు ఉద్యోగం... మరొకరు వ్యాపారం

"జన్మభూమిని మరిచిపోతే చరిత్ర హీనులవుతారు. అలాగే ఖర్మ భూమికి సేవలు అందించాలి. విదేశాల్లో ఉద్యోగాల కోసం వచ్చే వాళ్లు అక్కడి స్థానిక పరిస్థితులతో కలిసిపోవాలి. ఏ ప్రాంతంలో ఉంటే.. ఆ ప్రాంతంలోని స్థానికులతో మమేకం కావడమనేది తెలుగు వారి ప్రత్యేకత. ఉద్యోగాలు చేసే వాళ్లుగా కాదు, ఉద్యోగాలు ఇచ్చే వాళ్లుగా తెలుగు జాతి ఎదగాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పెట్టాం. స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తాం. ఒన్ ఫ్యామ్లీ-ఒన్ ఎంటర్ ప్రెన్యూయర్ అనేది ప్రభుత్వ విధానం. విదేశాల్లో స్థిరపడ్డ తెలుగు వాళ్లల్లో భార్య-భర్త ఇద్దరూ ఉద్యోగాలు చేస్తుంటే... ఒకరు ఉద్యోగం చేయండి... మరొకరు వ్యాపారం చేయండి. ఏపీలో వ్యాపారాలకు, పరిశ్రమలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వ్యాపార, వాణిజ్య రంగంలోకి రావాలనుకున్న ఎన్నార్టీలకు సహకరిస్తాం. విదేశాల్లోను వ్యాపారాలు చేసుకుంటామంటే చేయండి.. ఏపీలో పెట్టుబడులు పెడతామన్నా స్వాగతిస్తాం. ఎన్నార్టీలను పారిశ్రామిక వేత్తలుగా చేయడానికి ప్రభుత్వం వైపు నుంచి సహకారం అందిస్తూ రూ. 50 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నుంచి ప్రభుత్వం తరపున సహకరిస్తాం.. గైడ్ చేస్తాం. కొంచెం కొత్త తరహాలో ఆలోచన చేస్తే పారిశ్రామిక వేత్తలుగా రాణించగలరు. వివిధ దేశాల్లో ఉన్న తెలుగు వారిని కో-ఆర్డినేట్ చేసి.. వారిని అభివృద్ధి చేసేలా... పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేలా లోకేష్, రామ్మోహన్ నాయుడు, టీజీ భరత్ వంటి వారు బాధ్యత తీసుకోవాలి. ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని స్థాపించాలి."అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

### విదేశీ విద్య... మా బాధ్యత

"చదువు కోవాలని అనుకునే ప్రతి ఒక్కరినీ చదివిస్తాం. ప్రపంచ వ్యాప్తంగా మంచి యూనివర్శిటీలు ఎక్కడున్నా విద్యార్థులకు అవకాశాలు అందేలా చేస్తాం. 4 శాతం వడ్డీతో రుణాలు ఇప్పించి విదేశీ విద్య అందించేలా మేం చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ గ్యారెంటీతో రుణాలు ఇస్తాం. ఏపీ ఫస్ట్ అనే అతి పెద్ద రీసెర్చ్ వ్యవస్థను తెస్తున్నాం. ఐఐటీ-ఐఐఎసచవతీతీచఆర్ కాంబినేషన్ తో ఈ రీసెర్చ్ సెంటర్ తిరుపతిలో స్థాపిస్తున్నాం. కొత్త ఆవిష్కరణలతో యువతకు ఉపాధి చూపించేలా కృషి చేస్తున్నాం. 2047 నాటికి దేశం అగ్రభాగాన నిలుస్తుంది. దేశంలో ఆంధ్రప్రదేశ్ నెంబర్-1 కావాలి.. తెలుగు జాతి వెలగాలి. 30 ఏళ్లకు ముందు భారత దేశం గురించి ప్రత్యేకంగా చర్చించుకునే వారు కాదు... కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోంది. ఇందులో మనం భాగస్వాములం కావాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

### ఉత్సాహంగా... ఉల్లాసంగా...

ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్న తెలుగు డయాస్పోరా కార్యక్రమం ఆసాంతం ఆసక్తిగా సాగింది. ఐరోపాలోని 20 దేశాల నుంచి తెలుగు ప్రజలు తరలి వచ్చారు. డయాస్పోరా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తెలుగు వారు వచ్చి స్థిరపడ్డారని చెబుతూ చంద్రబాబు రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల పేర్లు ప్రస్తావించినప్పుడు సభికుల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. వివిధ దేశాలకు చెందిన ఎన్నార్టీ ప్రతినిధులు ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రస్తుతం ప్లకార్డులు ప్రదర్శిస్తున్నా వచ్చే ఏడాది తన పర్యటనలో ఎన్నార్టీల అభివృద్ధి గురించి ప్లకార్డులు ప్రదర్శించాలని సీఎం సూచించారు. స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్ నిర్వహించిన సంక్రాంతి పోటీల్లో విజేతలకు సీఎం చంద్రబాబు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమం అనంతరం తెలుగు కుటుంబాలను సీఎం చంద్రబాబు ఆత్మీయంగా పలకరించారు. గోదావరి పుష్కరాలకు రావాల్సిందిగా సీఎం చంద్రబాబు తెలుగువారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, ఏపీ ఎన్నార్టీ సొసైటీ అధ్యక్షుడు వేమూరి రవి పాల్గొన్నారు.

# విజనరీ క్రెడిట్ చంద్రబాబుది

సుందరీకరణ, అభివృద్ధి పనులకు మంత్రి నిమ్మల శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "అధికారం దక్కలేదనే పగతో వైకాపా నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. విధ్వంస పాలన క్రెడిట్ జగన్‌ది.. విజనరీ క్రెడిట్ చంద్రబాబుది" అని నిమ్మల పేర్కొన్నారు.

# చంద్రబాబుపై ఆరోపణలు

మీడియా సమావేశంలో ఎంపీ మాట్లాడారు. "జగన్ కోర్టుకు హాజరైతే బీఆర్ఎస్ వాళ్లు ఫ్లెక్సీలు పెట్టి స్వాగతం పలుకుతున్నారు. కేటీఆర్ ఖమ్మం వెళ్తే వైకాపా నేతలు ఫ్లెక్సీలు కడుతున్నారు. స్నేహం ముసుగులో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సరికాదు. జగన్ బెంగళూరులో కూర్చొని కుట్రలు చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు కూడా అందులో భాగమవుతున్నారు. జగన్ ఐదేళ్లు సీఎంగా ఉన్నా ఒక్క పరిశ్రమ అయినా రాయలసీమకు తెచ్చారా జగన్, బీఆర్ఎస్ నేతలు సొంత వ్యాపారం కోసం కాకుండా అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారైనా ప్రజా సమస్యలపై చర్చించారా" అని కలిశెట్టి అప్పలనాయుడు ప్రశ్నించారు.

### కీమోథెరపీ సెంటర్లు

ప్రతి ఆస్పత్రిలో క్యాన్సర్ రోగుల కోసం కీమోథెరపీ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సభకు వచ్చిన విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. విద్యార్థులు సమసమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. నైపుణ్యంతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. విద్యార్థుల చదువు సమాజాభివృద్ధికి దోహదపడాలన్నారు. రాష్ట్రంలో 105 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి తదితరులు పాల్గొన్నారు.

# సీబీఐ విచారణకు ఆదేశించాలి

వాటాల కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు. ఔట్ సోర్సింగ్ సీఎంకు.. అసలైన కాంగ్రెస్ వాదులకు మధ్య వార్ నడుస్తోందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

# భారత్‌కు యూఏఈ అధ్యక్షుడు..

ఇద్దరూ ఒకే కారులో ప్రయాణించారు. అయితే, విదేశాంగ శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం.. అల్ నహ్యాన్ కేవలం రెండు గంటలే దిల్లీలో ఉండనున్నట్లు తెలుస్తోంది. "సోదరుడు, యూఏఈ అధ్యక్షుడు అల్ నహ్యాన్‌కు స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వెళ్లాను. ఇరుదేశాల మధ్య స్నేహానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ పర్యటన చాటుతోంది" అని ప్రధాని మోదీట్వీట్ చేశారు. ఇరు దేశాధినేతలూ చర్చలు జరపనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఇంధన రంగాల్లో సహకారం తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

### కశ్మీర్‌పై సూచనలు.. పోలండ్ మంత్రికి జైశంకర్ చురకలు

### బహుమతిగా గుజరాతీ ఊయల..

అల్ నహ్యాన్‌కు ప్రధాని మోదీ చెక్కతో కళాత్మకంగా రూపొందించిన ఓ పెద్ద ఊయలను కానుకగా ఇచ్చారు. దీన్ని గుజరాత్‌లో తయారు చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలూ కలిసి కాసేపు ఆ ఊయలపై కూర్చుని సంభాషించుకున్నారు. అదేవిధంగా తెలంగాణలో తయారు చేసిన వెండి పెట్టెలో కశ్మీరీ పశ్మీనా శాలువాను బహుమతిగా ఇచ్చారు. అల్ నహ్యాన్ తల్లికి కూడా పశ్మీనా శాలువాతోపాటు కుంకుమ పువ్వు అందజేశారు. ఇరాన్- అమెరికా మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతినడం, యెమెన్ విషయంలో సౌదీ అరేబియా, యూఏఈల మధ్య ఉద్రిక్తతలు, గాజాలో రాజకీయ అస్థిరతలు నెలకొన్నవేళ ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. యూఏఈ అధ్యక్ష హోదాలో అల్ నహ్యాన్ భారత్‌లో అధికారికంగా పర్యటించడం ఇది మూడోసారి. 2022లో ఇరుదేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం అనంతరం సంబంధాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది.

# సహకరించండి

తెలిపారు. టెక్నాలజీ, టెక్స్ టైల్, యంత్రాల తయారీ, హార్డ్ వేర్, ఎలక్ట్రానిక్స్, రైలు, రైలు విడిభాగాల తయారీ, ఫార్మాస్యూటికల్స్, ఆర్ అండ్ డి సెంటర్స్, విశ్వవిద్యాలయాలతో సహకారం వంటి రంగాల్లో మేం స్విస్ సహకారాన్ని కోరుకుంటున్నాం. నెస్లే, రోచె, నోవార్టిస్, ఎబీబీ, లైబెర్ ఇంజనీరింగ్, క్లారియంట్, హిల్టి, బుహ్లర్, బుచర్, ఫెర్రింగ్ ఫార్మాస్యూటికల్స్, ఎస్ టీ టెలిమీడియా, ఓసీ ఓర్లికాన్ వంటి కంపెనీలు తమ యూనిట్లను ఏపీలో నెలకొల్పేలా ప్రోత్సహించండి. స్విస్ లోని జ్యూరిచ్ విశ్వవిద్యాలయం, బాసెల్ యూనివర్సిటీ, బెర్న్ యూనివర్సిటీ, జెనీవా విశ్వవిద్యాలయం వంటి ప్రఖ్యాత వర్సిటీలను ఏఐ, ఫార్మా, మెడికల్ డివైస్, స్టార్టప్, ఎక్స్ఛేంజి ప్రోగ్రామ్ లపై ఏపీ వర్సిటీలను అనుసంధానించడంలో మద్దతు ఇవ్వండి. ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న తెలుగు డయాస్పోరా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దోహదపడుతోంది. స్విట్జర్లాండ్?లో భారతదేశ సాంకేతిక ప్రతిభకు భారీ డిమాండ్ ఉంది. ఆంధ్రప్రదేశ్ నుంచి మరింత మంది సాంకేతిక నిపుణులను స్విట్జర్లాండ్ కు పంపడానికి సహకారం అందించండి. తెలుగు డయాస్పోరాకు చెందిన ఔత్సాహికులను ఎంటర్ ప్రెన్యూర్స్ గా తయారు చేయడంపై ఆంధ్రప్రదేశ్ ఆసక్తిగా ఉంది. దీనివల్ల దేశాభివృద్ధికి అవకాశమేర్పడుతుంది. ఇందుకు మీవంతు సహకారం అందించండి. గతంలో చాలామంది విద్యావంతులు యూఎస్ వెళ్లి అక్కడ వివిధరంగాల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం యూరప్ కు కూడా విద్యార్థులు పెద్దఎత్తున వస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి స్విట్జర్లాండ్ కు వచ్చే విద్యార్థులకు అవసరమైన సహాయ, సహకారాలు అందించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. దీనిపై స్విస్ లోని భారత రాయబారి మృదుల్ కుమార్ స్పందిస్తూ... గత ఏడాది అక్టోబర్ 1న భారత్, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (స్విట్జర్లాండ్, నార్వే, ఐస్ ల్యాండ్, లీచెన్ స్టెయిన్)ల మధ్య జరిగిన చరిత్రాత్మక ట్రేడ్ అండ్ ఎకనమిక్ పార్టనర్ షిప్ అగ్రిమెంట్‌తో ఇరు ప్రాంతాల నడుమ వాణిజ్య సంబంధాలు నవశకంలోకి ప్రవేశించాయి. ఈ ఒప్పందం ప్రకారం రాబోయే 15ఏళ్లలో భారత్ లో విబిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టడానికి యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ దేశాలు తమ కమిట్ మెంట్ ను వ్యక్తంచేశాయి. భారత్ లో 10లక్షల మంది యువతకు ప్రత్యక్ష ఉద్యోగాలు కల్పించడమే ఈ ఒప్పందం లక్ష్యమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చొరవకు తమవంతు సహకారం అందిస్తానని మృదుల్ కుమార్ పేర్కొన్నారు.

# ఎదురుచూశా..

టెన్షన్ మొదలైంది. జైల్లో చంద్రబాబును ఏమైనా చేస్తారనే భయమేసింది. ప్రతిక్షణం ఆయన ఎప్పుడు బయటకు వస్తారా అని ఎదురుచూశాను. కోర్టు వాయిదా ఉన్నప్పుడల్లా నేను సుప్రీంకోర్టుకు వెళ్లాను. చంద్రబాబుకు బెయిల్ వచ్చిందనే వార్త మొదట వినడానికే దిల్లీ వెళ్లి కూర్చునేవాడిని. జైలు నుంచి ఆయన తిరిగివస్తే తిరుమలకు పాదయాత్రగా వస్తానని ఏడుకొండలవాడిని మొక్కుకున్నా. దేవుడి ఆశీస్సులతో 52 రోజుల తర్వాత చంద్రబాబు విడుదలయ్యారు. తెలుగు ప్రజల కోసం నేనున్నానంటూ ఎంతో ఉత్సాహంతో బయటకు వచ్చారు. అలాంటి వ్యక్తి తెలుగుజాతికి చాలా అవసరం. ఈ యాత్రను రాజకీయంగా చూడొద్దు.. విమర్శలు చేయొద్దు. నేను వేసే ప్రతి అడుగు చంద్రబాబు ప్రతి అభిమాని అడుగు"అని బండ్ల గణేశ్ అన్నారు.

# అంతలోనే అనంతలోకానికి..

చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన ట్రావెల్స్ బస్సు ఆచూకీ కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. ప్రత్తిపాడుకు చెందిన యువతితో రెండు నెలల క్రితమే రవికి పెళ్లి సంబంధం కుదిరిందని, అంతలోనే మృత్యువు కబళించిందని బంధువులు రోదిస్తున్నారు.

# జీతం తీసుకోనన్న కలెక్టర్

తన జిల్లాలోని ప్రజలందరికీ అందేలా చర్యలు తీసుకుంటానని రాజ్‌సమండ్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అరుణ్‌ప్రతిజ్ఞ చేశారు. ఈ పథకాల నుంచి జిల్లాలోని ప్రతిఒక్కరూ ప్రయోజనం పొందేవరకు తన జీతం వదులుకోవాలని నిర్ణయించుకున్నారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ.."మా జీతం 10 రోజులు ఆలస్యమైనా చాలా ఇబ్బందులు పడతాము. అదే పేదరికంలో మగ్గేవారు, వారి పిల్లల చదువులు, పనులు చేసుకోలేని వికలాంగులు, వృద్ధుల పరిస్థితి మరింత బాధాకరంగా ఉంటుంది. పథకాల కోసం నమోదు చేసుకోవడానికి కూడా వాళు అనేక ఇబ్బందులు పడుతుంటారు. అందుకే ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలు వారికి ఎలాగైనా చేర్చాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నాను" అని తెలిపారు.

అధికారిక నివేదికల ప్రకారం.. రాజ్‌సమండ్ జిల్లాలో దాదాపు 30వేల మంది పేద ప్రజలు ఉన్నారు. వీరికోసం రాజస్థాన్ ప్రభుత్వం మూడు పథకాలను అందిస్తోంది. అయితే పలు కారణాల వల్ల చాలామంది ప్రజలు వీటిని పొందలేకపోతున్నారు. ఆ పథకాలు ఏంటంటే..

1. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఉచిత రేషన్ లేదా గోధుమలు అందించడం
2. తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లల పేర్లను 'పలన్హార్ యోజన' కింద నమోదు చేసి, ప్రయోజనాలు అందించడం
3. ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులకు పింఛన్లు

కలెక్టర్ నిర్ణయంతో వెంటనే కదిలిన జిల్లా యంత్రాంగం పింఛన్ల పథకం కింద జిల్లాలోని 1,90,440 మంది లబ్ధిదారుల పేర్లు నమోదు చేసింది. పెండింగ్‌లో ఉన్న వారి ధ్రువీకరణలు కూడా త్వరలో పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ నెలాఖరుకు మూడు పథకాలకు సంబంధించిన పనులు పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. అయితే అరుణ్‌కుమార్ ఇలా ప్రజా సమస్యల పరిష్కారాల కోసం వినూత్న మార్గాలను ఎన్నుకోవడం ఇదే మొదటిసారి కాదని.. గతంలోనూ రైతులు, ప్రజలకు పథకాల కోసం అనేక చర్యలు తీసుకున్నారని తెలిపారు.

# వృద్ధ దంపతుల ఔదార్యం

గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు బొచ్చు పెద్ద వీర భద్రుడు, వెంకటేశ్వరమ్మ రూ.2 కోట్లు విలువైన ఆస్తిని మాధవరం రామాలయానికి విరాళంగా ఇచ్చారు. వారికి సంతానం లేకపోవడంతో వారికున్న ఆస్తిని విరాళంగా అందించారు. ఈ మేరకు గ్రామ పెద్దల సమక్షంలో ఆస్తికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వృద్ధ దంపతులను ఊరేగింపుగా తీసుకొచ్చి ఘన సన్మానం చేశారు.

# ఆర్టీసీ బస్సు బోల్తా

ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. రాజాం నుంచి పల్లెవెలుగు బస్సు విజయనగరం వస్తోంది. ఈ క్రమంలో డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలు, మరికొందరికి స్వల్పగాయాలు అయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో డ్రైవరు కండక్టర్‌తో కలిపి 87 మంది ఉన్నారు. డ్రైవర్ అప్పల గురువులు ఇప్పటికీ అపస్మారక స్థితిలో ఉన్నారు. ప్రమాద స్థలాన్ని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు, సీఐ శంకరరావు, గరివిడి ఎస్సై లోకేశ్వరరావులు పరిశీలించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# సమయం ఆసన్నమైంది..

డెన్మార్క్ ఎటువంటి జాగ్రత్తలు తీసుకోలేదన్నారు. రష్యాను ఎదుర్కోవడంలో అది విఫలమవడంతో భద్రతా కారణాల దృష్ట్యా తాము ఇప్పుడు చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. సమయం వచ్చింది కాబట్టే ఈ విషయంలో తాము కల్పించుకున్నామన్నారు. ఎలాగైనా గ్రీన్‌లాండ్‌ను చేజిక్కించుకుంటామన్నారు.

### ఇకపై శాంతి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు..

ఈ నేపథ్యంలో ట్రంప్ నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్‌కు లేఖ రాశారు. అందులో తాను 8 యుద్ధాలు ఆపినప్పటికీ తనకు శాంతి బహుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. దీంతో ఇకపై కేవలం శాంతి గురించి మాత్రమే ఆలోచించాల్సిన అవసరం తనకు లేదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇప్పటినుంచి అమెరికాకు ఏది ప్రయోజనకరమో దాని గురించే ఆలోచిస్తానన్నారు. నాటోకి పంపిన మరో లేఖలో ట్రంప్ గ్రీన్‌లాండ్ గురించి ప్రస్తావిస్తూ.. ఆ దేశాన్ని చైనా, రష్యాల నుంచి డెన్మార్క్ రక్షించలేనప్పుడు గ్రీన్‌లాండ్‌పై దానికి యాజమాన్య హక్కు ఎలా ఉంటుందని ప్రశ్నించారు. నాటోను స్థాపించినప్పటినుంచి అమెరికా దానికోసం చాలా చేసిందని.. ఇప్పుడు తమకోసం నాటో ఏదైనా చేయాలన్నారు. గ్రీన్‌ల్యాండ్‌పై మనకు పూర్తి నియంత్రణ లేకపోతే ప్రపంచం సురక్షితంగా ఉండదని హెచ్చరించారు. గ్రీన్‌లాండ్ విషయంలో తమకు మద్దతు తెలపని దేశాలపై 10శాతం అదనపు సుంకాలను విధిస్తున్నట్లు ట్రంప్? చేసిన ప్రకటనపై బ్రిటన్‌తోపాటు ఈయూ దేశాలు మండిపడడంతో అమెరికా అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా చర్యలపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ మాట్లాడుతూ.. ట్రంప్ బెదిరింపులకు లొంగేది లేదని, గ్రీన్‌లాండ్ ఎప్పటికీ డెన్మార్క్‌లో భాగమేనని స్పష్టం చేశారు. ఐరోపా యూనియన్‌కు చెందిన వాణిజ్య ఆయుధం 'ట్రేడ్ బజూక'ను తొలిసారి వాడాలని యోచిస్తున్నట్లు తెలిపారు.

# పశుగణ రంగానికి పునర్వైభవం

మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, పశుపోషణ రైతులకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న నేపథ్యంలో పశువుల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పశుపాలకులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం, పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తు చికిత్సలు చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. పశువులకు ఉచిత వైద్య సేవలు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీతో పాటు శాస్త్రీయ పశు యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పశుగణ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారంగా నిలుస్తోందని, ముఖ్యంగా మహిళల జీవనోపాధికి ఈ రంగం కీలకమని పేర్కొంటూ, పశుపోషకులకు పూర్తి భరోసా కల్పించేలా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

### దేశవ్యాప్తంగా ఏపీ పశు సంపదకు గుర్తింపు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు, పుంగనూరు ఆవులు, గోదావరి గేదెలు, నెల్లూరు, మాచెర్ల గొర్రెలు, అశీల్ కోళ్లకు దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు ఉందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 108.19 లక్షల ఆవులు, గేదెలు, 231.49 లక్షల గొర్రెలు, మేకలు (దేశంలో రెండవ స్థానం), 1078.63 లక్షల కోళ్లు ఉండగా, సుమారు 25 లక్షల రైతు కుటుంబాలు పశు పోషణపై ఆధారపడి జీవిస్తున్నాయని పేర్కొన్నారు. పశుగణ రంగం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.1,67,000 కోట్ల ఆదాయం లభిస్తోందని, ఇది 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీవీఏలో 10.26 శాతంగా ఉన్నట్లు మంత్రి వివరించారు. పశుగణ ఉత్పత్తుల్లో రాష్ట్రం 2739 కోట్ల గుడ్ల ఉత్పత్తితో దేశంలో మొదటి స్థానం, 11.30 లక్షల మెట్రిక్ టన్నుల మాంస ఉత్పత్తితో నాలుగవ స్థానం, 139.40 లక్షల మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తితో ఏడవ స్థానంలో నిలిచిందని తెలిపారు.

### గ్రామగ్రామాన ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2025లో పశువుల ఆరోగ్య రక్షణ, ఉత్పాదకత పెంపు, వ్యాధి నియంత్రణ, పశుపోషణ ఖర్చుల తగ్గింపు లక్ష్యంగా రాష్ట్రంలోని 13,257 గ్రామాలలో జన్మభూమి తరహాలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించామని మంత్రి తెలిపారు. ఈ శిబిరాల ద్వారా 10,48,980 పశువులకు వైద్య సేవలు అందించడంతో పాటు 5,36,387 మంది పశుపోషకులు లబ్ధి పొందారని చెప్పారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది జనవరి 19 నుంచి 31 వరకు రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ శిబిరాలలో పశువైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, నట్టల నివారణ మందుల పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు మరియు శాస్త్రీయ పశు యాజమాన్యంపై అవగాహనా సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పశుసంవర్ధక శాఖ అమలు చేస్తున్న పథకాలలో భాగంగా రూ.52 కోట్ల వ్యయంతో 1,29,800 మంది పశుపోషకులకు 23,302 మెట్రిక్ టన్నుల బలపాల పశుదాణాను 50 శాతం రాయితీపై పంపిణీ చేశామని, అలాగే రూ.28.32 కోట్లతో 4,111 టన్నుల పశుగ్రాస విత్తనాలను 75 శాతం రాయితీపై 1,22,833 మందికి అందించామని మంత్రి వివరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పశుగ్రాసానికి కూడా ఈ క్రాప్ చేసే విధంగా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు.

### గోకులాల షెడ్లు, పశు బీమా, లింగ నిర్ధారిత వీర్యనాళికలు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో అనుసంధానంగా 70-90 శాతం రాయితీతో ఇప్పటి వరకు 58,440 గోకులాల షెడ్లు నిర్మించామని, 2026-27లో మరో 50,000 షెడ్లు నిర్మించాలనే లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. పశుపోషకులకు ఆర్థిక భద్రత కల్పించేందుకు 85 శాతం రాయితీతో పశు బీమా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. పెయ్య దూడల ఉత్పత్తి పెంపుకోసం 50 శాతం రాయితీతో లింగ నిర్ధారిత వీర్యనాళికలను రూ.150కే అందిస్తూ ఈ ఆర్థిక సంవత్సరానికి 10 లక్షల వినియోగ లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో మరణించిన పశువులకు కూటమి ప్రభుత్వం 150 కోట్ల నష్ట పరిహారం చెల్లించిదని, ప్రస్తుతం 3 సంవత్సరాలకు గాను 1920 రూపాయల భీమాలో రైతు కేవలం 288 రూ మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు.

### కూటమి ప్రభుత్వంతో పశుగణ రంగానికి పునర్జీవనం

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో జన్మభూమి కార్యక్రమాల ద్వారా పశు ఆరోగ్య శిబిరాలు పండగ వాతావరణంలో నిర్వహించేవారని, గత ప్రభుత్వంలో ఈ రంగం పూర్తిగా నిర్వీర్యమైందని మంత్రి విమర్శించారు. మళ్లీ కూట?మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పశుగణ రంగానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ గత సంవత్సరం మంగళగిరి నుంచి ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. అంతరించిపోతున్న ఒంగోలు జాతి పశువులకు పునర్వైభవం తీసుకువస్తామని, ఖాళీగా ఉన్న వెటర్నరీ డాక్టర్లు, సిబ్బంది నియామకంపై త్వరలోనే ముఖ్యమంత్రితో చర్చించి ప్రకటన చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ వెట?ర్న?రీ యూనివర్సిటీ కాంపౌండ్ వాల్ ను త్వరలోనే నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజ?లకు 104 నెంబర్ టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేస్తే వైద్య సేవలు అందిస్తారో,,,1962 టోల్ ఫ్రీ నెంబ?ర్ కు కాల్ చేస్తే పశువులకు వైద్యం అందించేందుకు అంబులెన్స్ లు గ్రామాలకు చేరుకుంటాయని వెల్లడించారు. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పశుసంవర్ధక రంగం ముఖ్యంగా మహిళల జీవనోపాధికి కీలకమని పేర్కొన్న మంత్రి అచ్చెన్నాయుడు, స్వర్ణాంధ్ర--2047 లక్ష్యంగా పాలు, మాంసం, గుడ్లు ఉత్పత్తుల్లో దేశంలో తొలి మూడు స్థానాల్లో నిలవాలనే దిశగా స్పష్టమైన కార్యాచరణ అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్య?క్ర?మంలో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మచిలీపట్నం పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు వీరంకి గురుమూర్తి, గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, టిడిపి నాయకులు గొడ్డళ్ల చిన్న రామారావు, బండి వెంకట్రావు (నాని), దయాల రాజేశ్వరరావు, గూడపాటి తులసి మోహన్, కోనేరు నాగేంద్ర కుమార్, బిజెపి నాయకులు కురుమద్దాలి ఫణి కుమార్, కానూరి శేషు మాధవి, నాదెండ్ల మోహన్, ఉయ్యూరు వెంకటేశ్వరరెడ్డి, జనసేన పార్టీ నాయకులు పొదిలి దుర్గారావు, మేకల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## దావోస్ పర్యటన అసలు ఉద్దేశ్యం క్లియర్‌గా చెప్పిన లోకేష్!

ఏపీ మంత్రి నారా లోకేష్ స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ చేరుకున్నారు. ఈ సమయంలో.. విమానాశ్రయం వద్ద ఆయనకు ఎన్.ఆర్.ఐ టీడీపీ నేతలు, ప్రవాసాంధ్రులు ఘనస్వాగతం పలికారు.

ఏపీ మంత్రి నారా లోకేష్ స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ చేరుకున్నారు. ఈ సమయంలో.. విమానాశ్రయం వద్ద ఆయనకు ఎన్.ఆర్.ఐ టీడీపీ నేతలు, ప్రవాసాంధ్రులు ఘనస్వాగతం పలికారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు లోకేష్ అక్కడి నుంచి దావోస్‌కు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌ని నమ్మకమైన గ్లోబల్ గమ్యంగా నిలపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేష్ అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్? చేశారు. ఈ పర్యటన అసలు ఉద్దేశ్యాన్ని క్లియర్ గా చెప్పారు.

అవును... ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం కార్యక్రమంలో పాల్గొనడానికి స్విట్జర్లాండ్‌కు రెగ్యులర్ గా వెళ్లేవారనే సంగతి తెలిసిందే. 90వ దశకంలోనే భారత్‌కు తొలి గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్లలో సీఎం చంద్రబాబు ఒకరుగా ఉండేవారు! ఈ క్రమంలో.. ఇటీవలి కాలంలో ఆయన కుమారుడు, ఏపీ ఐటీ మంత్రి నారా లోకేష్ కూడా ఆయనతో పాటు వస్తున్నారు.. ఈ క్రమంలో... దావోస్ పర్యటనలపై ఆసక్తికరమైన అభిప్రాయాన్ని వెల్లడించారు.

ఇందులో భాగంగా... దావోస్ కేవలం అవగాహన ఒప్పందాల(ఎంవోయూ)పై సంతకం చేయడం గురించి కాదని.. వ్యాపారం, సాంకేతికత, విధానం ఎక్కడికి సారథ్యం వహిస్తాయో అర్థం చేసుకోవడం గురించని.. సంబంధాలు నిర్మించబడేది, అంచనాలను పరీక్షించబడేది, సరైన ప్రశ్నలు అడగబడేది ఇక్కడే అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దావోస్ 2026లోకి అడుగుపెడుతున్నప్పుడు ఇది తన దృక్పథం అని బిజినెస్ లైన్‌కి రాసిన ఆర్టికల్‌ను ఆయన జతచేశారు. ఇదే సమయంలో... ఈ దావోస్ పర్యటనలు టెక్ పరిశ్రమలో మారుతున్న ధోరణుల గురించి పరిపాలనకు స్పష్టమైన దృక్పథాన్ని అందిస్తాయని.. వ్యాపార అధిపతులను కొన్ని కఠినమైన ప్రశ్నలు అడగవచ్చని ఐటీ మంత్రి తెలిపారు. వైజాగ్? లో ఇటీవలి గూగుల్ మెగా పెట్టుబడి కూడా 2025లో దావోస్? లో జరిగిన అధికారిక సంభాషణతో ప్రారంభమైందని.. ఇది కార్యరూపం దాల్చడానికి, పురోగతికి దారితీసిందని ఆయన జతచేశారు!

కాగా... ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు లోకేష్, టీజీ భరత్, అధికారుల బృందం గన్నవరం విమానాశ్రయం నుంచి ఆదివారం రాత్రి ఢిల్లీ వెళ్లింది. రాత్రి 1:45 గంటలకు ఢిల్లీ నుంచి బయల్దేరి భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 11 గంటలకు జ్యూరిక్? చేరుకున్నారు. మధ్యాహ్నం 2:30కి జ్యూరిక్‌లోని స్విట్జర్లాండ్ భారతీయ రాయబారి మృదుల్ కుమార్.. సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ ఉంటుంది!

సాయంత్రం 4 గంటలకు భారత ఎంబసీ ఆధ్వర్యంలో జ్యూరిక్‌లో నిర్వహించే తెలుగు డయాస్పోరా సమావేశంలో సీఎం పాల్గొని తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం.. జ్యూరిక్ నుంచి రోడ్డుమార్గంలో దావోస్‌కు వెళ్తారు. దావోస్‌లో తొలిరోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక, పర్యాటక విభాగాల మంత్రి అబ్దుల్లా బిన్? తౌక్? అల్? మర్రితో పాటు వివిధ దేశాల ప్రతినిధులతో జరిగే సమావేశంలో సీఎం పాల్గొంటారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## ప్రియుడితో కలిసి భర్త హత్య..

### భార్య సహా ముగ్గురు నిందితులు అరెస్టు



**అనకాపల్లి పట్టణం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రియుడితో అక్రమ సంబంధం కొనసాగించేందుకు అడ్డుగా ఉన్న భర్తను హత్య చేయించింది భార్య. ఈ ఘటన అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం తురువోలు గ్రామంలో జరిగింది. ఈ కేసుకు సంబంధించి మృతుడి భార్య సహా ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనకాపల్లి డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రావణి వివరాలు వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. "తురువోలుకి చెందిన దేగల చిన్న, కొండమ్మకు 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 12 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. చిన్న, అతని భార్య కొండమ్మ 2024లో వాకపల్లి గ్రామస్థులతో కలిసి తెనాలిలో కూలీ పనికి వెళ్లారు. ఇక్కడ కొండమ్మకు మేస్త్రీ గణేశ్?తో పరిచయం ఏర్పడింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం తెలుసుకున్న భర్త చిన్న.. కొండమ్మను తీసుకొని స్వగ్రామానికి వచ్చేశాడు. అయినా తరచూ కొండమ్మ.. గణేశ్‌తో ఫోన్లో మాట్లాడుతుండడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో చిన్నను అడ్డుతప్పించుకోవాలని భార్య కొండమ్మ భావించింది. విషయాన్ని ప్రియుడికి చెప్పడంతో ఈనెల 14న తెనాలి నుంచి గణేశ్, అతడి బంధువు శివకుమార్ చోడవరం వచ్చారు. చిన్న.. ద్విచక్ర వాహనంపై తురువోలు వస్తుండగా దారిలో గణేశ్, శివకుమార్ దాడి చేసి తలపై తీవ్రంగా గాయపరిచి హత్య చేశారు. హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలని ప్రయత్నించారు. పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేయడంతో అసలు విషయం బయటపడింది" అని డీఎస్పీ వివరించారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలైన భార్య కొండమ్మ, ప్రియుడు గణేశ్‌తో పాటు హత్యకు సహకరించిన శివకుమార్‌ను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రావణి తెలిపారు.

### కుమారుడి గొంతు కోసి.. తానూ కోసుకుని..

## తండ్రి ఘాతుకం.. ఇద్దరూ మృత్యువాత



**జన్నారం, విశ్వం వాయిస్ న్యూస్ :** అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ఓ తండ్రి.. దివ్యాంగుడైన తన కుమారుడిని హత్య చేసి, తానూ ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన ఆదివారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రాంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. జన్నారం ఎస్సై అనూష తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్‌కు చెందిన పాలగాని చిన్నభూమయ్య (38), స్వరూప దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కార్తిక్? (10) ఉన్నారు. భూమయ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. భార్య వ్యవసాయ కూలి పనులకు వెళ్తోంది. కాలేయ సంబంధ సమస్యలతో భూమయ్య రెండేళ్లుగా చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలోనే ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో కుమారుడి గొంతుకోసి, అదే కత్తితో తానూ గొంతు కోసుకుని ప్రాణాలు తీసుకున్నారు. భార్య, చిన్న కుమార్తె ఇంటి వెలుపల కూర్చోగా, ఇంట్లోనే ఉన్న పెద్ద కుమార్తెను బయటకు పంపించి ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. తండ్రి, కుమారుడు రక్తపు మడుగులో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వైకల్యంతో జన్మించిన కార్తిక్ నడవలేడు. పింఛన్‌కు దరఖాస్తు చేసినా మంజూరు కాలేదని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని, తన చికిత్సకు కూడా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి డబ్బు అందలేదని.. భూమయ్య ఓ కాగితం మీద రాసి పెట్టినట్లు సమాచారం. ఎస్సై మాత్రం అది సూసైడ్ నోట్ కాదని చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పెద్దఅంబర్‌పేట్ వద్ద కారు-ఆర్టీసీ బస్సు ఢీ..

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పెద్దఅంబర్‌పేట్ వద్ద కారు-ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. హైదరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సు ఖమ్మం వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకంది. ఈ ఘటనలో పలువురికి స్వల్పగాయాలయ్యాయి.

### మద్యం మత్తులో

## చెవి కొరికిన యువకుడు



**పులివెందుల, సింహాద్రిపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మద్యం మత్తులో ఓ యువకుడు మరో వ్యక్తి చెవి కొరికి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటన వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురం మండల పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రావులకొలను గ్రామానికి చెందిన వై.మౌనీశ్వరరెడ్డి, కె.రాజశేఖర్‌రెడ్డి కలిసి మద్యం తాగుతూ ఉండగా.. మాటామాటా పెరిగి ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో రాజశేఖర్?రెడ్డి.. మౌనీశ్వరరెడ్డి చెవి కొరకడంతో పాటు రాయితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పులివెందుల గ్రామీణ సీఐ రమణ తెలిపారు.

## భార్య గొంతు కోసిన భర్త..

### అడ్డొచ్చిన కుమార్తెపైనా దాడి

**సిద్దిపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** సిద్దిపేటలో దారుణం చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి తన భార్య గొంతు కోశాడు. పట్టణంలోని ఆదర్శనగర్‌లో ఈ ఘటన జరిగింది. భార్య శ్రీలత (40) గొంతు కోసిన ఎల్లయ్య.. అడ్డొచ్చిన కుమార్తె అర్చన పైనా రోకలి బండతో దాడి చేశాడు. అనంతరం భయంతో ఎల్లయ్య కూడా గొంతు కోసుకున్నాడు. శ్రీలత మృతిచెందగా.. గాయాలతో ఉన్న ఎల్లయ్య, అర్చనను ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు.

## ఝార్ఖండ్‌లో పెళ్లి బస్సు బోల్తా

### 9 మంది మృతి.. 80 మందికి గాయాలు

**లాతేహార్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఝార్ఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఓ పెళ్లి బస్సు బోల్తా పడి 9 మంది మృతిచెందగా.. 80మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో అయిదుగురు మహిళలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో 32 మంది పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. ఈ బస్సు ఛత్తీస్‌గఢ్‌లోని బలరాంపుర్ జిల్లా నుంచి ఝార్ఖండ్‌లోని లాతేహర్ జిల్లా మహువాడనార్ వస్తున్న క్రమంలో ఆదివారం ఓర్సా బంగ్లాదర లోయ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో బస్సులో 90 మంది వరకు ఉన్నారు. బ్రేకులు విఫలం కావడంతోనే బస్సు ప్రమాదానికి గురైనట్లు పోలీసులు తెలిపారు.

**మధ్యప్రదేశ్‌లో కారు బీభత్సం**

మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్‌లో ఆదివారం ఓ కారు బీభత్సం సృష్టించింది. మహిళా కార్మికులపైకి అది వేగంగా దూసుకెళ్లడంతో ఇద్దరు మృతిచెందగా, 11 మంది గాయపడ్డారు. రోడ్డు డివైడర్ రెయిలింగ్ పనుల కోసం వచ్చిన మహిళలు మధ్యాహ్నం భోజనం చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని నొయిడాలో శనివారం భవన నిర్మాణం కోసం తవ్విన నీటి కుంటలో పడి యువరాజ్ మెహతా(27) అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతిచెందారు. పొగమంచు వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

### హత్యాయత్నం కేసు నిందితులను

## రోడ్డుపై నడిపించిన పోలీసులు

### నిందితులను రోడ్డుపై నడిపిస్తున్న పోలీసులు

**నెల్లూరు (నేర విభాగం), విశ్వం వాయిస్ న్యూస్ :** వ్యక్తిపై హత్యాయత్నం చేసిన నిందితులను శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరులోని వేదాయపాలెం పోలీసులు ఆదివారం రాత్రి నగరంలో రోడ్డుపై నడిపించారు. పోలీసుల కథనం మేరకు.. స్టేషన్? పరిధిలోని అంబాపురం యల్లమ్మగుడి సమీపంలో నివాసం ఉంటున్న మనిదేవి అలియాస్? దేవపై ఈ నెల 16న రాత్రి రౌడీషీటర్లు రవి అలియాస్? ఏక్?బాల్, కృష్ణసాయి అలియాస్? కిట్టులతో పాటు వాసు, హుస్సేన్, మరో ఐదుగురు బాలురు హత్యాయత్నం చేశారు. వాహనాన్ని పక్కకు తీయనందుకు అతనిపై దాడి చేశారు. ఈ ఘటనపై దేవ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. నగర డీఎస్పీ దీక్ష పర్యవేక్షణలో గాంధీ బొమ్మ నుంచి వీఆర్సీ సెంటరు వరకు నలుగురు నిందితులను రోడ్డుపై నడిపించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని పోలీస్? అధికారులు హెచ్చరించారు.

# విద్యా వాయిస్



## చదివింది మర్చిపోతున్నారా.. ఇవిగో మెమొరీ టిప్స్?

ఏమాత్రం సమయం వృథా చేయకుండా ఎప్పుడు చూసినా చదువుతూనే ఉంటారు కొందరు విద్యార్థులు. కానీ, కొద్ది రోజులకే నేర్చుకున్నదంతా మర్చిపోతుంటారు. దీంతో పరీక్షలు దగ్గరపడేసరికి తీవ్ర ఒత్తిడికి గురై ఏం చేయాలో తెలియక ఇబ్బంది పడుతుంటారు. ఈ సమస్యకు నిపుణులు సూచిస్తున్న కొన్ని టిప్స్? ఇవే..

- చదివే ప్రదేశాన్ని నిశ్శబ్దంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేలా చూసుకోవాలి. ఇలా ఉంటే మీ దృష్టిని పూర్తిగా చదివే అంశం మీదే కేంద్రీకరించడానికి వీలవుతుంది. చదివింది గుర్తుండాలంటే ఏకాగ్రత చాలా ముఖ్యం. ఏకాగ్రత నిలవాలంటే ప్రశాంతమైన వాతావరణం ఎంతో అవసరం. అందువల్ల ప్రశాంతంగా ఉండే ప్రదేశాన్ని ఎంచుకుని చదవడం అలవాటు చేసుకోండి.
- మీ దగ్గరున్న సమాచారాన్ని చిన్న పదాలు, వాక్యాలుగా విభజించుకోవచ్చు. పదాల్లోని మొదటి అక్షరాన్ని గుర్తుంచుకుంటే మొత్తం పదం, ఆ తర్వాత సంబంధిత వాక్యం వెంటనే గుర్తొచ్చే అవకాశం ఉంటుంది.
- సబ్జెక్టుల్ని బట్టీపట్టడానికే ప్రాధాన్యం ఇవ్వొద్దు. అర్థంచేసుకుంటూ చదివితే ఎక్కువ కాలంపాటు గుర్తుండిపోతుంది. సమాచారం అంతటినీ ఒకేసారి చదివి గుర్తుపెట్టుకోవాలని అనుకోవద్దు. వ్యాసాన్ని చిన్నచిన్న భాగాలుగా విభజించుకుని చదివితే గుర్తుంచుకోవడం సులువు.
- కొన్ని పేర్లను వాటి వెనుక ఉండే అంతర్?సూత్రం



ఆధారంగా చదివితే ఎక్కువ కాలం గుర్తుంటాయి. ఉదాహరణకు రాష్ట్రాల పేర్లను ఆల్ఫాబెటికల్? క్రమంలో గుర్తుపెట్టుకోవచ్చు. ఇలాచేస్తే మధ్యలో ఏ ఒక్క రాష్ట్రం పేరునూ మర్చిపోయే అవకాశం ఉండదు. అలాగే గ్రహాల పేర్లను వాటి పరిమాణం ఆధారంగా చిన్నవాటి నుంచి పెద్దవాటిని గుర్తుపెట్టుకోవచ్చు.
- ప్రముఖుల పేర్లను గుర్తుంచుకునే క్రమంలో వారి రూపాన్ని జ్ఞాపకం పెట్టుకోవడం అలవాటు చేసుకోండి. ఆ పేరున్న వ్యక్తి ఇలా ఉంటారు.. అని ఒకసారి అనుకుంటే.. సంబంధిత వ్యక్తి ఫొటో చూడగానే వారి పేరు టక్కున గుర్తుకొస్తుంది.
- పాఠాలను ఎప్పుడూ పరీక్షల దృష్టితోనే చదవకండి. ఇష్టంగా చదివితే నేర్చుకోవడం ఎప్పుడూ కష్టంగా ఉండదని తెలుసుకోండి. నేర్చుకోవడంలోని ముఖ్యోద్దేశం.. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవడమే కాకూడదు.
- కొత్త విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస ఎప్పుడూ మీలో ఉండాలి. అలాగైతే పాఠాలేవీ విసుగ్గా అనిపించవు. కొత్త విషయాలనూ ఎంతో ఇష్టంగా నేర్చుకోగలుగుతారు.
- విద్యా సంవత్సరం ప్రారంభ సమయంలో కొన్ని పాఠాలను చదువుతారు. తిరిగి సంవత్సరాంతంలో మాత్రమే మళ్లీ వాటిని చదువుతారు కొందరు. అలాకాకుండా సమయం ఉన్నప్పుడు మధ్యలో ఒకసారి సమీక్షించుకుంటే మంచిది. దీంతో అవన్నీ మీకు ఎంతవరకు గుర్తున్నాయో తెలుస్తుంది. మర్చిపోతే మళ్లీ ఒకసారి చదవడానికి అవకాశం ఉంటుంది.
- ప్రతి పాఠంలోని ముఖ్యాంశాలతో నోట్సు రాయడాన్ని అలవాటు చేసుకోండి. పరీక్షల ముందు వీటిని ఒకసారి చదువుకుంటే ఒత్తిడికి గురికాకుండా ఉంటారు. అలాగే చదివిన వాటిని ఎప్పటికప్పుడు చూడకుండా రాయడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల విషయం ఎంతవరకు గుర్తుందో తెలుస్తుంది. సగం మాత్రమే గుర్తుంటే మిగతా సగాన్ని మళ్లీ చదువుకుని, చూడకుండా రాయొచ్చు.
- ఎప్పుడూ ఒకేచోట కూర్చుని చదవడం వల్ల ఒక్కోసారి కాస్త విసుగ్గా అనిపించొచ్చు. చదివే ప్రదేశాన్ని అప్పుడప్పుడూ మారుస్తుండాలి. కుటుంబ సభ్యుల మాటలు, టీవీ, స్మార్ట్?ఫోన్? వల్ల మీ ఏకాగ్రతకు ఏమాత్రం భంగం కలగకుండా చూసుకోండి.
- గాలి, వెలుతురు ఉండే ప్రదేశాన్ని ఎంచుకుంటే మంచిది. అలాగే మధ్యలో కాస్త చిరాగ్గా అనిపించినప్పుడు పరిసరాలను గమనించడం ద్వారా సేదతీరొచ్చు. ఆ తర్వాత మళ్లీ చదవడం మొదలు పెట్టొచ్చు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

మంగళవారం, 20 జనవరి 2026




www.viswamvoice.com



# వి-కేర్‌లో అందమే శాపంగా మారింది

## అందమైన స్కీమే.... అంద హీనంగా మారిన కొవ్వూరు కృష్ణారెడ్డి

అందంగా కనిపించాలనే ఆశ, ముఖంపై ఉన్న చిన్న సమస్య కూడా జీవితాన్ని మార్చేస్తుందనే భయం.. ఇదే కార్పొరేట్ హెల్త్ సెంటర్లు తమ వ్యాపారానికి మూలధనంగామార్చుకుంటున్నాయా అన్న సందేహాలకు కాకినాడ భానుగుడిలోని వి కేర్ హెల్త్ క్లినిక్ ఘటన బలమైన ఉదాహరణగా మారింది.గొల్లలమామిడాడకు చెందిన కొవ్వూరు కృష్ణా రెడ్డి ముఖంపై నల్ల మచ్చలు రావడంతో మెరుగైన వైద్యం ఆశించి కాకినాడ భానుగుడి వి కేర్ సెంటర్‌ను ఆశ్రయించారు. బాధితుడి వాదన ప్రకారం, తొలుత రూ.13 వేల స్కీమ్ ప్యాకేజీ అంటూ చికిత్స ప్రారంభించారు. నిర్ణీత గడువులో ఎటువంటి మెరుగుదల కనిపించకపోగా, ముఖ చర్మం మరింత మొద్దుబారిపోయి గతం కంటే అందహీనంగా మారింది. దీనిపై ప్రశ్నించగా, "బెటర్ ట్రీట్మెంట్" పేరుతో మరో ప్యాకేజీ అవసరమని చెప్పి చికిత్స ఖర్చును క్రమంగా పెంచారని బాధితుడు ఆరోపిస్తున్నారు. అలా మొత్తంగా ఖర్చు సుమారు రూ.50 వేలకు చేరినా ఆశించిన ఫలితం రాకపోవడం, పైగా చర్మ సమస్య మరింత తీవ్రమవడంతో చివరికి మరో చర్మ వైద్యుడిని ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు.తమకు జరిగిన అన్యాయంపై వి కేర్ సెంటర్ వైద్యులు, సిబ్బందిని కలిసి వివరణ కోరేందుకు ప్రయత్నించగా, నిర్లక్ష్య సమాధానాలు, బాధ్యత లేని వ్యవహారమే ఎదురైందని బాధితుడు వాపోతున్నారు. ఈ ఘటన తనకు మానసికంగా, ఆర్థికంగా తీవ్ర నష్టం కలిగించిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, కాకినాడ భానుగుడి వి కేర్ సెంటర్‌పై మోసం, దోపిడీ ఆరోపణలతో పోలీసులకు ఫిర్యాదు చేయాలని బాధితుడు నిర్ణయించినట్లు సమాచారం.ఇది ఒక్కరి గాథ కాదు..!ఇలాంటి ఘటనలు ఇప్పుడు ఒంటరి కేసులుగా మిగలడం లేదు. "ప్యాకేజీలు", "గ్యారంటీ ఫలితాలు", "లేటెస్ట్ టెక్నాలజీ" వంటి ఆకర్షణీయమైన పదాలతో సామాన్యులను ఆకట్టుకుంటూ, వారి భయాలు, బలహీనతలను ఆసరాగా చేసుకుని లక్షల రూపాయలు వసూలు చేస్తున్న కార్పొరేట్ హెల్త్ సెంటర్లపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చికిత్స ఫలితం రాకపోతే బాధ్యత ఎవరిది?

పేషెంట్ భద్రత, చర్మంపై జరిగే దుష్ప్రభావాలకు ఎవరు జవాబుదారు?

ప్యాకేజీల పేరుతో జరిగే వాణిజ్య వైద్యం పై పర్యవేక్షణ లేదా?

ఈ ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానాలు కనిపించడంలేదు. ప్రభుత్వ నియంత్రణ లోపం, వైద్య నైతికతకు దూరంగా సాగుతున్న వ్యాపార ధోరణే ఇలాంటి ఘటనలకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అందం కోసం ఆశ్రయించిన వైద్యం చివరికి బాధగా మారకూడదు. ఈ ఘటనపై అధికారులు, వైద్య మండళ్లు, వినియోగదారుల హక్కుల సంఘాలు స్పందించి పూర్తి స్థాయి విచారణ జరపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే, అమాయకుల బలహీనతే పెట్టుబడిగా మారి కార్పొరేట్ దోపిడీ మరింత పెరిగే ప్రమాదం ఉంది.



### మంగళగిరిలో

# ఎయిర్ పోర్ట్‌ను తలదన్నేలా.. రైల్వే హబ్..

## కొత్త రూపు దిద్దుకుంటున్న రైల్వే స్టేషన్స్!




అమృత్ భారత్ పథకంలో భాగంగా రాయనపాడు, మంగళగిరి రైల్వే స్టేషన్లు ఆధునిక రూపురేఖలు సంతరించుకుంటున్నాయి. కొత్త టెక్నాలజీ, అత్యాధునిక సౌకర్యాలతో ఎయిర్?పోర్టుల తరహాలో అభివృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికే ఆయా రైల్వే స్టేషన్‌ల పునర్నిర్మాణ పనులు 80-95% పూర్తయ్యాయి. వచ్చే ఏడాది ప్రయాణికులకు అందుబాటులోకి రానున్న ఈ స్టేషన్లు విజయవాడ రైల్వే స్టేషన్‌పై ఒత్తిడిని తగ్గిస్తాయి, ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరుస్తాయి. అమరావతి రాజధాని పరిధిలోని రాయనపాడు రైల్వే స్టేషన్‌కు మహర్దశ పట్టింది. సెంట్రల్ గవర్నమెంట్ అమలు చేస్తున్న అమృత్ భారత్ స్టేషన్లో భాగంగా ప్రస్తుతం ఈ రైల్వే స్టేషన్? నూతన సాంకేతికతతో రూపుదిద్దుకుంటుంది. ఇప్పటికే దీని పునర్నిర్మాణ పనులు దాదాపు 80% వరకు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది ఈ స్టేషన్ ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇదొక్కటే కాదు మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి రైల్వే స్టేషన్ సైతం కొత్త రూపులు దిద్దకుంటుందోంది. మంగళగిరి రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు సైతం సుమారు 95% పూర్తయ్యాయి. ఎయిర్పోర్టుల తరహాలో ఓ కాంప్రహెన్సివ్ ట్రావెల్ హబ్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. నూతన టెక్నాలజీ అత్యాధునిక సౌకర్యాలతో త్వరలోనే ఈ రైల్వే స్టేషన్? ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. ఇక్కడ సర్కులేటింగ్ ఏరియా పార్కింగ్, విఐపి లాంచ్, రియర్ సైడ్ బిల్డింగ్ , ఇప్పటికే రెడీ అయ్యాయి. ప్లాట్ ఫామ్ సర్ఫాసింగ్, వికలాంగులకు సౌకర్యాలు, ఫేకెట్ పనుల పురోగతిలో ఉన్నాయి. రైలు ప్రయాణం చేసే ప్రయాణికులకు ఆధునిక, మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి సెంట్రల్ గవర్నమెంట్ అమృత్ భారత్ పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకంలో భాగంగా కింద ఎంపిక చేసిన స్టేషనులను డెవలప్ చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే ఇందులో విజయవాడ, విశాఖ, తిరుపతి, నెల్లూరు, ఆదోని, అనంతపురం, చీరాల, చిత్తూరు, కడప, ధర్మవరం, గుడివాడ, గుత్తి, గుంటూరు, హిందూపురం, కదిరి, కాకినాడ టౌన్, కొత్తవలస జంక్షన్, కర్నూలు, కుప్పం, రాజమండ్రి, ఒంగోలు, రేణిగుంట, రాజంపేట వంటి స్టేషన్లు ఉన్నాయి. రాయనపాడు స్టేషన్ కూడా ఇందులో భాగంగానే పునర్నిర్మాణం అవుతుంది. ఇక్కడ ఫ్లాట్ ఫార్ములా నిర్మాణం , టికెట్ కౌంటర్లు, వెయిటింగ్ హాల్లు, ఫ్లాట్ ఫామ్‌లపైన షెడ్ల నిర్మాణం ఇప్పటికే దాదాపు పూర్తయ్యాయి.. రైల్వే స్టేషన్ నూతన వసతులతో కొత్తగా అందుబాటులోకి రానుంది. స్టేషన్ ముఖద్వారం విశాలమైన సర్కులేటింగ్ ఏరియా లిస్టులు, వెయిటింగ్ హాల్లు, టాయిలెట్స్, రూపుమార్చిన ఫ్లాట్ ఫామ్ వంటి సౌకర్యాలు ఇందులో ఉన్నాయి. అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత మరిన్ని రైళ్లు ఆగేందుకు అవకాశం కూడా ఉంటుంది. దీంతో విజయవాడ రైల్వే స్టేషన్ పై ఒత్తిడి తగ్గే అవకాశాలు ఉన్నాయి.. విజయవాడలో ప్రస్తుతం నిత్యం 100కు పైగా రైలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. జనాల తాకిడి అధికంగా ఉంటుంది.. దీనికి ప్రత్యామ్నాయంగా రాయనపాడు స్టేషన్ను అభివృద్ధి చేయటం వలన మరికొన్ని రైళ్లకు ఇక్కడ హాల్టు సౌకర్యం కల్పించడానికి వీలవుతుందని అధికారులు చెబుతున్నారు.

### ఆకాశంలో నక్షత్రంలా మెరిసిన

# వ్యోమగామి జాహ్నవి

## అమలాపురంలో ఘన సత్కారం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతదేశానికి గర్వకారణమైన అతి పిన్న వయస్కురాలు, వ్యోమగామి జాహ్నవి తన భర్త, సాఫ్ట్‌వేర్ అధినేత సతీష్‌తో కలిసి అమలాపురం పట్టణంలోని సూర్యనగర్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త డాక్టర్ రాయుడు శ్రీ రామ చంద్ర మూర్తి ఆధ్వర్యంలో ఆమెకు ఘనంగా స్వాగతం పలికి, పలువురు ప్రముఖులు సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాయుడు మాట్లాడుతూ అంతరిక్షంలోకి అడుగుపెడుతున్న తొలి భారతీయ మహిళగా జాహ్నవి ఎంపిక కావడం ప్రతి భారతీయుడికి గర్వకారణం. అమెరికాకు చెందిన అంతరిక్ష పరిశోధనా సంస్థ టైటాన్ స్పేస్ నిర్వహిస్తున్న టైటాన్ స్పేస్ మిషన్కు వ్యోమగామిగా ఎంపిక కావడం ఆమె ప్రతిభకు నిదర్శనం" అని అన్నారు. చిన్నతనంలో అమ్మమ్మ చెప్పిన చందమామ కథలను నిజం చేస్తూ, జాహ్నవి అంతరిక్ష పరిశోధనల దిశగా ముందుకు సాగుతున్నారని కొనియాడారు. 2029లో ఐదు గంటల పాటు జరిగే అంతరిక్ష పరిశోధనలు మానవాళికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. జాహ్నవి 2022లో పోలాండ్‌లో మూడు సంవత్సరాలు కఠిన శిక్షణ పొంది అనలాగ్ వ్యోమగామిగా గుర్తింపు పొందారని, అలాగే సెస్నా 171 స్కై హాక్ విమానం నడిపి విజయవంతమయ్యారని పేర్కొన్నారు. వ్యోమగామికి అవసరమైన అన్ని కఠిన పరీక్షలను ఆమె విజయవంతంగా పూర్తి చేసిందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇంటర్నేషనల్ రిగ్‌మాన్ విత్తనాల శ్రీనివాస్ మాట్లాడుతూ "అంతరిక్షంలో జరిగే పరిశోధనలు మానవాళి మనుగడకు దోహదపడేలా ఉండాలి" అని ఆకాంక్షించారు. కరాటం ప్రవీణ్ మాట్లాడుతూ జాహ్నవి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. అండర్ వాటర్ రాకెట్ లాంచ్, ఎయిర్‌క్రాఫ్ట్ డ్రైవింగ్, జీరో గ్రావిటీ వంటి అనేక అంశాల్లో శిక్షణ పొంది, 16 దేశాల ప్రతినిధులకు మార్గదర్శిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కారటం ప్రవీణ్, డాక్టర్ రాయుడు తదితరులు జాహ్నవిని ఘనంగా సత్కరించారు.

# రైతు సంక్షేమానికి అండగా ప్రభుత్వం

## వన్నె చింతలపూడిలో ఉచిత పశువైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం రూరల్ మండలం వన్నె చింతలపూడి గ్రామంలో పాడి రైతులకు ఉపయోగ పడేలా ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయగా, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. పాడి పశువులే అనేక రైతు కుటుంబాలకు ప్రధాన జీవనాధారమని గుర్తించిన ఎమ్మెల్యే ఆనందరావు, శిబిరం నిర్వహణను స్వయంగా పర్యవేక్షిస్తూ రైతులతో నేరుగా మాట్లాడారు. పశువులకు అవసరమైన వైద్య పరీక్షలు, టీకాలు, మందుల పంపిణీ సక్రమంగా జరుగుతున్నాయా లేదా అన్న విషయాలను పరిశీలించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, వాటిపై తక్షణమే వైద్యుల ద్వారా సూచనలు అందేలా చర్యలు తీసుకున్నారు. శిబిరంలో పాల్గొన్న రైతులు తమ పశువుల ఆరోగ్య స్థితిగతులపై వైద్యులతో చర్చించడంతో పాటు, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పొందారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత సేవలు అందడం వల్ల ఖర్చులు తగ్గడమే కాకుండా పశువుల ఆరోగ్యం మెరుగుపడుతుందని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ, పశుసంవర్ధక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. రైతుల ఆదాయం పెరగాలంటే పశువుల ఆరోగ్యం కాపాడటం అత్యంత అవసరమని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో ఇలాంటి ఉచిత పశువైద్య శిబిరాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆనందరావు కోరారు. రైతుల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకే తీసుకెళ్లే నాయకత్వానికి ఈ శిబిరం మరో ఉదాహరణగా నిలిచింది.

# ప్రజాకవి యోగి వేమన అందరికీ ఆదర్శప్రాయుడు : జిల్లా ఎస్పీ రాహుల్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ కార్యాలయంలో యోగి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి, దీప ప్రజ్వలన చేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు సాహిత్యంలో యోగి వేమన ఒక ధ్రువతారగా నిలిచారని, తన పద్యాల ద్వారా సమాజంలోని అజ్ఞానం, మూఢనమ్మకాలు, అసమానతలను ఎండగట్టిన గొప్ప సంస్కర్తగా ఆయనను కొనియాడారు. అత్యంత సరళమైన భాషలో గూఢార్థాలను బోధించి సమాజ హితాన్ని కాంక్షించిన ప్రజాకవిగా వేమన ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. "విశ్వదాభిరామ వినుర వేమ" అనే మకుటంతో ఆయన రచించిన ప్రతి పద్యం ఒక నీతిశాస్త్రంలాంటిదని, మానవ సంబంధాలు, జీవన విలువలపై ఆయన చెప్పిన సందేశాలు నేటికీ, ఏనాటికీ వర్తిస్తాయని పేర్కొన్నారు. సత్యం, నిష్కపటత్వం, సామాజిక బాధ్యత వంటి వేమన సిద్ధాంతాలను పోలీస్ సిబ్బంది తమ విధుల్లో స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ.వి.ఆర్.పి.బి. ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, ఎస్‌బీసీఐ పుల్లారావు, సోషల్ మీడియా సీఐ తమ్మినాయుడు, ఏఆర్ ఆరచవతీతీచ బ్రహ్మానందం తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయ పరిపాలనా విభాగం సిబ్బంది, ఏఆర్ పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని యోగి వేమనకు ఘన నివాళులు అర్పించారు. వేమన జయంతి సందర్భంగా ఆయన సమాజానికి అందించిన విలువైన సందేశాలను స్మరించుకున్నారు.

### అంతర్వేదిలో లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ ఉత్సవ కమిటీ

# ప్రమాణస్వీకారానికి హాజరైన ఎంపీ హరీష్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం అంతర్వేదిలో నిర్వహించిన లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ ఉత్సవ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన దెందుకూరి రమేష్ (రాంబాబు రాజు)కు, కమిటీ సభ్యులకు ఎంపీ హరీష్ బాలయోగి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. అంతర్వేది ఆలయం రాష్ట్ర స్థాయిలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమని, ఉత్సవాల నిర్వహణలో సంప్రదాయాలకు తోడు క్రమశిక్షణ, భక్తి భావన ముఖ్యమని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

ప్రజా సంతృప్తే ప్రభుత్వ సేవల్లో నాణ్యతకు

# గీటురాయిగా నిలుస్తుంది : కలెక్టర్ మహేష్

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీ.జి.ఆర్.ఎస్) కార్యక్రమంలో అర్జీలు స్వీకరించిన అనంతరం ఆయన ప్రసంగిస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని సకాలంలో, నిబద్ధతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాస్వామ్య పాలనకు నిదర్శనంగా అర్జీల పరిష్కార విధానం ఉండాలని సూచించారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీకి నిబంధనల మేరకు పరిష్కారం చూపేలా అధికారులు, సిబ్బంది బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు. అర్జీదారులకు నాణ్యతతో కూడిన సేవలు అందించడం ద్వారా ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో విశ్వసనీయత పెరుగుతుందని పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం వహించరాదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం లభించేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పీ.జి.ఆర్.ఎస్ అర్జీదారులతో సంబంధిత అధికారులు నేరుగా మాట్లాడాలని, సరైన విధంగా ఎండార్స్‌మెంట్లు ఇవ్వాలని సూచించారు. అర్జీదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చేలా చిత్తశుద్ధి, క్రమశిక్షణతో పని చేయాలని



తెలిపారు. ఫిర్యాదుల ఆడిటింగ్?ను సక్రమంగా పూర్తి చేయాలని, సమస్య పరిష్కార అధికారి స్వయంగా ఎండార్స్?మెంట్ ఇవ్వాలని సూచించారు. అర్జీదారుల నుంచి వచ్చిన ప్రతి ఫీడ్‌బ్యాక్‌ను నిశితంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 160 అర్జీలు అందినట్లు చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల్లో భాగంగా 'ఐ గాట్ కర్మయోగి' శిక్షణను పూర్తి చేయాలని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. పీ.జి.ఆర్.ఎస్ వినతుల పరిష్కార ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ఆర్‌టీజీఎస్‌పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఇకపై ఈ కార్యాలయం ద్వారానే ఫైళ్లు సమర్పించాలని, కేపీఐ (పనితీరు సూచికలు)లను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి మాట్లాడుతూ, రెవెన్యూ సమస్యల వేగవంత పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్లు దోహదపడతాయని తెలిపారు. ఫిర్యాదులను నాణ్యతతో, త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుగా ఈ క్లినిక్లు ఉపయోగపడతాయని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రెవెన్యూ ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు రెవెన్యూ క్లినిక్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి సోమవారం రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో అర్జీలను సరైన విధంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. అర్జీదారులు సమర్పించిన ధ్రువపత్రాలను పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన పత్రాలపై పిటిషనర్లకు మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కే.మాధవి, డ్వామా పీడీ ఎస్. మధుసూదన్, సమగ్ర శిక్ష ఏపీసీ జి. మమ్మీ, డీఎల్‌డీఓలు రాజేశ్వరరావు, వేణుగోపాల్‌తో పాటు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సిఐ శేఖర్ బాబు ఎస్ఐ చంటి చేతుల మీదుగా

# విశ్వం వాయిస్ క్యాలెండర్ ఆవిష్కరణ

**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో విశ్వం వాయిస్ 2026 క్యాలెండర్ ఆవిష్కరించి రావులపాలెం సిఐ శేఖర్ బాబు ఎస్సై చంటి విశ్వం వాయిస్ పత్రికకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

## జిల్లా వ్యాప్తంగా స్టాప్ వాష్ అండ్ గో కార్యక్రమం : జిల్లా ఎస్పీ రాహుల్ మీనా



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆదేశాల మేరకు 'ఆగి ముఖం కడిగి ప్రయాణం కొనసాగించండి' అనే వినూత్న కార్యక్రమాన్ని జిల్లా పోలీసు యంత్రాంగం ముమ్మరంగా అమలు చేస్తోంది. అర్ధరాత్రి, తెల్లవారుజామున వాహనాలు నడిపే డ్రైవర్లు నిద్రమత్తుకు లోనవడం వల్ల జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని గుర్తించిన పోలీసు శాఖ, డ్రైవర్ల అప్రమత్తత పెంచేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా అర్ధరాత్రి దాటిన అనంతరం రహదారులపై ప్రయాణించే లారీలు, బస్సులు, వ్యాన్లు, కార్లను పోలీసు అధికారులు నిలిపివేస్తున్నారు. నిద్రమత్తులో ఉన్న డ్రైవర్లను గుర్తించి, వారిని వాహనం నుండి దిగమని సూచించి, నీళ్లతో ముఖం కడుక్కునేలా చేసి పూర్తిగా అప్రమత్తమైన అనంతరమే ప్రయాణానికి అనుమతి ఇస్తున్నారు. వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు తమ ప్రాణాలతో పాటు ఇంటి వద్ద వేచి ఉన్న కుటుంబ సభ్యుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. కాసేపు విశ్రాంతి తీసుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని హితబోధ చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ మాట్లాడుతూ "ప్రతి ప్రాణం అమూల్యమైనది. డ్రైవర్లు కొద్దిసేపు ఆగి ముఖం కడుక్కోవడం లేదా విశ్రాంతి తీసుకోవడం ద్వారా ప్రాణాంతక ప్రమాదాలను నివారించవచ్చు" అని తెలిపారు. నిద్రమత్తు వల్ల కలిగే అనర్థాలను నివారించేందుకు ప్రజలు, డ్రైవర్లు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

# బాధితుల సమస్యలకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యం

## జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించాలనే లక్ష్యంతో సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్)కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ , జిల్లా అదనపు ఎస్పీ ఏ.వి.ఆర్.పి.బి. ప్రసాద్ తో కలిసి పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ప్రతి అర్జీదారునితో ముఖాముఖి చర్చలు జరిపి, వారి సమస్యలను సానుకూలంగా, క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 25 ఫిర్యాదులు అందాయి. ప్రధానంగా భూ తగాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, సివిల్ తగాదాలకు, సంబంధించిన ఫిర్యాదులు అధికంగా నమోదయ్యాయి. స్వీకరించిన అర్జీలను తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించారు. ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. చట్టపరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారరు. ప్రజలకు పోలీసు వ్యవస్థపై మరింత నమ్మకం కలిగేలా



ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ , అదనపు ఎస్పీ ఏ.వి.ఆర్.పి.బి. ప్రసాద్ తో పాటు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో

# పేద, మధ్యతరగతి వర్గాలకు ఆర్థిక చేయూత : ఎమ్మెల్యే బండారు

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజారోగ్యానికి భరోసాగా సీఎం రిలీఫ్ ఫండ్ నిలుస్తుందని, సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేద,మధ్యతరగతి వర్గాలకు చెందిన రోగులకు ఆర్థికంగా చేయూత లభిస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు.



వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్ అనేది పేదలకు అందని ద్రాక్షగా ఉండేదన్నారు. తమకు కావలసినవారికి మాత్రమే రిలీఫ్ ఫండ్ అందజేసేవారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలందరికీ మేలు జరుగుతుందన్నారు. అటు ఎన్టీఆర్ ఆరోగ్య సేవ, ఇటు ఇన్సూరెన్స్ కవర్ కాని రోగులకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆత్రేయపురం మండలానికి చెందిన ముగ్గురికి(రెండు చెక్కులు, ఒక ఎల్వోసీ) రూ.97,339లు, రావులపాలెం మండలానికి చెందిన ఇద్దరికి రూ.2,21,845లు, కొత్తపేట మండలానికి చెందిన 4గురికి రూ.2,73,168లు, ఆలమూరు మండలానికి చెందిన 8మందికి(6 చెక్కులు, 2 ఎల్వోసీలు) రూ.12,25,559లు, మొత్తం 17 మందికి రూ. 18,17,911 లు విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించిన

# కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం

## రైతుల ఆర్థిక పరిపుష్టికి పశు సంపదే పునాది - పశు సంరక్షణ, ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే పశు సంపద పరిరక్షణే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. కే గంగవరం మండలం సత్యవాడ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్, పశుసంవర్ధక శాఖ ఏడి రామకృష్ణ, కూటమి నాయకులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ ధ్యేయమని స్పష్టం చేశారు. పశువుల ఆరోగ్యం కాపాడితేనే రైతు కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, పశు వ్యాధుల



నివారణకు ఇలాంటి ఉచిత ఆరోగ్య శిబిరాలు ఎంతో అవసరమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు సకాలంలో వైద్య సేవలు అందకపోవడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని, ఆ సమస్యకు పరిష్కారంగా కూటమి ప్రభుత్వం ఈ ఈనెల 19 నుంచి 31 వరకు పశు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఈ శిబిరాల ద్వారా పశువులకు ఉచిత వైద్య పరీక్షలు, టీకాలు, మందుల పంపిణీ, పోషకాహారంపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. పశు ఆరోగ్య శిబిరాల వల్ల పశువుల మరణాలు తగ్గి, పాల ఉత్పత్తి పెరిగి, రైతుల ఆదాయం గణనీయంగా వృద్ధి చెందుతుందని నాయకులు వివరించారు. భవిష్యత్తులో కూడా ప్రతి గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తూ రైతులకు పూర్తి స్థాయిలో అండగా నిలుస్తామని, గ్రామీణాభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని సత్యం ఈ సందర్భంగా పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ ఏడి రామకృష్ణ మాట్లాడుతూ పశు సంరక్షణ కోసం ప్రభుత్వం ఈ ఉచిత శిబిరాలు నిర్వహిస్తోందని పాడి సంపద కలిగి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, తోట వెంకన్న, కూటమి పార్టీ నాయకులు, వైద్య అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి అధ్యక్షునిగా నితిన్ ఏకగ్రీవంగా ఎన్నికపై

# పాలూరి సత్యానందం హర్షం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షునిగా నితిన్ నబిన్ ఏకగ్రీవంగా ఎన్నికకావడం తో పాలూరి హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు జాతీయ అధ్యక్షుడు ఎంపిక కోసం నామినేషన్ ప్రక్రియ ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా ప్రారంభమైంది ఈ పదవికి తన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జెపీ నడ్డా, నితిన్ గట్కరీ నేతల సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగింది.నితిన్ అభ్యర్థిత్వానికి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి ఆంధ్రప్రదేశ్,తెలంగాణ నుంచి కూడా భారీ మద్దతు తెలుపుతూ నామినేషన్లు వేశారు.ఇతరులు ఎవ్వరూ నామినేషన్ వేయకపోవడంరో జాతీయ రిటర్నింగ్ అధికారి.కె లక్ష్మణ్ ఏకగ్రీవంగా నితిన్ ఎన్నుకోబడ్డారని ఆయన తెలిపారు.

వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో

# కూటమి ప్రభుత్వం దోపిడీ

## సనాతన వాది పవన్ కళ్యాణ్ ఎక్కడ

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం కూటమి ప్రభుత్వం దోపిడీకి అడ్డాగా మారిందని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఈ రోజు రావులపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రతిష్ఠను కూటమి ప్రభుత్వం దెబ్బతీస్తుంది అని ఆయన అన్నారు. నకిలీ టికెట్ల వివాదంలో ఒకరి మీద ఎఫ్ఐఆర్ వేసి మిగతా వాళ్లను కాపాడడం పై మీ ఉద్దేశం ఏమిటి అని ఆ నకిలీ టిక్కెట్ల వివాదంపై చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినేలాగా కూటమి చర్యలు చేస్తుంటే సనాతన వాదులు అని చెప్పుకుని తిరిగే పవన్ కళ్యాణ్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రతిష్టను దెబ్బతీస్తే ఊరుకునేది లేదని ప్రశ్నించడానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎప్పుడు మేముంటానని ఆయన తెలిపారు. అలాగే ఆత్రేయపురం సంక్రాంతి సంబరాలు పేరుతో చేసిన దోపిడీలో ప్రభుత్వం నుంచి వచ్చింది ఎంత అలాగే చందాల రూపంలో వచ్చింది ఎంత అనే విషయం ప్రజలకు లెక్క చెప్పాలని ఆయన అన్నారు. ప్రభుత్వం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని అక్కడ లోకల్ గా ఉన్న ఎంపీపీ మరియు జడ్పిటిసి ప్రోటోకాల్ ఎక్కడా అని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రమణారావు అధ్వర్యంలో

# ముద్రగడను కలిసిన వైసీపీ నాయకులు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నియోజకవర్గానికి చెందిన వైఎసచవతీతీచర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ముద్రగడ పద్మనాభంని ముద్రగడ గిరిబాబుని మర్యాద పూర్వకంగా అయిన స్వగృహం నందు కలిసి ఘనంగా సన్మానించారు. అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకులు కుంచే రమణారావు అధ్వర్యంలో వైసీపీ స్టేట్ ఎక్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ కుడుపూడి భరత్ భూషణ్, వేగిరాజు సాయిరాజు, తోట శ్రీను, బెజవాడ సత్తిబాబు, భీమనపల్లి గ్రామ సర్పంచ్ పెయ్యిల రాజ్ కుమార్, ఉప్పలగుప్తం మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, ఈదరపల్లి మాజీ సర్పంచ్ నక్క సంపత్ కుమార్, అల్లవరం మండల యువజన నాయకులు దేవరపల్లి నరేష్, నేరేడుమెల్లి శ్రీనివాసరావు, ఎం.వినోద్, పరమట రాజేష్, ముత్తాబత్తుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన నేత స్వర్గీయ పిండి సాయిబాబా 63వ జయంతి

## నివాళులర్పించిన స్థానిక నేతలు

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ అమలాపురం పట్టణ మాజీ అధ్యక్షుడు స్వర్గీయ పిండి సాయిబాబా 63వ జయంతి సందర్భంగా సోమవారం పట్టణానికి చెందిన పలువురు నేతలు, అభిమానులు స్థానిక వెచ్చావారి అగ్రహారం నందు గల సాయిబాబా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సాయిబాబా 6వ వార్డు ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ అనేక సేవలు అందించారని, అలాగే పట్టణ అధ్యక్షుడిగా జనసేన పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన భౌతికంగా లేకపోయినా, ప్రజల మనసుల్లో ఆయన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, మున్సిపల్ కౌన్సిలర్లు పిండి అమరావతి, బొర్రా వెంకటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నేత ఆశెట్టి ఆదిబాబు, జనసేన నేతలు పడాల నానాజీ, గొలకోటి వాసు, నాయకులు గోకరకొండ సూరిబాబు, పిండి రాజా, వంటెద్దు బాబు, ఉద్దిశ పెదబాబు, సలాది దొరబాబు, గునిశెట్టి రమేష్, గుండాబత్తుల దొరబాబు, అరిగెల రాంబాబు, ఆకులు భాస్కరరావు, పిండి సత్తికొండ, గునిశెట్టి సత్తిబాబు, గొలకోటి శ్రీహరి, ఆశెట్టి సుబ్బు, మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



### బాధిత జనసైనికుడికి

# జనసేన నాయకుల సహాయం



**తొండంగి, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని ఆదర్శంగా తీసుకొని కష్ట కాలంలో, ఆపదలో ఉన్నవారికి జనసైనికులు అండగా నిలుస్తున్నారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తొండంగి మండలం బెండపూడి గ్రామానికి చెందిన ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న జన సైనికుడు కె.సత్తిబాబు ఆపదలో ఉన్న విషయం తెలుసుకున్న వెంటనే తొండంగి మండల జనసేన పార్టీ నాయకత్వం మానవతా దృక్పథంతో స్పందించింది. తొండంగి మండల జనసేన పార్టీ అధ్యక్షులు బెండపూడి నాయుడు, బెండపూడి జనసేన పార్టీ నాయకులు దొరబాబు, ప్రవీణ్, గోపీ, హరి, దుర్గ, కుమార్ కలసి సత్తిబాబు కుటుంబ సభ్యులకు రూ. 10,000 ల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందించి ఏ జన సైనికుడూ ఎప్పుడూ ఒంటరి వాడు కాదని నిరూపించారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆశయాన్ని ఆచరణలో తనకు సాయం చేయడం ద్వారా నిజం చేసిన జన సైనికులకు కె.సత్తిబాబు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపాడు.

### ఆ రోజున

# చదువుల తల్లిగా బెజవాడ దుర్గమ్మ..

## విద్యార్థులకు ప్రసాదంగా..



విద్యార్థులకు శ్రీ కనకదుర్గమ్మ తల్లి దేవస్థానం శుభవార్తను తెలిపింది. ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఆలయంలో ఈనెల జనవరి 23వ తేదీన అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చిన విద్యార్థులకు చిన్న లడ్డు ప్రసాదం, పెన్ను , అమ్మవారి శక్తి కంకణం, పాకెట్ సైజు ఫోటో అందజేస్తామని ఈవో తెలిపారు. విద్యార్థులకు శ్రీ కనకదుర్గమ్మ తల్లి దేవస్థానం శుభవార్తను తెలిపింది. ఇంద్రకీలాద్రి పై కొలువైన కనకదుర్గమ్మ ఆలయంలో ఈనెల జనవరి 23వ తేదీన అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు నిరంతరంగా శ్రీ సరస్వతి దేవి అలంకరణలో భక్తులు దర్శనం ఇవ్వనున్నారు. దీనికి సంబంధించి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. దుర్గగుడిలో శ్రీ వసంతపంచమిని పురస్కరించుకొని.. జనవరి 23న కనకదుర్గమ్మ సరస్వతి దేవిగా దర్శనం ఇవ్వనున్నారు. ఆరోజు 500 మంది విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించడానికి ఏర్పాట్లను దేవస్థానం చేపట్టింది. ఉదయం 6 నుంచి రాత్రి 7:00 వరకు విద్యార్థులకు ఉచిత దర్శనం కల్పిస్తామని ఆలయ ఈవో శ్రీనా నాయక్ తెలిపారు. మహా మండపంలోని ఆరవ అంతస్తులో ఉత్సవ మూర్తి మూలవిరాట్?ని సరస్వతి దేవిగా అలంకరిస్తారని పేర్కొన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన విద్యార్థులకు చిన్న లడ్డు ప్రసాదం, పెన్ను , అమ్మవారి శక్తి కంకణం , పాకెట్ సైజు ఫోటో అందజేస్తామని ఈవో తెలిపారు. అలాగే సోమవారం నుంచి ఫిబ్రవరి 17వ తేదీ వరకు మాఘమాసం సందర్భంగా సూర్యోపాసన సేవ ఉంటుందని పేర్కొన్నారు. ఆదివారాలు, ఏకాదశి పర్వదినాలలో సూర్యోపాసన సేవ ఉంటుందని, అర్జిత సేవ రుసుము 1000 రూపాయలు చెల్లించి భక్తులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

# సంక్రాంతి సంబరాల్లో విదేశీ వనితలు..

### కట్టుబొట్టుతో ఆకట్టుకున్న ముద్దుగుమ్మలు




తెనాలిలో ఆస్ట్రేలియా విద్యార్థులు తెలుగు కట్టుబొట్టును అలంకరించి, స్థానిక సంప్రదాయాలను ఆస్వాదించారు. జోసెఫ్ పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా వచ్చిన వీరు, చీరలు, పంచెలతో సాంస్కృతిక మార్పిడిని ప్రదర్శించారు. పల్లెటూళ్లలో జీవన విధానాన్ని తెలుసుకుంటూ, సంక్రాంతి విశేషాలను పరిశీలించారు. విదేశీయులు తెలుగు సంస్కృతిని ఎంతగానో ప్రశంసించారు, సాంప్రదాయ వస్త్రధారణ పట్ల మక్కువ చూపారు. తెలుగింటి కట్టుబొట్టుకు ఎంతో ప్రత్యేకత ఉంది. ప్రత్యేక ఆహార్యం తెలుగువారి సొంతం.. పంచె కట్టులో పురుషులు, చీర చుట్టులో మహిళలు తమ ప్రత్యేకతను చాటుకుంటారు. విదేశాల నుండి వచ్చిన మహిళలు కూడా తెలుగువారి సాంప్రదాయ వస్త్రధారణ పట్ల మక్కువ చూపుతుంటారు. తెనాలిలో అటువంటి సందర్భమే వచ్చింది. తెనాలిలోని మారీసు పేటలో దయామణి జోసెఫ్ పాఠశాల ఉంది. పాఠశాల ప్రిన్సిపాల్ గా హేమలత కొనసాగుతున్నారు. హేమలత సోదరుడు సాగర్ అస్ట్రేలియాలోని నోట్రే డామ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. దీంతో ప్రతి ఏటా జోసెఫ్ పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొనడానికి ఆయన ప్రత్యేకంగా ఇండియా వస్తుంటారు. సాగర్ పనిచేసే విశ్వ విద్యాలయంలోని విద్యార్థులు కూడా ఇండియా పట్ల మక్కువ చూపుతుంటారు. ఇక్కడి ఆచార్యవ్యవహారాలంటే వారికి ఎంతో ఇష్టం. దీంతో సాగర్ ఇండియా వచ్చేటప్పుడు అస్ట్రేలియా నుండి కొంతమంది విద్యార్థులు తెనాలి వస్తారు. ఇలా వచ్చిన విదేశీ యువతి, యువకులు కొద్దీ రోజుల పాటు ఇక్కడే ఉంటారు. వార్షికోత్సవ సమయంలో తెలుగు వారి కట్టుబొట్టుతో ప్రత్యేకంగా రెడీ అవుతారు. తెనాలి చుట్టుపక్కల జరిగే సంక్రాంతి విశేషాలను తెలుసుకుంటారు. పండుగ సమయంలో పల్లెటూళ్లకు వెళ్లి అక్కడ జీవన విధానాన్ని తెలుసుకుంటారు. ఇండియాలోని పల్లెటూళ్లు ఎంతో ప్రత్యేకంగా ఉంటాయని విదేశీ యువతి యువకులు చెప్పారు. వార్షికోత్సవంలో సాంప్రదాయ వస్త్రాధారణతో చిన్నారులతో కలిసి మెలిసి ఆడి పాడతారు. కొద్దీ రోజుల తర్వాత తిరిగి తమ స్వదేశానికి వెళతారు. విదేశీ మహిళలు తెలుగింటి చీర కట్టి మురిసి పోతే పురుషులు పంచె కట్టులో మెరిసి పోయారు. వీరిని స్థానికులు కూడా ప్రత్యేకంగా విదేశీయులపై ప్రసంశలు కురిపించారు

### పెళ్లి కూతురు ప్లీజ్.!

# పెళ్లి కాని ప్రసాదుల కష్టాలు..




భోగి సంక్రాంతి ఆ తర్వాత రోజు కనుమ హుషారుగా జరుపుకునే యువత ఐరాల మండలం కలికిరి పల్లిలో అందరినీ ఆకట్టుకునేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. స్నేహితులు బంధువులకు కుటుంబ సభ్యులకు సంక్రాంతి శుభాకాంక్షలు ఏర్పాటు చేయడంతో పాటు పెళ్లి కాని యువకులంతా తమకు వధువు కావాలంటూ ఫ్లెక్సీలో ఫోటోలు వేసి ఏర్పాటు చేశారు. చిత్తూరు జిల్లాలోని ఒక గ్రామంలో పెళ్లి కాని యువకులు కొత్త ప్రయత్నం చేశారు. కలికిరిపల్లెలో వినూత్న బ్యానర్లను ఏర్పాటు చేసారు. పెళ్లికి యువతులు కావాలన్న సందేశంతో ఏకంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. పశువుల పండుగలో యువత క్రియేటివిటీ ని ప్రదర్శించడం హాట్ టాపిక్ అయింది. సంక్రాంతిని పెద్దల పండుగ జరుపుకునే చిత్తూరు జిల్లాలో పట్నం నుంచి పల్లెకు వచ్చిన యువకులు మూడు రోజులు పండుగ జరుపుకుంటారు. భోగి సంక్రాంతి ఆ తర్వాత రోజు కనుమ హుషారుగా జరుపుకునే యువత ఐరాల మండలం కలికిరి పల్లిలో అందరినీ ఆకట్టుకునేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. స్నేహితులు బంధువులకు కుటుంబ సభ్యులకు సంక్రాంతి శుభాకాంక్షలు ఏర్పాటు చేయడంతో పాటు పెళ్లి కాని యువకులంతా తమకు వధువు కావాలంటూ ఫ్లెక్సీలో ఫోటోలు వేసి ఏర్పాటు చేశారు. గ్రామం నడిబొడ్డున ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలు సందర్శకులను ఆకట్టుకుంటుండగా అందరూ వింతగా చూస్తున్నారు. యువకుల స్పెషల్ బ్యానర్ల గ్రామంలో చర్చనీయాంశంగా మారిపోగా.. కలికిరిపల్లి పశువుల పండుగలో నవ్వులు పూయించింది. మ్యారేజ్ అడ్వర్టైజ్ బ్యానర్లను వినూత్న ఆలోచన చేసిన యువత పెళ్లి ప్రకటన పండుగలో సందర్శకుల దృష్టి ఆకర్షించింది. సాధారణంగా శుభాకాంక్షలు, సంప్రదాయ సందేశాలు, పశువుల పూజ ప్రాముఖ్యత వంటి విషయాలతో బ్యానర్లు ముస్తాబయ్యే ఉత్సవాల్లో ఈసారి మాత్రం యువకులు వినూత్న ఆలోచనతో ముందుకొచ్చారు. పండుగ వాతావరణాన్ని వినోదాత్మకంగా మార్చే ప్రయత్నంలో భాగంగా యువకులు తమ ఫోటోలను బ్యానర్లపై ముద్రించించి, వాటిపై స్టార్ గుర్తులు ఉంచుతూ పెళ్లికి యువతులు కావాలి అనే ప్రత్యేక సందేశాన్ని పొందుపరిచారు. ఈ అసాధారణమైన ఆలోచన పండుగకు వచ్చిన ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షించగా బ్యానర్‌ను చూసిన గ్రామస్తులు, సందర్శకులు కడుపుబ్బా నవ్వుకున్నారు. ఈ క్రియేటివ్ ఆలోచనతో కొందరు యువకుల ప్రయత్నం సరదా వాతావరణాన్ని తీసుకొచ్చిందని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. కలికిరిపల్లెలో హాట్ టాపిక్‌గా మారిన ఫ్లెక్సీలు సోషల్ మీడియాలోనూ వైరల్ అవుతున్నాయి.

### తెలుగు రాష్ట్రాల్లో వచ్చే

# మూడు రోజులు వాతావరణం ఎలా ఉంటుంది..?




తెలుగు రాష్ట్రాల్లో రాత్రి వేళ చలి తీవ్రత తగ్గింది.. నెమ్మదిగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ తరుణంలో వాతావరణ శాఖ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వాతావరణ పరిస్థితులపై కీలక అప్డేట్ ఇచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు పొడి వాతావరణం ఉంటుందని వాతావారణ శాఖ అధికారులు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో రాత్రి వేళ చలి తీవ్రత తగ్గింది.. నెమ్మదిగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ తరుణంలో వాతావరణ శాఖ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వాతావరణ పరిస్థితులపై కీలక అప్డేట్ ఇచ్చింది. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. గత రెండు రోజులుగా ఆగ్నేయ ద్వీపకల్ప భారతదేశంలో చెప్పుకోదగ్గ వర్షపాతం నమోదు కాలేదు. దిగువ పొరలలో, ఉత్తర భారతదేశం నుండి పొడి గాలులు ఈ ప్రాంతంపై వీస్తున్నాయి. అందువల్ల, 2026 జనవరి 19వ తేదీ, ఈ రోజు నుండి ఆగ్నేయ ద్వీపకల్ప భారతదేశంలో ఈశాన్య రుతుపవన వర్షాలు నిలిచిపోయాయి. రాబోయే రెండు రోజులలో ఆగ్నేయ ద్వీపకల్ప భారతదేశంలో పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉంది.

**ఆంధ్రప్రదేశ్ వాతావరణం..**

అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, యానములో దిగువ ట్రోపో ఆవరణములో ఉత్తర, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయి.

వీటి ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు:-

**ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ & యానాం:-**

సోమవారం, మంగళవారం, బుధవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. మోస్తరు పొగమంచు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశము ఉంది.

**దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్:-**

సోమవారం, మంగళవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. మోస్తరు పొగమంచు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశము ఉంది. బుధవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశముంది.

**రాయలసీమ:-**

సోమవారం, మంగళవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. పొగమంచు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశము ఉంది. బుధవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది.

గమనిక :- రాగల 5 రోజుల్లో కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదులో గణనీయమైన మార్పు ఉండదు.

తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ విశ్లేషణ - వాతావరణ హెచ్చరికలు:

హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రంలో క్రింది స్థాయి గాలులు ప్రధానముగా తూర్పు/ఆగ్నేయ దిశల నుండి వీస్తున్నవి. వీటి ప్రభావంతో రాగల 3 రోజులకు వాతావరణ సూచనలు ఈ కింది విధంగా ఉన్నాయి.

సోమవారం, మంగళవారం, బుధవారం తెలంగాణ రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. రాబోయే 2 రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో అక్కడక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుండి 3డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది.

# ఏపీలో వారికి సూపర్ ఛాన్స్..

## ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు.. దరఖాస్తు ఇలా చేస్కోండి



ఏపీలోని మత్స్యకారుల కోసం ప్రభుత్వం మరో కొత్త పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. అదే ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం. ఈ పథకం కింద లబ్దిదారులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించుంది. మత్స్యకారులు మరణిస్తే కుటుంబానికి రూ.10 లక్షల సాయం అందించనుంది. ఏపీలో మత్స్యకారుల కుటుంబాలకు కూటమి సర్కార్ శుభవార్త అందించింది. మత్స్యకారుల కుటుంబాలకు అందించే బీమా సొమ్మును భారీగా పెంచింది. ఇప్పటివరకు మత్స్యకారులకు రూ.2 లక్షల బీమా అందిస్తుండగా.. ఇప్పుడు దీనికి ఏకంగా రూ.10 లక్షలకు పెంచింది. దీంతో మత్స్యకారులు ఎవరైనా ప్రమాదవశాత్తూ మరణిస్తే కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందనుంది. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళతారు. కేవలం చేపల వేటపైనే ఆధారపడి వీళ్ల జీవనం కొనసాగిస్తూ ఉంటారు. సముద్రంలో ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తూ ఉంటారు. దీంతో వీరికి రక్షణ కల్పించేందుకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని అమలు చేయనున్నట్లు ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం ద్వారా మత్స్యకారులు అండగా నిలవనుంది. సముద్రంలో చేపల వేట అనేది ప్రమాదంతో కూడుకున్న విషయం. చేపలు పట్టే సమయంలో ప్రమాదవశాత్తూ మరణిస్తూ కుటుంబానికి దిక్కు లేకుండా పోతోంది. దీంతో మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొచ్చాయి. ఇక నుంచి సహజ మరణం లేదా ఇతర ప్రమాదాల వల్ల మత్స్యకారులు మరణించినా కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తారు. కార్మికశాఖ నుంచి వీటిని లబ్దిదారులకు అందిస్తారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ఈ పథకం ప్రవేశపెట్టినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

**అర్హతలు ఇవే..**

-ఏదైనా మత్స్యకార సహకార సంఘంలో సభ్యుడై ఉండాలి -చేపల వేట లైసెన్స్ తీసుకుని ఉండాలి -మత్స్యశాఖ వద్ద పేరు నమోదు చేసుకోవాలి -చేపల బోట్లల్లో పనిచేసేవారు కూడా అర్హులే -ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మత్స్యకార సహకార సంఘం ధృవీకరణ పత్రం కలిగి ఉండాలి.

**బీమా సొమ్ము ఎలా పొందాలంటే..?**

ఈ పథకంలో చేరిన వ్యక్తి మరణించినప్పుడు సమీపంలోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో లేదా రైతు సేవా కేంద్రంలో కుటుంబసభ్యులు దరఖాస్తులు సమర్పించాలి. మరణించిన వ్యక్తి ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, డెత్ సర్టిఫికేట్, పంచనామా పత్రం వంటి డాక్యుమెంట్స్ సమర్పించాలి. దీంతో అధికారులు నిర్ధారించి బీమా సొమ్మును కుటుంబానికి అందిస్తారు. అయితే ప్రభుత్వం ఇప్పటికే వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల చొప్పున సహాయం అందిస్తోంది. చేపల వేటకు ఉపయోగించే బోట్లు, వలలు, ఇంజిన్లు లాంటి వస్తువలను రాయితీపై అందిస్తోంది. మత్స్యకారులందరికీ ఈ పథకం మంచి అవకాశమని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఏమైనా అనుమానాలు ఉంటే మత్స్యశాఖ కార్యాలయాన్ని సందర్శించాలని సూచిస్తున్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసమే ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది.



### ప్రెస్ క్లబ్ వివాదంపై

# రెవెన్యూ, పోలీసులు, అధికారులు జోక్యం..

**- బైలా నిబంధనలు మేరకు ప్రతీ సంవత్సరం ఎన్నికలు నిర్వహించాలి**
**- ఏడేళ్ళ ప్రెస్‌క్లబ్ జమా ఖర్చులపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి".. - 21న ఇరువర్గాలతో తహసీల్దారు సమావేశం..**







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కేంద్రం రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్ వివాదం రోజు రోజుకూ శృతిమించుతోంది. రాజమండ్రి ప్రెస్ క్లబ్ కు గత ఏడు సంవత్సరాలుగా ఎన్నికలు నిర్వహించడం లేదు. గత ఏడేళ్ళ ఆర్థిక లావాదేవీలు ప్రకటించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రెస్ క్లబ్ బైలా నిబంధనలు మేరకు ప్రతీ సంవత్సరం ఎన్నికలు నిర్వహించాలని డిమాండు చేస్తూ వర్కింగ్ జర్నలిస్టుల జేఏసీ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సంగతి విదితమే. అధికారుల ఆదేశాల మేరకు సంక్రాంతి ముందు నుండి తాత్కాలికంగా రిలే దీక్షలు వాయిదా వేసిన జేఏసీ సోమవారం నుండి మళ్ళా రిలే దీక్షలను ప్రారంభించింది. సోమవారం రిలే దీక్షలలో పాత్రికేయులు పొక్కులూరి రామమూర్తి, ముక్కపాటి రామమూర్తి శర్మ (రాంబాబు), సింగంశెట్టి సూర్య రాఘవేంద్ర పాల్గొన్నారు. వీరికి జేఏసీ కన్వీనర్? డీ అబ్రహం లింకన్ పూలమాలలు వేసి దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. సాయంత్రం దీక్షలను సీనియర్ పాత్రికేయులు కిరణ్ కుమార్ రాజు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.

**శిబిరాన్ని సందర్శించిన సీఐ, డిప్యూటీ తహసీల్దారు..**

పోలీసులకు అందిన సమచారమో, ఫిర్యాదో.. మొత్తంపై ఎసచవతీతీచ, పోలీసు సిబ్బంది వచ్చి పరిస్థితిని సమీక్షించారు. జేఏసీ రిలే దీక్షల శిబిరాన్ని పరిశీలించారు. మరికొద్ది సమయానికే ప్రకాశ్ నగర్ సీఐ, డిప్యూటీ తహసీల్దారు రిలే దీక్షా శిబిరానికి చేరుకున్నారు. డిప్యూటీ తహసీల్దారు నిరసన దీక్షా శిబిరంలోనికి రాగానే "వుయ్ వాంట్ జస్టిస్, ప్రెస్ క్లబ్ ఎన్నికలు జరిపించాలి, ఏడేళ్ళ ప్రెస్ క్లబ్ జమా ఖర్చులపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి".. అంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. ఈ లోగా మరొక వర్గం నుంచి వివరాలు సేకరించేందుకు డిప్యూటీ తహసీల్దారు జై గణేష్ చౌక్ వద్దకు (ప్రెస్ క్లబ్ ఎదురుగా) వెళ్ళి, ఇద్దర్ని రమ్మనమని కబురు పంపారని తెలిసింది. అయితే అప్పటికే జేఏసీకి వ్యతిరేక వర్గం తమ అనుచర వర్గంతో మోహరించింది. ప్రెస్ క్లబ్ వద్ద పాత్రికేయులు రెండు వర్గాలుగా మోహరించడం, మరో వైపు పోలీసులు, ఇంకో వైపు రెవెన్యూ శాఖ అధికారులు చేరుకోవటంతో.. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

**ప్రెస్ క్లబ్‌కు తాళాలు వేయబోతున్నారు!..**

సోమవారం మధ్యాహ్నం ప్రెస్ క్లబ్ వద్ద పాత్రికేయులలోని ఉభయ వర్గాలలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. రెవెన్యూ ఉన్నతాధికారుల ఆదేశాలతో "సీజ్ ఆర్డర్"తో డిప్యూటీ తహసీల్దారు ప్రెస్ క్లబ్ వద్దకు వచ్చారనే ప్రచారం జరిగింది. స్పష్టమైన ఆదేశాలతోనే డిప్యూటీ తహసీల్దారు సంఘటనా ప్రాంతానికి వచ్చారని టాక్ వినవచ్చింది. ఒక దశలో జేఏసీకి వ్యతిరేక వర్గం డిప్యూటీ తహసీల్దారు పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. ఇదేమీ ప్రభుత్వ కార్యాలయం కాదు..తాళాలు ఎలా వేస్తారో అదీ చూస్తామని విచారణకు వచ్చిన డిప్యూటీ తహసీల్దారు పై కొందరు తీవ్ర స్వరంతో రంకెలు వేశారని జేఏసీ ప్రతినిధులు చెబుతున్నారు. ఒక అధికారి విధులకు ఆటంకం కల్గించడం ఎంత వరకూ సమంజసమని, ఇది చట్టరీత్యా నేరమని జేఏసీ ప్రతినిధులు వ్యాఖ్యానించారు.కాగా డిప్యూటీ తహసీల్దారు,సీఐ సమక్షంలో ఇరువర్గాలూ వాగ్వాదానికి దిగడంతో ప్రెస్ క్లబ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇరువర్గాలను శాంతింపజేయడానికి సీఐ జోక్యం చేసుకోక తప్పలేదు. పరిస్థితిని ఎప్పటికప్పుడు తమ పై ఉన్నతాధికారులకు డిప్యూటీ తహసీల్దారు వివరిస్తూ..వారి సూచనలకు అనుగుణంగా చర్యలకు ఉపక్రమించారు.

**21న ఇరువర్గాలతో తహసీల్దారు సమావేశం..**

రాజమండ్రి ప్రెస్‌క్లబ్ ఎన్నికలు తదితర డిమాండ్ల విషయంలో చర్చించేందుకు రాజమహేంద్రవరం అర్బన్ తహసీల్దారు పీహెచ్జీఆర్ పాపారావు రెండు వర్గాలకు నోటీసులు జారీ చేశారు. రెండు వర్గాల నుండి చెరొక అయిదుగురు సభ్యులు చొప్పున ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 4 గంటలకు రికార్డులతో సహా హాజరు కావాలని అర్బన్ తహసీల్దారు ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు రాజమండ్రి ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో ఏ విధమైన కార్యకలాపాలు, మీటింగ్ లు నిర్వహించరాదని ఆ నోటీసులో అర్బన్ తహసీల్దారు స్పష్టంగా పేర్కొన్నారు.

# ఆంధ్ర, రాష్ట్ర రాజకీయాల్లో త్వరలో పెనుమార్పులు

**ఉగాది-2026కి ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వారసుడు సీఎం కాబోతున్నారా ..?**
**- మేడా శ్రీనివాస్, రాజకీయ విశ్లేషణ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పవన్ కళ్యాణ్ తో ఆంధ్ర రాష్ట్రానికి ఏమైనా ఉపయోగం వుందంటారా! అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్పీసీ) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా మేడ మాట్లాడుతూ,ధనమే ప్రధాన అజెండాగా ఆంధ్ర రాష్ట్ర రాజకీయాలు పెనవేసుకు పోతున్నాయా! అవును అనే సాంకేతాలు ఆంధ్రులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్, సంక్షేమం కోసం ప్రస్తుత ఆంధ్ర పాలకులకు అక్కరలేకపోతుంది. రోజు రోజుకు ఓటర్లను బిక్షగాళ్లుగా మార్చటమే నేటి కార్పొరేట్ రాజకీయ పార్టీల విష వ్యూహంగా కనపడుతుంది. యావత్ ఆంధ్ర రాష్ట్రం మొత్తం రాజకీయాలు అన్ని ఆ రెండు కుటుంబాల మధ్యనే జరిగే విధంగా అదే నిత్యం ప్రజలు చర్చించుకునే విధంగా గంజాయి కన్నా ప్రమాదకరమైన వ్యూహ రచనతో కార్పొరేట్ ప్రచారాన్ని నిత్యం మనుషుల మెదడుల్లో చొప్పిస్తున్నారు. గజ దొంగలు కన్నా ప్రమాదకరమైన ఆర్థిక నేరగాళ్ల ఆంధ్ర రాష్ట్రాన్ని నేడు సాసిస్తున్నారు. పాలిస్తున్నారు. నేటి గెలుపు ఓటములు ఓటర్లు వేసే ఓట్లలో లేదని, ఈవిఎమ్‌లలో మాత్రమే ఆ రహస్యం దాగి వుందన్నారు. దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకునే పాత సామెత వలే ప్రస్తుత పాలకులు అధికారాన్ని సొంత ప్రయోజనాలకు అమ్మేసుకుంటున్నారన్నారు. ఆంధ్ర రాష్ట్ర అధికారాన్ని సైతం ప్రజలు ఊహించని విధంగా ముందు ముందు ఆంధ్రరాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సంబవించటం ఖాయం అన్నారు. ఈ మార్పులు ఆంధ్రుల భవిష్యత్‌కు పెను ప్రమాదంగా సంబవిస్తాయని ఆయన తీవ్ర ఆందోళన చెందారు. ఆంధ్ర రాష్ట్రంలో ప్రశ్నిస్తాను అని తెలంగాణా రాష్ట్రం నుండి వచ్చి ఆంధ్ర ప్రజలను నమ్మించి అధికారంలో భాగస్వామ్యంగా కొనసాగుతున్న ఒక రాజకీయ పార్టి మోనంగా ఉండటానికి, అవసరం అయినప్పుడల్లా సందర్భానుచితం మరో 15 ఏళ్లు చంద్రబాబు కూటమి జెండానే మోయాలి అని సాంకేతాలు ఇస్తున్న ఆ పార్టి అధినేతతో బారి ఒప్పందం కుదిరిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. చెప్పిన చోట సంతకాలు పెట్టు, మాటాడ మన్న చోట మాట్లాడు, రెచ్చిపోయే వద్ద రెచ్చిపో, కూర్చో మన్న చోట కూర్చో అనే ఒక రహస్య ఒప్పందం కు ప్రతి నెల 45 కోట్లు ఇచ్చుటకు బారి ఒప్పందం కుదిరిందంటున్నారు. ఆశ్చర్యంగా వుంది కదూ ఈ సొమ్ము మొత్తం ఆంధ్రుల శ్రమ దోపిడి అని గుర్తుంచుకోండి ఆంధ్రులరా ! ఈ మొత్తం అప్పులు మనమే కాదు మన బిడ్డలు, వారి బిడ్డలు, మరో తరం బిడ్డలు సైతం తీరుస్తు ఉండటమేనని, ఈ భయంకరమైన ద్రోహం, మోసంను నేటి యువత ప్రశ్నించకుండా వారి యుక్త వయస్సును మాదకద్రవ్యలకు బానిసలుగా మార్చేస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రంలో ఆ రెండు కుటుంబాల వారసులు మాత్రమే సంపదను అనుభవించాలి. రాజకీయాలను సాశించాలి అనే మహా కుట్రలో భాగమే నేటి ఆంధ్ర పాలకుల వ్యూహం అని, మహాభారతంలో ద్రోణుడు రచించిన పద్మవ్యూహన్ని మించిన చక్ర వ్యూహం సుడి గుండంలో ఆంధ్రుల భవిష్యత్ ఇరుక్కు పోయిందని ఆయన తీవ్ర మనస్థాపం చెందారు. 2026 - ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకుని గడియలు అనుకూలంగా వుంటే ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ వారసుడును ముఖ్యమంత్రిని చేసే విధంగా పాచికలు సిద్దం అవుతున్నాయా ! ముహూర్త బలం అనుకూలించక పోతే 2027 - రాజమండ్రి పుష్కరాలకు ఖాయం అని విశ్వాసనీయ వర్గాల భోగట్టా . నెలకు 45 కోట్లు మాత్రం ఈ ఉగాది నెల నుండే ప్రారంభం అన్నట్టు రహస్యం ఒప్పందంలో ప్రధాన ఘట్టం అని ఆంతర్య నిఘా వర్గాల సమాచారం అంటున్నారు. ప్రజల భవిష్యత్ కోసం, ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతి కోసం, యువత అభివృద్ధి కోసం నేటి పాలకులకు అవసరం లేక పోతుందన్నారు. చంద్రబాబు కూటమి సర్కార్‌కు మరో 15 ఏళ్లు తిరుగు లేదు అంటున్న పవన్ కళ్యాణ్ మాటల్లో నిగూడ రహస్యంను ఆంధ్రులు ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నారు. చంద్రబాబు కూటమి ఇప్పటి వరకు చేసిన అప్పులకు అందుకు జరిపిన అభివృద్ధి, పనులపై ఖచ్చితమైన శ్వేతపత్రం ప్రభుత్వం అధికారికంగా ప్రకటించగలదా! అంటు ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణా కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న పవన్ కళ్యాణ్ తో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ కు, భద్రత కు, ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు ఏమైనా ఉపయోగం వుందా! పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి ప్రవేశించిన నుండి నేటి వరకు ఏ ఒక్క మాటనైనా పోషించుకున్నారా! పవన్ కళ్యాణ్ అంటే మోసం, అబద్దం, దగా అన్నట్టు నేడు ఆంధ్రులు అసహ్యంచుకుంటున్నారు. ఆంధ్రుల అమాయకత్వాన్ని పవన్ కళ్యాణ్ వంటి కాలక్షేప రాజకీయాలు ఆంధ్ర రాష్ట్ర యువత భవిష్యత్ కు ప్రమాదంగా మారాయన్నారు. పవన్ కళ్యాణ్ అధికారానికి ముందు, అధికారం తరువాత ఆంధ్రప్రదేశ్ కు మేలు జరిగే ఏ ఒక్క పనైనా పవన్ కళ్యాణ్ చేయగలిగారా! పవన్ కళ్యాణ్ మన ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు అవసరం వుందంటారా! అని నేడు మెజార్టీ ఆంధ్రులు ఆలోచనలో పడ్డారని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ పేర్కొన్నారు. సభకు ఆర్పీసీ సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ డివి ఆర్ మూర్తి, సిమ్మా దుర్గారావు, వర్ధనపు శరత్ కుమార్, గుడ్ల సాయి దుర్గా ప్రసాద్, ఆకుల మణికాంత్, వల్లి శ్రీనివాసరావు, బసా సోనియా, కందివలస రమణ, యర్రా బాల మురళి కృష్ణ, చల్లా సాంబశివరావు, మాసా అప్పాయమ్మ, కూరాకుల నాగమణి, అడపా శేషగిరి, చల్లా వంశీ తదితరులు పాల్గొన్నారు.

# మెప్మా డిపార్ట్మెంట్ కార్మికులపై ఇంత నిర్లక్ష్యమా...



**- పలుదఫాలుగా అధికారులకు విజ్ఞప్తి చేశాం.. - బ్యాంకులో అసలు మగవాళ్ళకు లోన్స్ ఇవ్వమని తెలిపింది**
**- ఇకనైనా కమిషనర్ వారు మా సమస్యకు పరిష్కారం చూపాలి - అధ్యక్షుడు బొజ్జా రామకృష్ణ**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక విక్రమ హాలు వద్ద ఎలక్ట్రికల్ సోదరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రెసిడెంట్ బొజ్జరామకృష్ణ మాట్లాడుతూ, 2025 జనవరి నుండి మెప్మా లోన్లు ఇస్తామని సుమారుగా 100 గ్రూపులు ఏర్పడాలని నగరపాలక సంస్థ, మెప్మా డిపార్ట్మెంట్ ఆశ చూపి కార్మికులను మోసం చేసినది ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన ఆరు నెలల్లో ఒక్కో వ్యక్తి నుండి రెండు వందల రూపాయలు బ్యాంకులో కట్టాలని, ఐదుగురు కలిపి ఒక గ్రూపుగా ఏర్పడి వారికి లక్ష రూపాయలు ఇస్తామని తెలియజేసినారు. గ్రూపు లోన్స్ ఇస్తామని ఆరు నెలలలో మీకు వర్తిస్తాదని మాట ఇచ్చి హామీని మరిచిపోయారు, దీని విషయంలో అనేకసార్లు మున్సిపల్ కమిషనర్ వారిని,మెప్మా అధికారులను, సి.ఓలను, ఆర్పీలను అనేకసార్లు వినతి పత్రాలు ఇవ్వడం జరిగినది. ఈ నాటి వరకు కూడా కార్మికులకు గ్రూపు లోన్స్ విషయంలో ఇంతవరకు న్యాయం జరగలేదు.అవి ఇస్తారా లేదా బ్యాంకు వారు మగవాళ్ళకి లోన్లు ఇవ్వమని కరాకండిగా చెప్పి ఉన్నారని తెలిసినది దీని విషయంలో కమిషనర్ ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని ఈ నెలలో మెప్మా లోన్లు కార్మికులకు అందిస్తారని లేని యెడల నగరపాలక సంస్థ నిర్లక్ష్యం అని తెలుసుకొని కార్మికులందరూ కూడా పెద్ద ఎత్తున ఈ నెలలో ధర్నా నగరపాలక సంస్థ గేటు వద్ద ధర్నా చేయుటకు నిర్ణయించడమైనది, లేనియెడల కార్మికుల డబ్బులు వెంటనే వెనుకకు అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో ప్రెసిడెంట్ సెక్రటరీ ఆశపు శ్రీనివాస్, బుజ్జి,కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.

### పట్టుదలతో ప్రయత్నిస్తే

# విజయం త్వరగా చేరువవుతుంది

**ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతను ఆదర్శంగా తీసుకోవాలి**
**చిన్న వయస్సులోనే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అభినందనీయం**
**విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** విద్యార్థులు ఇంటర్ మీడియట్ స్థాయి నుండే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, ప్రయత్నం కొనసాగిచడం ద్వారా త్వరగా ప్రభుత్వ ఉద్యోగం సాధించడం సులభమౌతుందని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలోని విజ్ఞాన్ వివిఎసచవతీతీచర్ రూరల్ డిగ్రీ కాలేజ్ లో ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విడుదల చేసిన జిల్లా కోర్టు ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి, ఉద్యోగాలు సాధించిన యువతకు చిరు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ మల్లిడి అమ్మిరెడ్డి మాట్లాడుతూ పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించిన వారిలో కుతుకులూరుకు చెందిన కర్రి సౌమ్యశ్రీ, ద్వారంపూడి దుర్గా వెంకటేశ్వర రెడ్డి, తాడి మణికంఠ అజయ్ సాగర్ రెడ్డి, మహేంద్రవాడకు చెందిన సబ్బెళ్ల అనసూయ ఉన్నారని, వారంతా ఇంటర్,డిగ్రీ చదువుతున్నప్పటి నుండే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యారని, అందుకే అతిచిన్న వయసులో వారు ప్రభుత్వ ఉద్యోగం సాధించారని తెలిపారు. ప్రస్తుత యువత వారిని ఆదర్శంగా తీసుకుని లక్ష్యాల వైపు సాగాలని అమ్మిరెడ్డి సూచించారు. ఇంటర్ స్థాయిలోనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, ప్రయత్నం కొనసాగిస్తే ప్రభుత్వ ఉద్యోగం సాధించడం సులభమని, వారు శిక్షణ పొందిన టివిఎసచవతీతీచర్ కోచింగ్ ఇన్స్టిట్యూట్ ద్వారా తమ కళాశాలలో సైతం ఇంటర్, డిగ్రీ విద్యతో పాటు పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నామన్నారు. పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం త్వరగా చేరువవుతుందిని విద్యార్థులలో స్ఫూర్తి ని నింపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మల్లిడి శేషవేణి, వివిఎసచవతీతీచర్ రూరల్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ మల్లిడి సతీష్ రెడ్డి, విజ్ఞాన్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సబ్బెళ్ల అచ్చిరెడ్డి, విజ్ఞాన్ కాంపిటేటివ్ వింగ్ ఇంచార్జ్ డాక్టర్ తేతల సుబ్బిరెడ్డి, విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్ త్రివేణి తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

### కూనాలమ్మ ఆలయ నిర్మాణానికి

# కల్లూరి ఫౌండేషన్ తరపున లక్ష విరాళం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని కూన వరం గ్రామంలో ఉన్న కూనాలమ్మ ఆలయ నిర్మాణానికి కల్లూరి గీత, రామకృష్ణ పరమహంస దంపతులు పురుషోత్తపట్నంలోని వారి గృహములో భారీ విరాళాన్ని అందజేశారు. బెంగళూరులోని ఏఎంసి విద్యాసంస్థలు ఏఎంసి ఫౌండేషన్ తరపున ఆలయ కమిటీ సభ్యులకు రూ.లక్ష విరాళం అందజేశారు.ఈ సందర్భంగా వారు తమ ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో భాగంగా ఈ విరాళాన్ని అందిస్తున్నట్లు చెప్పారు.ఆలయ నిర్మాణానికి సహకరించినందుకు కల్లూరి దంపతులకు మరియు ఎ ఎంసి ఫౌండేషన్ వారికి ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

### హాస్పిటల్లో జనసేన సీనియర్ నాయకుడిని

# పరామర్శించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కూనవరం గ్రామానికి చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకులు మాధవరపు వీరభద్ర రావు ఇటీవల అనారోగ్యానికి గురై రాజమండ్రి బొల్లినేని హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నారని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్థానిక నాయకుల ద్వారా తెలుసుకొని ఆస్పత్రికి వెళ్లి పలకరించి ధైర్యం చెప్పి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

### స్కౌట్ అండ్ గైడ్స్

# విభాగాన్ని పటిష్టం చేయాలి

**త్వరలో పెట్రో లీడర్స్ ట్రైనింగ్**



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పీఎంశ్రీ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన స్కౌట్ అండ్ గైడ్స్ విభాగాన్ని పటిష్టం చేయాలని ది భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ, సమగ్ర శిక్షా ఏఎంఓ పి.రాంబాబు పిలుపునిచ్చారు. ముమ్మిడివరం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో రాయుడు ఉదయభాస్కరరావు అధ్యక్షతన సోమవారం స్కౌట్ టీచర్స్, గైడ్ కెప్టెన్స్‌కు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-7కు సంబంధించిన 28 పీఎంశ్రీ పాఠశాలల్లో స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి యూనిట్ ద్వారా 32 మంది విద్యార్థులతో ఏర్పాటు చేసిన యూనిట్ల ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువలు, సమాజం పట్ల సేవా భావాన్ని పెంపొందించాలన్నారు. త్వరలోనే పీఎంశ్రీ పాఠశాలల్లో ప్రతి పాఠశాల నుంచి నలుగురు వంతున ఎంపిక చేసిన పెట్రోల్ లీడర్స్‌కు త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే ట్రైనింగ్ తేదీలను వెల్లడిస్తామన్నారు. అలాగే ప్రతి పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్ యూనిట్లలో ఉన్న విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ సోపానం పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ సోపానం పరీక్షలు నిర్వహించే విధానం, యూఐడీ నంబర్లు క్రియేట్ చేసే విధానంపై స్కౌట్ అండ్ గైడ్ విభాగం జిల్లా కోఆర్డినేటర్లు కట్టా కృష్ణప్రసాద్, డి.దుర్గామాధవిలు అవగాహన కల్పించారు.

### అస్సాం గడ్డపై అద్భుతం..

# 10 వేల మందితో బాగురుంబా ప్రదర్శన.. ప్రధాని మోదీ ఫిదా..



అస్సాం గడ్డపై అద్భుతమైన జానపద కళా దృశ్యం ఆవిష్కృతమైంది. గౌహతిలోని సారుసజై స్టేడియం సాక్షిగా 10 వేల మందికి పైగా బోడో కళాకారులు ఏకకాలంలో బాగురుంబా నృత్యంతో చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రాత్మక ప్రదర్శనను స్వయంగా వీక్షించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బోడో సంస్కృతిని చూసి మంత్రముగ్ధులయ్యారు. అస్సాంలో అద్భుతమైన సాంస్కృతిక దృశ్యం ఆవిష్కృతమైంది. గౌహతిలోని సారుసజై స్టేడియం వేదికగా జరిగిన బాగురుంబా దోహో 2026 ప్రదర్శన యావత్ దేశాన్ని మంత్రముగ్ధులను చేసింది. ఈ చారిత్రాత్మక వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరై, బోడో ప్రజల అద్భుతమైన కళా వైభవాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 10,000 మందికి పైగా జానపద కళాకారులు ఏకకాలంలో చేసిన బాగురుంబా నృత్యం గిన్నిస్ రికార్డు స్థాయి విన్యాసంగా నిలిచింది. అద్భుతమైన లేజర్ షో, సాంప్రదాయ సంగీతం మధ్య జరిగిన ఈ ప్రదర్శనను చూసి ప్రధాని అబ్బురపడ్డారు. "ఈ అనుభవాన్ని నేను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. ఉత్సాహభరితమైన బోడో సంస్కృతి దేశం అంతటా సంచలనం సృష్టించడం హృదయపూర్వకంగా ఉంది" అని ప్రధాని మోదీ కొనియాడారు.

**బోడో గుర్తింపుకు పట్టాభిషేకం**

ప్రసంగం ప్రారంభంలో బోడో భాషలో ప్రజలకు 'మాఘ బిహు' శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధాని అందరినీ ఆకట్టుకున్నారు. బగురుంబా కేవలం ఒక నృత్యం మాత్రమే కాదని, అది బోడో సమాజ గుర్తింపుకు చిహ్నమని ప్రధాని అన్నారు. బోడో ప్రజల మనోభావాలను గౌరవిస్తూ బీజేపీ ప్రభుత్వం బథౌ పూజను అధికారికంగా గుర్తించి, రాష్ట్రంలో సెలవు దినంగా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఒకప్పుడు రక్తపాతంతో ఉన్న అస్సాం, నేడు అభివృద్ధి పథంలో పయనిస్తోందని, రాష్ట్ర వాతావరణం పూర్తిగా మారిపోయిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

**రాజకీయ విమర్శలు.. అస్సాంపై మమకారం**

2026 అస్సాం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధాని మోదీ కాంగ్రెస్?పై ఘాటు విమర్శలు చేశారు. "గతంలో ఏ ప్రధాని కూడా అస్సాంను ఇన్నిసార్లు సందర్శించలేదు. అస్సాం కళ, సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడానికి నేను కట్టుబడి ఉన్నాను" అని స్పష్టం చేశారు. అస్సాం అభివృద్ధిలో బిజెపి ప్రభుత్వం పోషిస్తున్న పాత్రను ఆయన ఈ సందర్భంగా వివరించారు.

### బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా

# నితిన్ నబీన్ ఏకగ్రీవ ఎన్నిక



బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఢిల్లీ బీజేపీ ప్రధాన కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. అధ్యక్షపదవికి నితిన్ నబీన్ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఎన్నిక లాంచనమే. నితిన్ నబీన్‌కు మద్దతుగా 37 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేపీ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్?ను ప్రతిపాదిస్తూ 37 సెట్ల నామినేషన్?లు దాఖలయ్యాయి. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నితిన్ నబీన్ పేరును ప్రతిపాదిస్తూ ప్రధాని మోదీతో పాటు అమిత్‌షా, రాజ్‌నాథ్‌లు సంతకాలు చేశారు. రేపు ఉదయం 11 గంటలకు బీజేపీ కార్యాలయంలో అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తారు నితిన్ నబీన్. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ కూడా హాజరవుతారు. బీహార్ అసెంబ్లీకి 5 సార్లు ఎమ్మెల్యేగా నితిన్ నబీన్ ఎన్నికయ్యారు. బీజేపీ చరిత్రలో 45 ఏళ్ల వయస్సులో జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికై.. నితిన్ నబీన్ రికార్డ్ సృష్టించబోతున్నారు. 2020 జనవరి 20 నుంచి జేపీ నడ్డా బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడి పదవీకాలం రెండేళ్లు మాత్రమే. కానీ.. ఆరేళ్లుగా నడ్డా ఆ పదవిలో కొనసాగుతున్నారు. గడువు ముగిసే సమయంలో.. రెండుసార్లు నడ్డా పదవీకాలం పొడిగిస్తూ వచ్చారు. తాజాగా మరోసారి నడ్డా పదవీకాలం ముగుస్తుండటంతో.. ఆయన స్థానంలో నితిన్ నబీన్?ను అపాయింట్ చేయబోతున్నారు.

# డైరెక్టుగా ఆఫీసులోనే ముద్దు ముచ్చట..

### అడ్డంగా దొరికిన డీజీపీ..



కర్ణాటకలో సీనియర్ పోలీసు అధికారి, డీజీపీ రామచంద్రరావు రాసలీలల వ్యవహారానికి సంబంధించిన వీడియో వైరల్?గా మారింది. డీజీపీ ఒక మహిళతో ఉన్న ప్రైవేట్ వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమవ్వడం పోలీసు శాఖలో కలకలం రేపింది. రామచంద్రరావు ప్రస్తుతం (పౌర హక్కుల అమలు డీజీపీ) డీసీఆర్?ఈ డీజీపీగా పనిచేస్తున్నారు. కర్ణాటకలో సీనియర్ పోలీసు అధికారి, డీజీపీ రామచంద్రరావు రాసలీలల వ్యవహారానికి సంబంధించిన వీడియో వైరల్?గా మారింది. డీజీపీ ఒక మహిళతో ఉన్న ప్రైవేట్ వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమవ్వడం పోలీసు శాఖలో కలకలం రేపింది. ఆ వీడియోలోని ఫుటేజ్ 1 సంవత్సరం క్రితం నాటిదని పేర్కొంటున్నారు. రామచంద్రరావు ప్రస్తుతం (పౌర హక్కుల అమలు డీజీపీ) డీసీఆర్ఈ డీజీపీగా పనిచేస్తున్నారు.

**ఏకంగా ఆఫీసులో సరసాలు..**

డీజీపీ రామచంద్రరావు తన కార్యాలయంలో కూర్చుని ఒక మహిళను ముద్దు పెట్టుకుంటున్న ప్రైవేట్ వీడియో వైరల్?గా మారింది. ఐపీఎస్ అధికారి కుర్చీపై కూర్చుని ఒక మహిళను కౌగిలించుకుంటున్నట్లు కనిపిస్తోంది.. ఈ సంఘటన గోల్డ్ స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన రన్యా రావు ఘటనకు ముందు జరిగిందని పేర్కొంటున్నారు. అతని కుమార్తె రన్యా రావు బంగారం స్మగ్లింగ్ కేసులో పోరాడుతుండగా.. అతని సవతి తండ్రి లైంగిక కార్యకలాపాలకు సంబంధించిన వైరల్ వీడియో ఒక్కసారిగా పోలీస్ డిపార్ట్?మెంట్ లో సంచలనానికి దారితీసింది.

**నాపై కుట్ర జరుగుతోంది..**

యూనిఫాంలో ఉన్న మహిళలతో తాను సరసాలాడుతున్నట్లు వైరల్ అవుతున్న వీడియోను ఐజీపీ రామచంద్రరావు ఖండించారు. ఇది తన ఇమేజ్‌ను పెంచుకోవడానికి ఎఐ ఉపయోగించి సృష్టించబడిన నకిలీ వీడియో అని పేర్కొన్న ఆయన.. మీడియా అడిగిన ప్రశ్నలకు సరిగా సమాధానం ఇవ్వలేదు.. "ఇది నా ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఒక క్రమబద్ధమైన కుట్ర" అని ఆయన అన్నారు. గతంలో, దుబాయ్ నుండి అక్రమ బంగారం స్మగ్లింగ్ కేసులో నటి రన్యా రావు అరెస్టు తర్వాత, ఆమె సవతి తండ్రి డిజిపి రామచంద్ర రావు పేరు కూడా ఈ కేసులో చిక్కుకున్నారు.. విమానాశ్రయంలో నటి రన్యాకు ఇచ్చిన ప్రోటోకాల్ పై కర్ణాటక హోం శాఖ దర్యాప్తునకు ఆదేశించింది. బంగారు స్మగ్లింగ్ కేసులో రామచంద్ర రావు కూడా ఉన్నారా? దుబాయ్ నుండి బెంగళూరుకు బంగారాన్ని రవాణా చేస్తున్నప్పుడు ప్రోటోకాల్ దుర్వినియోగంలో ఆయన ప్రమేయం ఉందా అనే దానిపై దర్యాప్తునకు ఆదేశించారు.

**రామచంద్రరావు ఎవరు?..**

కె. రామచంద్రరావు కర్ణాటక కేడర్ కు చెందిన ఐపీఎస్ అధికారి, గతంలో కర్ణాటక రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ కు అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, మేనేజింగ్ డైరెక్టర్ (వీణ)గా పనిచేశారు. 2023 లో, ఆయన డిజిపిగా, కర్ణాటక రాష్ట్ర పోలీస్ హౌసింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ కు ఛైర్మన్, వీణ గా పదోన్నతి పొందారు. తరువాత ఆయన పౌర హక్కుల అమలు డైరెక్టరేట్‌కు డిజిపిగా నియమితులయ్యారు. ఆయన సవతి కూతురు రన్యా రావుకు సంబంధించిన బంగారం అక్రమ రవాణా కేసుకు సంబంధించి పోలీసు అధికారాలను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై మార్చి 2025 లో ఆయనను తప్పనిసరి సెలవుపై పంపారు.

**'హోం శాఖకు ఘోర అవమానం'..**

రామచంద్రరావు రాస లీల వైరల్ వీడియోలో ప్రమేయం ఉన్న అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని మాజీ హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రామచంద్రరావు గతంలో కూడా ఇలాగే ప్రవర్తించారు. అయినప్పటికీ ఆయన ఆ శాఖలోనే కొనసాగారు. కార్యాలయంలో మహిళలతో దురుసుగా ప్రవర్తించడం హోం శాఖకు తీవ్ర అవమానమని ఆయన అన్నారు.

### ఉపాధి హామీ కూలీలకు

# కేంద్రం అదిరిపోయే న్యూస్..

### ఏప్రిల్ 1 నుంచి కొత్త రూల్స్.. అకౌంట్లోకి వేతనాలు ముందుగానే..



ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త చట్టం ప్రకారం ముందుగానే వేతనాలు చెల్లిస్తామని ప్రకటించింది. మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్నట్లు ప్రకటించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో కొత్త చట్టాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వికసిత్ భారత్ రోజ్ గార్ ఔర్ ఆజివిక మిషన్ గ్రామీణ్ చట్టానికి పార్లమెంట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి కూడా ఈ బిల్లును ఆమోదించారు. దీంతో ఇకపై మహాత్మాగాంధీ ఉపాధి హామీ పేరుకు బదులు వికసిత్ భారత్ రోజ్‌గార్, అజీవికా హామీ మిషన్ (గ్రామీణ్) పేరుతో ఈ పథకం అమలు కానుంది. కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆ పేరుతో ఈ పథకం అమలు చేయాలని కేంద్రం ఇప్పటికే నిర్ణయించింది. పేరు మార్పుపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తుండగా.. కేంద్ర తిప్పికొడుతోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకంపై జరుగుతున్న ప్రచారాలపై క్లారిటీ ఇచ్చి ప్రజల అనుమానాలను తొలగించింది.

**కనీసం 125 రోజుల పని హామీ**

కొత్త చట్టంతో పని హక్కును కోల్పోతారనే వాదనలు ప్రతిపక్షాల నుంచి వస్తున్నాయి. అలాగే పని చేసినవారికి జీతం చెల్లింపు, నిరుద్యోగ భృతి వంటి విషయాలపై పలు వార్తలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. వీటిపై తాజాగా క్లారిటీ ఇస్తూ కేంద్రం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉపాధి హామీపై ఎలాంటి పరిమితులు లేవని, ఎలాంటి అగ్రికల్చర్ సీజన్ బేస్డ్ పరిమితులు విధించలేదని స్పష్టం చేసింది. నైపుణ్యం లేని, శారీరక శ్రమ చేయడానికి స్వచ్ఛంధంగా ముందుకొచ్చే ప్రతీ గ్రామీణ కుటుంబానికి ప్రతీ ఆర్థిక సంవత్సరంలో తప్పనిసరిగా 125 రోజుల పని కల్పిస్తామని తెలిపింది. విత్తనాలు వేసే, కోత కోసే కీలక సమయాల్లో వ్యవసాయ కూలీల అవసరం ఉన్నందున ఏడాదిలో 60 రోజుల పాటు పని లేని కాలం ఉంటుందని, మిగిలిన 305 రోజుల్లో 125 రోజుల పాటు లబ్దిదారులు పని చేసుకోవచ్చని ప్రభుత్వం పేర్కొంది.

పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి

ఏడాదిలో 125 రోజుల పని ఖచ్చితంగా ఉంటుందని కేంద్రం స్పష్టం చేసింది. పని కోరిన 15 రోజుల్లోగా ఉపాధి కల్పించాలని, లేని పక్షంలో నిరుద్యోగ భృతి తప్పనిసరిగా చెల్లిస్తామని తెలిపింది. పని చేసిన ప్రతీ వ్యక్తికి నోటిఫైడ్ వేతన రేటు ప్రకారం చెల్లింపులు జరుగుతాయిన తెలిపింది.

కొత్త చట్టం ప్రకారం ప్రతీ ఏటా వేతన రేట్లు నోటిఫై చేస్తామని వెల్లడించింది. పాత చట్టంలో కంటే కొత్త చట్టంలో వేతన రేట్లు ఎక్కువగా ఉంటాయని ప్రకటించింది. వారానికి ఒకసారి లేదా 15 రోజుల్లోగా పనిచేసిన వారికి అకౌంట్లో నిధులు జమ చేస్తామని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు భారం కాకుండా 60:40 నిష్పత్తిలో భాగస్వామ్యం ఉంటుందని, ఈశాన్య, హిమాలయ రాష్ట్రాలకు 90:10 నిష్పత్తిలో అమలు జరుగుతుందని కేంద్రం పేర్కొంది.

# భారతదేశంలో మాత్రమే ఉన్న అద్భుత గ్రామం.. ఇది మనుషుల సృష్టా? దేవతల అద్భుతమా..?

నీటిపై తేలుతున్నట్లుగా కనిపించే గ్రామాన్ని మీరు ఎక్కడైనా, ఎప్పుడైనా చూశారా? అవును, మీరు విన్నది నిజమే.. అలాంటి ఒక గ్రామం మన దేశంలోనే ఉంది. అక్కడి అందాలు మనల్ని కన్నార్పకుండా చేస్తాయి. నీటిపై నిర్మించిన వింత గ్రామం విజువల్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. ఆ వీడియో చూసిన వినియోగదారులు, పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు పరవశించి పోతున్నారు. ఆ గ్రామం ఎక్కడ ఉంది..? అక్కడి విశేషాలేంటో మీరు చూసేయండి... వైరల్ వీడియోలో ఒక గ్రామం మొత్తం నీటిపై తేలుతున్నట్లు కనిపిస్తుంది. నీటి అలల గుండా కదులుతున్న పడవలు, కాలువల వెంబడి నిర్మించిన రోడ్లు, వాహనాల కదలిక ఈ గ్రామానికి ఒక ప్రత్యేకమైన అందాన్ని ఇస్తున్నాయి. దీనిని చూసిన వారు ఎంతగానో ఆకర్షితులవుతారు. జీవితంలో ఒక్కసారైనా సరే..తప్పక ఈ గ్రామాన్ని సందర్శించాలని కోరుకుంటారు. అది మరెక్కడో కాదు.. దేవతల స్వర్గంగా పిలువబడే కేరళలోని ఈ అరుదైన గ్రామం ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కేరళలోని కొచ్చి సమీపంలోని 14 చిన్న దీవులలో కడమకుడి ఒకటి. ఈ ద్వీపం ప్రధాన లక్షణం దాని కాలువలు, బ్యాక్ వాటర్స్,




నీటిపై నిర్మించిన నడక మార్గాలు. డ్రోన్ ఫుటేజ్‌లో మొత్తం గ్రామం నీటితో కప్పబడి ఉన్నట్లు కనిపించడంతో దీనిని భారతదేశంలో నీటిపై నిర్మించిన ఏకైక గ్రామం అని పిలుస్తున్నారు. పర్యాటకులు రోడ్డు, జల మార్గాల ద్వారా కడమకుడికి చేరుకోవచ్చు. కారులో ప్రయాణించేవారు ఎడపల్లి లేదా కొచ్చి నుండి ఉత్తర పరవూర్ వైపు జాతీయ రహదారి 66 ను తీసుకొని వరపుజ వంతెన దాటిన తర్వాత, కడమకుడి మార్గంలో వెళ్ళవచ్చు. సైన్ బోర్డుల సహాయంతో ఈ గ్రామానికి సులభంగా చేరుకోవచ్చు. మీరు ప్రజా రవాణా ద్వారా కూడా కడమకుడికి చేరుకోవచ్చు. విట్టిల మొబిలిటీ హబ్ లేదా ఎర్నాకులం నుండి బస్సు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. ప్రత్యామ్నాయంగా మీరు ఎర్నాకులం హైకోర్టు జెట్టీ నుండి పిజాల చేరుకోవడానికి పడవలో ప్రయాణించి, ఆపై చిన్న పడవలలో కడమకుడికి చేరుకోవచ్చు. కడమకుడితో పాటు, కేరళలో పర్యాటకులను ఆకర్షించే అనేక ఇతర నీటి గ్రామాలు ఉన్నాయి. అలప్పుజ, కుమారకోమ్, కుట్టనాడ్, మనోర్ ద్వీపం, కొల్లం, కొట్టాయం బ్యాక్ వాటర్స్, బోటింగ్ సహజ సౌందర్యానికి ప్రసిద్ధి చెందాయి. కానీ, కడమకుడికి నీటిపై నిర్మించిన అరుదైన గ్రామంగా ప్రత్యేక గుర్తింపు ఉంది.

## బిజినెస్ వాయిస్

# వారికి బిగ్ రిలీఫ్.. 30 శాతం ట్యాక్స్ రద్దు




కేంద్ర బడ్జెట్ 2026 సమీపిస్తున్న వేళ, భారతీయ క్రిప్టో పెట్టుబడిదారులు పన్ను, నిబంధనల మార్పుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం 30 శాతం పన్ను, 1 శాతం టిడిఎస్ భారంతో, దేశీయ పెట్టుబడిదారులు విదేశీ ప్లాట్‌ఫారమ్‌లకు మళ్లుతున్నారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి..

మరికొన్ని రోజుల్లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ 2026 ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్ దగ్గర పడుతున్న తరుణంలో భారతీయ క్రిప్టోకరెన్సీ పెట్టుబడిదారులు దేశంలోని డిజిటల్ ఆస్తి పరిశ్రమలో మార్పు కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. డిజిటల్ కరెన్సీ రంగం భారీ పన్నులు, కఠినమైన నిబంధనలను ఎదుర్కొంటున్నందున, ఈసారి కొన్ని ముఖ్యమైన మార్పులను చూసే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. బడ్జెట్ 2026 క్రిప్టో పెట్టుబడిదారులకు 30 శాతం పన్ను నుండి ఉపశమనం కలిగించాలని క్రిప్టో పరిశ్రమ కోరుకునే కీలకమైన అంశం. అలాగే కేంద్ర ప్రభుత్వం డిజిటల్ రూపాయిని అంటే సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీని ప్రోత్సహించాలని కోరుకుంటోంది. భారత క్రిప్టో మార్కెట్ క్రిప్టోకరెన్సీలపై ప్రపంచంలోనే అత్యంత కఠినమైన పన్ను నియమాలకు లోబడి ఉంటుంది. దీనిని ధృవీకరించడానికి 2022 నుండి క్రిప్టో లాభాలపై ఒకే విధంగా 30 శాతం పన్ను విధించారు. ప్రతి లావాదేవీపై 1 శాతం టిడిఎస్ (మూలం వద్ద పన్ను మినహాయింపు)తో ఇది మరింత కఠినతరం అవుతుంది. ఈ 1 శాతం టిడిఎస్ లిక్విడిటీని అణిచివేస్తూ ట్రేడింగ్‌ను ఖరీదైనదిగా చేస్తుందని పరిశ్రమ అభిప్రాయపడుతోంది. పర్యవసానంగా పెద్ద సంఖ్యలో భారతీయ పెట్టుబడిదారులు ఆఫ్?షోర్, విదేశీ మారక ద్రవ్యాల వైపు మళ్లారు, దీని ఫలితంగా బిలియన్ల డాలర్ల వాణిజ్య పరిమాణం దేశం నుండి బయటకు వెళ్లింది. 2026 కేంద్ర బడ్జెట్‌కు ముందు క్రిప్టో పరిశ్రమకు డిమాండ్ స్పష్టంగా ఉంది. ఎక్స్ఛేంజీలు, వెబ్3 కంపెనీలు 1 శాతం టిడిఎస్‌ని 0.01 శాతానికి తగ్గించాలని కోరుతున్నాయి. దీనితో పాటు క్రిప్టో నష్టాలను లాభాలతో భర్తీ చేయడానికి అనుమతితో 30 శాతం పన్నును ఆదాయపు పన్ను స్లాబ్‌లకు అనుసంధానించాలనే డిమాండ్ ఉంది. కాయిన్‌డిసిఎక్స్, జెడ్‌పే వంటి ప్లాట్‌ఫామ్‌లు ఇది ప్రధాన చిక్కులను కలిగిస్తుందని అభిప్రాయపడుతున్నాయి, వీటిలో సమ్మతిలో గణనీయమైన పెరుగుదల, భారతీయ ఎక్స్ఛేంజీలు మళ్లీ పోటీతత్వంతో మారడానికి వీలు కల్పిస్తుంది. అయితే ప్రైవేట్ క్రిప్టోకరెన్సీల అస్థిరత, మనీలాండరింగ్ ప్రమాదాలు, ఆఫ్ షోర్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా నిర్వహించబడే లావాదేవీలను పర్యవేక్షించడంలో సవాళ్లపై ఆందోళనలను పేర్కొంటూ ప్రభుత్వం, ఆర్‌బిఐ రెండూ జాగ్రత్తగా వైఖరిని అవలంబిస్తూనే ఉన్నాయి.

### రైలులో జనరల్ బోగీలు ముందు, వెనుక ఎందుకు ఉంటాయి?

# మధ్యలో ఎందుకు ఉండవు?



రైల్వే ఏ విషయం అయినా ఆసక్తికరంగానే ఉంటాయి. సాధారణంగా రైలులో జనరల్ కంపార్ట్‌మెంట్స్ బోగీలు ముందు, వెనుకాల మాత్రమే ఉంటాయి. మధ్యలో ఉండవు. ఈ జనరల్ బోగీలు ముందు, వెనుక ఎందుకు ఉంటాయోనని మీరెప్పుడైనా ఆలోచించారా మధ్యలో ఉందుకు ఉండవో మీకు తెలుసా అసలు కారణాలు ఉన్నాయి..

రైలులో జనరల్ కోచ్‌లలో అత్యధిక సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. అయితే జనరల్ బోగీలు ఎప్పుడు కూడా ముందు, చివర మాత్రమే రెండు బోగీలు ఉంటాయి. మరి మధ్యలో ఎందుకు ఉండవో మీరెప్పుడైనా ఆలోచించారా ఈ కోచ్‌లను రైలు మధ్యలో ఉంచితే, అదనపు బరువు మొత్తం రైలు సమతుల్యతను దెబ్బతీస్తుంది. ముందు, వెనుక కోచ్‌లు ఉన్నందున బరువు సమానంగా బ్యాలెన్స్ అవుతుంది. దీంతో రైలు సురక్షితంగా నడుస్తుంది.

**రద్దీ నిర్వహణ:** జనరల్ కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఈ కంపార్ట్‌మెంట్‌లు రెండు చివర్లలో విభజించినందున ప్లాట్‌ఫారమ్‌పై ఒకే చోట రద్దీ ఉండదు. ఇది ప్లాట్‌ఫారమ్ మధ్యలో బరువు తక్కువగా ఉండటం వల్ల రైలుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అలాగే ఇతర ప్రయాణికులు ఎక్కడానికి, దిగడానికి సులభతరం చేస్తుంది.

**బోర్డింగ్, దిగే సౌకర్యాలు:** జనరల్ కంపార్ట్‌మెంట్ మధ్యలో ఉంటే రద్దీ కారణంగా రిజర్వ్ చేసిన కంపార్ట్‌మెంట్‌లోని ప్రయాణికులకు, కంపార్ట్‌మెంట్ ఎక్కేటప్పుడు లేదా దిగేటప్పుడు రైల్వే సిబ్బందికి అంతరాయం ఏర్పడవచ్చు. కంపార్ట్‌మెంట్ చివరిలో ఉన్నందున ఈ అమరిక సజావుగా ఉంటుంది.

**గార్డు నిఘా:** రైలు చివర జనరల్ కంపార్ట్‌మెంట్ ఉండటం వల్ల గార్డు మొత్తం రైలును, ప్రయాణికుల కదలికలను గమనించడం సులభం అవుతుంది. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో త్వరగా నిర్ణయాలు తీసుకోవచ్చు.

**ప్రత్యేక సీటింగ్ అమరిక:** జనరల్ కోచ్‌ల ఇంటీరియర్ డిజైన్, సీటింగ్ అమరిక ఇతర కోచ్‌ల కంటే భిన్నంగా ఉంటాయి. ఈ కోచ్‌లు మధ్యలో లేనందున ప్రయాణికుల ప్రవాహాన్ని నియంత్రించడం రైల్వే పరిపాలనకు సులభం అవుతుంది.

### 500 కి.మీ కంటే ఎక్కువ రేంజ్..

# టయోటా నుంచి కొత్త ఎలక్ట్రిక్ కారు!

క్యాబిన్ లేఅవుట్, ఫీచర్లు ఈ-విటారా మాదిరిగానే ఉంటాయి. టయోటా అర్బన్ క్రూయిజర్ ఇవి ఈ ఫీచర్స్‌తో వస్తుందని భావిస్తున్నారు. 10.1-అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్‌ప్లే, 10.25-అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే.. టయోటా అర్బన్ క్రూయిజర్ ఇవి భారతదేశంలో జనవరి 19, 2026 నుండి అందుబాటులోకి రానుంది. ఇది టయోటా సిగ్నేచర్ స్టైలింగ్?ను ప్రతిబింబించేలా కొన్ని కాస్మెటిక్ మార్పులతో రీబ్యాడ్జ్ చేసిన మారుతి సుజుకి ఇ విటారా. ఇది మిడ్-సైజ్ ఎలక్ట్రిక్ ఎస్‌యువి విభాగంలో మహీంద్రా బీఈ 6, హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్, ఎంజి జెడ్ఎస్ ఇవిలతో నేరుగా పోటీపడుతుంది. రాబోయే రోజుల్లో ధరలు ప్రకటించనున్నప్పటికీ, ఎలక్ట్రిక్ వాహనం బేస్ వేరియంట్ ధర దాదాపు రూ.21 లక్షలు, టాప్ వేరియంట్ ధర దాదాపు రూ.26 లక్షలు (ఎక్స్-షోరూమ్) ఉంటుందని అంచనా. అధికారిక పవర్ ట్రెయిన్ స్పెసిఫికేషన్లు, ఫీచర్లు, ఇతర వివరాలు ప్రస్తుతం రహస్యంగా ఉన్నాయి. అయితే కొత్త టయోటా ఎలక్ట్రిక్ ఎస్‌యువి ఇ-విటెరా లాగానే 49కెడబ్ల్యుహెచ్, 61కెడబ్ల్యుహెచ్ బ్యాటరీ ప్యాక్‌లను ఉపయోగించే అవకాశం ఉంది. రెండు బ్యాటరీలు ఫ్రంట్-యాక్సిల్ మౌంటెడ్ ఎలక్ట్రిక్ మోటారుతో జత చేస్తుంది. చిన్న బ్యాటరీ ప్యాక్ గరిష్టంగా 144బిహెచ్‌పి శక్తిని ఉత్పత్తి చేస్తుంది. పెద్దది 174బిహెచ్‌పి శక్తిని ఉత్పత్తి చేస్తుంది. టయోటా అర్బన్ క్రూయిజర్ ఇవి ఒక్కసారి ఛార్జ్ చేస్తే 500కెఎం కంటే ఎక్కువ డ్రైవింగ్ రేంజ్‌ను అందిస్తుందని భావిస్తున్నారు.

**అద్భుతమైన డిజైన్:**

కొత్త టయోటా ఎలక్ట్రిక్ ఎస్‌యువిలో డిఆర్ఎల్‌లతో కూడిన ఎల్ఇడి హెడ్‌లైట్లు, మధ్యలో టయోటా సిగ్నేచర్ బ్యాడ్జ్‌తో కూడిన మందపాటి నలుపు ట్రిమ్ ఉంటుందని తాజా టీజర్ ధృవీకరిస్తుంది. చివరి వేరియంట్ గత సంవత్సరం ఇండియా మొబిలిటీ షోలో ప్రదర్శించిన దాదాపు పూర్తి మోడల్‌ను పోలి ఉంటుంది.




**కారులో శక్తివంతమైన ఫీచర్లు :**

క్యాబిన్ లేఅవుట్, ఫీచర్లు ఈ-విటారా మాదిరిగానే ఉంటాయి. టయోటా అర్బన్ క్రూయిజర్ ఇవి ఈ ఫీచర్స్‌తో వస్తుందని భావిస్తున్నారు. 10.1-అంగుళాల టచ్?స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్‌ప్లే, 10.25-అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, ఇన్ఫినిటీ సౌండ్ సిస్టమ్, వైర్‌లెస్ ఫోన్ ఛార్జర్, గ్లాస్ రూఫ్, లెవల్ 2 ఎడిఎఎస్, ఏడు ఎయిర్‌బ్యాగులు, ముందు, వెనుక పార్కింగ్ సెన్సార్లు, బ్లైండ్‌స్పాట్ మానిటర్‌తో కూడిన 360-డిగ్రీ కెమెరా, ఆటో హోల్డ్‌తో కూడిన ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్.

# భారత్ ఎకానమి రేంజ్ ఇదీ.. అంచనాలను పెంచిన ఐఎంఎఫ్



గత సంవత్సరం కార్పొరేట్ లాభాలు మందగించడం మార్కెట్‌పై ఒత్తిడిని కలిగించాయి. విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు, స్టాక్ మార్కెట్ అస్థిరత కూడా ఒక కారణమయ్యాయి. అయితే ఇప్పుడు కార్పొరేట్ లాభాలలో మెరుగుదల సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇది పెట్టుబడిదారుల విశ్వాసాన్ని మరింతగా.. భారత వృద్ధిరేటు అంచనాను అంతర్జాతీయ ద్రవ్య నిధి గణనీయంగా పెంచింది. ప్రస్తుత ఆర్థిక (2025-26) సంవత్సరంలో భారత్? 7.3% వృద్ధిని నమోదు చేస్తుందని తాజాగా అంచనా వేసింది. ఇది గత అంచనా కంటే 0.7 శాతం కంటే ఎక్కువగా ఉండటం విశేషం. మెరుగైన కార్పొరేట్ ఆదాయాలు, బలమైన ఆర్థిక ఊపు దీనికి ప్రధాన కారణాలుగా ఐఎంఎఫ్ విశ్లేషించింది. సుంకాలకు సంబంధించిన ప్రపంచ గందరగోళం ఉన్నప్పటికీ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని చూపుతోందని ఐఎంఎఫ్ బుతోంది. ఐఎంఎఫ్ వరల్డ్ ఎకనామిక్ అవుట్ లుక్ నివేదిక ప్రకారం, భారతదేశం 2025-26 జీడీపీ వృద్ధి రేటు అంచనాను 0.7 శాతం పాయింట్లు పెంచి 7.3 శాతంగా పేర్కొంది. మూడవ త్రైమాసికంలో కార్పొరేట్ ఆదాయాలు అంచనాల కంటే మెరుగ్గా ఉన్నాయని, నాల్గవ త్రైమాసికంలో బలమైన ఆర్థిక ఊపు కనిపించిందని నివేదిక పేర్కొంది. అయితే తాత్కాలిక, ఇతర కారకాలు బలహీనపడటం వల్ల 2026, 2027లో భారతదేశ వృద్ధి 6.4 శాతానికి కొద్దిగా తగ్గవచ్చని ఐఎంఎఫ్ అంచనా వేసింది. అయితే 2026,2027 క్యాలెండర్ సంవత్సరాల్లో భారత ఆర్థిక వృద్ధి రేటు వరుసగా 6.3 శాతం, 6.5 శాతంంగా ఉండవచ్చని ఐఎంఎఫ్ తన నివేదికలో పేర్కొంది. కాగా, అంతర్జాతీయ వృద్ధి రేటు 2026లో 3.3 శాతం, 2027లో 3.2 శాతంగా ఉండే అవకాశం ఉందని అంచనా వేసింది. 2025లో ఇది 3.3 శాతంగా ఉండవిచ్చని ఐఎంఎఫ్ అంచనా. గత సంవత్సరం కార్పొరేట్ లాభాలు మందగించడం మార్కెట్‌పై ఒత్తిడిని కలిగించాయి. విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు, స్టాక్ మార్కెట్ అస్థిరత కూడా ఒక కారణమయ్యాయి. అయితే ఇప్పుడు కార్పొరేట్ లాభాలలో మెరుగుదల సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇది పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పునరుద్ధరిస్తుందని, మార్కెట్‌కు స్థిరత్వాన్ని తీసుకువస్తుందని ఐఎంఎఫ్ విశ్వసిస్తోంది. ఈ మెరుగుదల భారతదేశ ఆర్థిక వ్యవస్థలో కోలుకునే ప్రారంభ సంకేతాలను సూచిస్తుంది.

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎఐ కీలక పాత్ర:**

అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ ప్రకారం.. యుఎస్ సుంకాలు, వాణిజ్య ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ బలాన్ని ప్రదర్శించింది. ఈ సంవత్సరం ప్రపంచ వృద్ధి 3.3 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. ఇది అక్టోబర్ అంచనా కంటే 0.2 శాతం ఎక్కువ. ఎఐలో పెరుగుతున్న పెట్టుబడి ఈ బలానికి ప్రధాన కారణంగా పరిగణిస్తున్నారు. యూఎస్‌లో ఐటీ, ఎఐపెట్టుబడి 2001 నుండి అత్యధిక స్థాయికి చేరుకుంది. ఇది ఆసియా టెక్ ఎగుమతులపై కూడా సానుకూల ప్రభావాన్ని చూపుతోంది. 2025లో 4.1 శాతంగా ఉన్న ప్రపంచ ద్రవ్యోల్బణం 2026లో 3.8 శాతానికి, 2027లో 3.4 శాతానికి తగ్గవచ్చని ఐఎంఎఫ్ అంచనా వేసింది. ఆహార ధరలు తగ్గడం వల్ల భారతదేశంలో కూడా ద్రవ్యోల్బణం లక్ష్యానికి దగ్గరగా ఉంటుందని భావిస్తున్నారు. అయితే ఎఐ రంగంలో అధిక విలువలు, యుఎస్ స్టాక్ మార్కెట్‌లో క్షీణత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇప్పటికీ ప్రమాదాలుగానే ఉన్నాయని ఐఎంఎఫ్ హెచ్చరిస్తోంది. ఈ అంశాలు ప్రపంచ మార్కెట్లు, వడ్డీ రేట్లపై ఒత్తిడిని కలిగిస్తాయి.

### ఈ ఒక్క పని చేస్తే రూ.50 లక్షల రుణంపై రూ.18 లక్షలు ఆదా..

# బ్యాంకర్లు కూడా ఆశ్చర్యపోతారు!

మీరు బ్యాంకు నుంచి రూ.50 లక్షల హోమ్ లోన్ తీసుకుంటే ఏళ్ల తరబడి ఈఎంఐలు చెల్లించడం పెద్ద తలనొప్పిగా ఉంటుంది. తీసుకున్న రుణం కంటే రెట్టింపు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే మీరు కొన్ని ట్రిక్స్? పాటిస్తే రూ.50 లక్షల రుణంపై ఏకంగా రూ.18 లక్షల వరకు ఆదా చేసుకునే అవకాశం ఉంటుంది. అదేలాగో చూద్దాం.. గృహ రుణం తీసుకోవాలనే కల ఎంత అందంగా ఉందో దాని ఇఎంఐ కూడా అంతే భారంగా ఉంటుంది. 20-25 సంవత్సరాలుగా ప్రతి నెలా మీ జీతం తగ్గించుకోవడాన్ని చూసినప్పుడు ఇల్లు చౌకగా ఉందా లేదా వడ్డీ ఎక్కువగా ఉందా అని మీరు తరచుగా ఆలోచించాల్సి వస్తుంది? కానీ కొంచెం తెలివైన ప్రణాళికతో మీరు బ్యాంకుకు లక్షల రూపాయల వడ్డీని చెల్లించకుండా ఉండగలరు. ముఖ్యమైన విషయం ఏమిటంటే దీనికి పెద్ద మొత్తం డబ్బు లేదా సంక్లిష్టమైన ఫార్ములా అవసరం లేదు. కేవలం ఒక సాధారణ ముందస్తు చెల్లింపు ఉపాయం మీ మొత్తం రుణ అంశాన్ని మార్చగలదు.మీరు 25 సంవత్సరాలకు 8.5% వడ్డీ రేటుతో రూ.50 లక్షల గృహ రుణం తీసుకున్నారని అనుకుందాం. ఈ రుణంపై మీ ఇఎంఐ సుమారు రూ.40,261. మొత్తం 25 సంవత్సరాలలో మీరు బ్యాంకుకు సుమారు రూ.1.21 కోట్లు చెల్లిస్తారు. అందులో దాదాపు రూ.70.78 లక్షలు వడ్డీ మాత్రమే. అంటే వడ్డీ మొత్తం మాత్రమే అసలు కంటే దాదాపు రూ.21 లక్షలు మించిపోతుంది. ఇక్కడే చాలా మంది డిఫాల్ట్ అవుతారు.

**ఏం చేయాలి?**

రుణం తీసుకున్న తొలి సంవత్సరాల్లో మీ ఇఎంఐలో ఎక్కువ భాగం వడ్డీకే వెళు తుంది. అసలు చాలా నెమ్మదిగా జమ అవుతుంది. అందువల్ల రెండవ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం ఒక అదనపు ఇఎంఐని ముందస్తుగా చెల్లించడం వల్ల గణనీయమైన తేడా ఉంటుంది. ఉదాహరణకు మీరు ఫిబ్రవరి 2026 నుండి ప్రతి సంవత్సరం అదనంగా రూ.40,261 జమ చేస్తే మీ రుణాన్ని 25 సంవత్సరాలకు బదులుగా దాదాపు 19 సంవత్సరాల 7 నెలల్లో తిరిగి చెల్లించవచ్చు.




**ఈ వ్యూహం వల్ల ప్రయోజనం ఏమిటి?**

ఈ సరళమైన వ్యూహం మీరు దాదాపు 65 నెలల ముందుగానే లేదా 5 సంవత్సరాల 5 నెలల ముందుగానే రుణం చెల్లించేందుకు సహాయపడుతుంది. అదనంగా ఇది మీకు వడ్డీలో సుమారు రూ.18.31 లక్షలను ఆదా చేయడానికి అనుమతిస్తుంది. అంటే బ్యాంకుకు వెళ్లే డబ్బు మీ పొదుపుగా మారవచ్చు.

**నిపుణులు ఏమంటున్నారు?**

గృహ రుణాన్ని ముందస్తుగా చెల్లించడానికి ఉత్తమ సమయం ప్రారంభ సంవత్సరాలే అని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ముందస్తు చెల్లింపు కోసం బోనస్?లు, జీతం పెంపుదల లేదా పన్ను వాపసు వంటి నిధులను ఉపయోగించడం వల్ల వడ్డీని గణనీయంగా నియంత్రించవచ్చు. అయితే ముందస్తు చెల్లింపు చేయడానికి ముందు మీ అత్యవసర నిధి. బీమా, ముఖ్యమైన పెట్టుబడులను నిర్లక్ష్యం చేయకపోవడం కూడా ముఖ్యం.

# అదనపు బస్సు చార్జీలు లేవు...




సంక్రాంతికి హ్యాపీ జర్నీ ప్రతీ ఏటా సంక్రాంతి వచ్చిందంటే చాలు బస్సు చార్జీలు పెద్ద ఎత్తున పెంచుతారు. సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం స్వీట్ న్యూస్ ని వినిపించింది. బస్సులలో ప్రయాణించే ప్రయాణీకుల మీద ఎలాంటి సంక్రాంతికి అదనపు బస్సు చార్జీలు లేవు ని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. అందరూ హ్యాపీగా సంక్రాంతి పండుగకు తమ సొంత ఊళ్ళకు వెళ్ళి పెద్ద పండుగను ఆనందంగా చేసుకోవడానికి కూటమి ప్రభుత్వం ఈ విధంగా అవకాశాన్ని కల్పించింది.

**భారం లేకుండానే :**

ప్రతీ ఏటా సంక్రాంతి వచ్చిందంటే చాలు బస్సు చార్జీలు పెద్ద ఎత్తున పెంచుతారు. దాంతో సంక్రాంతి పండుగ ఆనందం అంతా ముందే ఆవిరి అవుతుంది. చేతిలో డబ్బులు ఇలా బస్సులకే పోసి ఇల్లు చేరిన వారికి ఎలాంటి హ్యాపీ ఉండదు, అందుకే హ్యాపీ జర్నీ చేయండి ఎక్కడా బాదుడు అన్నది లేదని కూటమి ప్రభుత్వం మంచి వార్తనే చెప్పింది. సంక్రాంతికి సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికులకు కూటమి ప్రభుత్వం తరఫున ఇది పండుగ కానుకగా అని మంత్రి చెప్పారు. అంతే కాదు సంక్రాంతి సందర్భంగా ప్రయాణికులకు మంత్రి మండిపల్లి కీలక సూచనలు కూడా చేశారు.

**మహిళలకు ఉచిత బస్సు :** ఇక గత ఏడాది ఆగస్టులో ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్సు సదుపాయం సంక్రాంతి పండుగ పండుగ రద్దీ దృష్ట్యా యథవిధిగా కొనసాగుతుందని మంత్రి చెప్పారు. అందువల్ల వారంతా ఉచిత బస్సులు ఎక్కి తమ ఊళ్ళకు పైసా ఖర్చు లేకుండా వెళ్ళవచ్చు అని కూడా మంత్రి వెల్లడిస్తున్నారు.సంక్రాంతి సందర్భంగా అదనపు చార్జీలు విధించబోమని చెబుతూనే ఈ ఏడాది మొత్తానికే ఆర్టీసీ చార్జీలలో ఎలాంటి పెంపుదల ఉండదని మంత్రి స్పష్టమైన ప్రకటన చేశారు. దాంతో మొత్తం 2026 అంతా బస్సు ప్రయాణీకులకు భారీ ఊరటగానే దీనిని చూడాలని అంటున్నారు.

**క్షేమంగా లాభంగా :** ఇదిలా ఉంటే సొంత వాహనాలలో అదే విధంగా ప్రైవేట్ వాహనాలలో ప్రయాణించే ప్రయాణికులు తగిన జాగ్రత్త తీసుకోవాలని వారు సేఫ్ గా గమ్యానికి చేరాలని కోరారు. సొంత వాహనాలు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించే వారు జాగ్రత్తగా నిబంధనలు పాటిస్తూ క్షేమంగా సొంత ఊళ్లకు చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. అదే విధంగా ప్రైవేట్ బస్సులు అక్రమంగా చార్జీలు పెంచితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక చార్జీలు వసూలు చేస్తే సంబంధిత బస్సులను సీజ్ చేయడం జరుగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందంగా సురక్షితంగా జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

మందుబాబులకు బిగ్ షాక్...

# కిక్ దిగాల్సిందేనా.. !



సంక్రాంతి పండుగ అంటే మందు మాంసం ఆ మీదట పందేలూ వినోదం అన్నీ ఉంటాయి. ఇక తాగిన వాడికి తాగినంత అన్నట్లుగా పరిస్థితి ఉంటుంది.సంక్రాంతి పండుగ అంటే మందు మాంసం ఆ మీదట పందేలూ వినోదం అన్నీ ఉంటాయి. ఇక తాగిన వాడికి తాగినంత అన్నట్లుగా పరిస్థితి ఉంటుంది. మందేసి చిందేస్తారు. ఫూటుగా పుచ్చుకుంటారు. అలాంటి వారికి ఏపీ ప్రభుత్వం ఒక బిగ్ షాక్ ఇచ్చేసింది. కొన్ని రకలైన మందు బాటిళ్ళ మీద ప్రభుత్వం అదనంగా పది రూపాయలు ఒక్కో బాటిల్ కి వంతున పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఏపీ ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

**వీటి రేట్లు పెరుగుతాయి :**

ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వుల మేరకు చూస్తే కనుక అన్ని రకాల సైజులతో కూడిన మందు బాటిళ్ళ మీద పది రూపాయలు దాకా ఒక్కో దాని మీద రేట్లు పెరుగుతాయి అని చెబుతున్నారు. దీంతో తాగే మందు మీద ఒక్క బాటిల్ కి పది రూపాయలు అంటే అక్కడికి మందు కిక్కు దిగిపోయినట్లే అని అంటున్నారు. అయితే ఇందులో కూడా కొంత శాతం ఊరటను కలిగించేలా నిర్ణయం తీసుకుఇంది. 180 మిల్లీ లీటర్ల మందు బాటిల్ కి దీని నుంచి సడలింపు ఉంది. వీటి ధర 99 రూపాయలు అలాగే కొనసాగుతుంది. అదే విధంగా దేశంలో తయారు చేసే విఐదేశీ లిక్కర్ బాటిళ్ళ మీద బీరు, వైన్, ఆర్టీడీలకు కూడా ఈ రేట్లు వర్తించవు అని పేర్కొంది.

**బార్ల విషయంలో :** అదే విధంగా ఏపీలో నిర్వహిస్తున్న బార్ల విషయంలోనూ ఎక్సైజ్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వాటి మీద ఇప్పటిదాకా విధిస్తున్న అదనపు ఏఆర్ఈటీని తొలగిస్తూ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇక రిటైలర్ మార్జిన్ ని అయితే దాదాపుగా ఒక శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు దానిని కూడా ఉత్తర్వులలో పేర్కొన్నారు. అయితే ఏపీలో మందు బాబులకు మాత్రం రేటు పెరగడం ఏ మాత్రం రుచించదు అని అంటున్నారు. కానీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం వెనక అనేక కారణాలు ఉన్నాయని చెబుతున్నారు.

**ఆర్థికంగా ఆదాయం :** ఈ పెంపు వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి అదనంగా ప్రతీ ఏటా ఒక వేయి 391 కోట్ల రూపాయల దాకా ఆదాయం వస్తుందని చెబుతున్నారు. ఒక బార్ల విషయంలో తీసుకున్న నిర్ణయం వల్ల యూనీఫారం పాలసీ వస్తుందని దాంతో బార్లలో మద్యం షాపులలో కూడా లిక్కర్ బాటిల్ రేట్లు ఒకే విధంగా ఉంటాయని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది. మొత్తానికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మద్యం ప్రియులకే తప్ప ఎవరికీ ఇబ్బంది లేదని అంటున్నారు.

# వైసీపీ కమిటీలు... డెడ్ లైన్ ఇచ్చినా..?




వైసీపీలో బూత్ లెవెల్ దాకా కమిటీలు వేయాలని అధినాయకత్వం పార్టీ నేతలను కోరుతోంది. మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇంచార్జిలను ఎనాడో పార్టీ నియమించింది. అంతే కాదు పాతిక దాకా ఉన్న లోక్ సభ సీట్లకు కూడా ఇంచార్జిలను నియమించారు. ప్రతీ రీజియన్ కి ఒక కో ఆర్డినేటర్ ని వేశారు. అలాగే రీజనల్ స్థాయిలో వర్కింగ్ ప్రెసిడెంట్లు అని అన్ని అనుబంధ విభాగాలకు నియమించారు ఇదే స్ట్రక్చర్ తో బూత్ లెవెల్ దాకా కమిటీలు వేయాలని అధినాయకత్వం కోరుతోంది. అయితే ఆ దిశగా యాక్టివ్ గా ఎంత మంది ఉన్నారు అన్నదే చర్చగా ముందుకు వస్తోంది.

**నర్శీపట్నం ఫస్ట్ :**

ఇక ఏపీలోనే నర్సీపట్నం నియోజకవర్గం బూత్ లెవెల్ దాకా కమిటీలు వేసి ఫస్ట్ ప్లేస్ లోకి వచ్చింది. జగన్ ఈ విషయంలో వైసీపీ నియోజకవర్గం ఇంచార్జి పెట్ల ఉమాశంకర్ గణేష్ ని అభినందించారు. ఇదే స్థాయిలో అందరూ పనిచేసి తొందరగా కమిటీల ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. సంస్థాగతంగా పార్టీ పటిష్టంగా ఉంటే మిగిలిన వాటి విషయంలో దృష్టి పెట్టాలని వైసీపీ భావిస్తోంది. సభ్యత్వ నమోదు కూడా : కమిటీల ప్రక్రియ ఒకసారి పూర్తి అయితే సభ్యత్వ నమోదు ని పూర్తి చేసి ఆ మీదట బూత్ లెవెల్ నుంచి కూడా పార్టీని కదం తొక్కించాలన్నది వైసీపీ పెద్దల ఆలోచన. అయితే కమిటీలు పూర్తి చేసే పనిలో మాత్రం నేతలు ఎందుకో నెలలు గడిపేస్తున్నారు. నియోజకవర్గం మండలాలు, గ్రామాలు వార్డులు బూత్ లెవెల్ దాకా కమిటీలు వేయాలని అంటున్నారు. వేలాది మంది క్యాడర్ కి ఈ విధంగా పదవులు వస్తాయని కూడా అధినాయకత్వం చెబుతోంది. పనిచేసే వారికి పెద్ద పీట వేయాలని కూడా సూచిస్తోంది. కానీ ఆచరణలో మాత్రం ఆలస్యం అలా జరుగుతూనే ఉంది.

**జిల్లాలలో కదలిక :** పార్టీ అధినాయకత్వం పదే పదే సూచించడంతో జిల్లాల స్థాయిలో నాయకత్వాలు ముందుకు కదులుతున్నాయి. తమ జిల్లా పరిధిలో ఏ నియోజకవర్గంలో ఎన్ని కమిటీలు పూర్తి చేశారు ఏమిటి అన్నది సమీక్ష నిర్వహిస్తున్నారు. తాజాగా చూస్తే అటు రాయలసీమ నుంచి ఇటు గోదావరి జిల్లాల దాకా వైసీపీ ముఖ్య నేతలతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఇందులో ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణం గురించే చర్చ సాగింది అని చెబుతున్నారు. కమిటీలను తొందరగా పూర్తి చేయడమే కాకుండా వాటిని డిజిటలైజేషన్ చేయాలని కూడా పార్టీ పెద్దలు సూచిస్తున్నారు.

**గుర్తింపు కార్డుతో :** ఇక వైసీపీలో ఉన్న ప్రతీ సభ్యుడికీ గుర్తింపు కార్డుని ఇవ్వాలని కూడా నిర్ణయించారు. దాని వల్ల పార్టీలో పనితీరుని ఎప్పటికపుడు బేరీజు వేసుకుని రేపటి రోజున కార్యకర్తలను కానీ తృతీయ శ్రేణి ఆ తరువాత శ్రేణులకు చెందిన నాయకులకు అవకాశాలు ఇవ్వాలని కూడా పార్టీ భావిస్తోంది. దాంతో కమిటీల కూర్పు అన్నది ఇపుడు పెద్ద చర్చగా మారుతోంది. మరో వైపు కమిటీల ఏర్పాటు పూర్తి అయితే జగన్ జిల్లా పర్యటనలు కూడా ఉంటాయని అంటున్నారు. మరి ఎక్కడ ఆలస్యం అంటే నాయకుల దగ్గరే అని చెబుతున్నారు. కమిటీలు వేయడానికి జాప్యం ఎందుకు జరుగుతోంది ఎవరికి ఉత్సాహం తగ్గింది, అధినాయకత్వం ఆదేశాలను ఎందుకు పెద్దగా పట్టించుకోవడం లేదు అన్నదే ఇపుడు సాగుతున్న చర్చగా ఉంది.

వివేకా హత్య కేసుపై

# సునీత మరో పిటిషన్.. సీబీఐ దర్యాప్తుపై అసంతృప్తి



మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై ఆయన కుమార్తె వైఎస్ సునీత మళ్లీ సుప్రీంకోర్టు తలుపుతట్టారు. వివేకా హత్య కేసుపై సీబీఐ విచారణ కొనసాగించేందుకు ఇటీవల ట్రయల్ కోర్టు ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. అయితే పరిమితంగానే దర్యాప్తునకు ట్రయల్ కోర్టు అనుమతించిందని, పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగించాలని కోరుతూ సునీత పిటిషన్ దాఖలు చేశారు. కేసులో తనకు చాలా అనుమానాలు ఉండగా, ట్రయల్ కోర్టు కేవలం ఇద్దరి వ్యక్తుల మధ్య సంభాషణపైనే దర్యాప్తునకు ఆదేశించిందని సునీత తన పిటిషన్ లో తెలిపారు. తన తండ్రి వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దర్యాప్తు మధ్యలోనే ఆపేసిందని సునీత అనుమానిస్తున్నారు. తన సోదరుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి వివేకా మరణించార్న సమాచారం ఎప్పుడు తెలిసింది? ఎవరి ద్వారా తెలిసింది? అన్న విషయాలపై స్పష్టత కావాలని సునీత గతంలో కోర్టును ఆశ్రయించారు. సీబీఐ దర్యాప్తు మధ్యలోనే ముగించిందని, కేసుకు సంబంధించిన మొత్తం కుట్రదారులు, సూత్రదారులను తేల్చాలని సునీత డిమాండ్ చేస్తున్నారు. దీనిపై గతంలోనే సుప్రీంలో సునీత పిటిషన్ వేశారు. మూడు నెలల్లో విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని సుప్రీం ట్రయల్ కోర్టుకు సూచించింది. గత నెలలో సునీత పిటిషన్ పై తీర్పునిచ్చిన ట్రయల్ కోర్టు పరిమితంగా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. 7వ నిందితుడు వైఎస్ భాస్కరరెడ్డి తమ్ముడు వైఎస్ ప్రకాష్ రెడ్డి మనవడు అర్జున్ రెడ్డికి, రెండో నిందితుడు సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్ యాదవ్ ముందుగా హత్య సమాచారాన్ని ఇచ్చారన్న ఆరోపణల నేపథ్యంలో ఆ ఇద్దరి టెలిఫోన్ సంభాషణపై దర్యాప్తు చేయాలని సీబీఐని ఆదేశిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ కేసులో సునీత సందేహాలు లేవనెత్తిన మిగిలిన నిందితులపై విచారణకు కోర్టు అనుమతించలేదు. అంతేకాకుండా పాక్షిక దర్యాప్తును నెలరోజుల్లో ముగించాలని న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ సునీత తాజాగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సునీత లేవనెత్తిన ప్రధాన సందేహాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకోకపోలేదని, సుప్రీంలో పిటిషన్ వేశారు. హత్య జరిగిన రోజు నిందితుడు, కడప ఎంపీ అవినాశ్ రెడ్డి ఫోన్ వాడుకలోనే ఉందని, ఆయన మాజీ సీఎం జగన్ కు హత్యపై ముందే సమాచారం ఇచ్చి ఉంటారని సీబీఐ సందేహం వ్యక్తం చేసిందని, అయితే ఈ విషయంపై దర్యాప్తు జరపలేదని సునీత కోర్టుకు నివేదించారు. రిటైర్డ్ ఐఏఎస్ అజేయ కల్లం తన వాంగ్మూలంలో ఉదయం 5 గంటలకు హైదరాబాద్ లోటస్ పాండ్ లో తాము జగన్ తో సమావేశంలో ఉండగా, భారతీ నుంచి జగన్ రెడ్డికి పిలుపువచ్చిందని, ఆ తర్వాత జగన్ రెడ్డి తమతో వివేకా మరణంపై చెప్పారని అజేయ్ కల్లాం వాంగ్మూలమిచ్చారు. ఇక్కడ భారతికి ఎలా సమాచారం వచ్చింది? ఎవరి నుంచి వచ్చిందన్న అంశంపై సీబీఐ దర్యాప్తు చేయలేదని, ఆ విషయంపైనా దర్యాప్తు కొనసాగాలని సునీత పిటిషన్ వేశారు.

# నల్లమల సాగర్ - ఏపీ స్ట్రాంగ్ పాయింట్స్ ఇవే..



రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల విషయంలో వివాదాలు రేగుతున్న సంగతి తెలిసిందే. రెండు జీవ నదులు తెలంగాణా మీదుగా ఏపీ వైపు వచ్చి సముద్రంలో కలుస్తాయి.రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల విషయంలో వివాదాలు రేగుతున్న సంగతి తెలిసిందే. రెండు జీవ నదులు తెలంగాణా మీదుగా ఏపీ వైపు వచ్చి సముద్రంలో కలుస్తాయి. క్రిష్ణా నది గోదావరి నది ఈ రెండూ కూడా తెలుగు నేలను సస్యశ్యామలం చేస్తాయి. ఈ రెండు నదుల మీదనే రెండు రాష్ట్రాల ఆర్థిక భవిష్యత్తుతో పాటు ఇతర రంగాల ప్రగతి కూడా ఆధారపడి ఉంది. ఈ నేపథ్యంలో పోలవరం-బనకచర్ల/నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు పై రెండు రాష్ట్రాల మధ్య న్యాయపరమైన పోరాటం కూడా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఏపీ తనదైన వాదన కోసం బలమైన పాయింట్స్ ని సిద్ధంగా చేసుకుంది. ఈ కేసు తాజా వాయిదా సుప్రీంకోర్టులో సోమవారం రానుంది.

**వేస్ట్ గా పోతున్నాయి :**

గోదావరి నది ఎగువ రాష్ట్రాల నుంచి పారుతూ ఆఖరుగా ఏపీలోకి ప్రవేశిస్తుంది. ఇక ఏపీలో పెద్ద ఎత్తున నీరు సాగరంలో కలుస్తోంది. మరి అలా ఎంతో వృధాగా పోతున్న గోదావరి నదీ జలాలను ఏపీ వాడుకుంటే తప్పేంటి అన్నదే రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న బలమైన వాదన అంటున్నారు. ఇక చూస్తే గోదావరి నీళ్ళు ఏకంగా మూడు వేలకు పైగా టీఎంసీలు సముద్రంలోకి పోతున్నాయి. అందులో కేవలం 200 టీఎంసీల నీటిని వాడుకుని ఏపీ తన ప్రగతికి ప్రాజెక్టులుగా మలచుకుంటే తప్పేమిటి అన్నది ఏపీ చేస్తున్న వాదనగా ఉంది.

**ఇది న్యాయమే :** ఇక చూస్తే కనుక గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ ప్రకారం చూసినా మిగిలిన నీటిని వినియోగించే హక్కు చివరి రాష్ట్రంగా ఏపీకి ఉందన్న విషయాన్ని నీటి రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు. ఈ ట్రిబ్యునల్ గోదావరి నది నీటి వనరుల భాగస్వామ్యం వినియోగానికి సంబంధించి నదీ తీర రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, కర్ణాటక ఒడిశా మధ్య చాలా కాలంగా ఉన్న వివాదాలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం 1969లో స్థాపించిన ఒక క్వాసీ-జ్యుడీషియల్ సంస్థగా ఉంది. ఇక ఈ ట్రిబ్యునల్ 1979లో తన తుది తీర్పును జారీ చేసింది, ఇది ఈ రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులకు సంబంధించిన అన్ని రకాలైన మార్గదర్శకాలను నిర్దేశించింది. గోదావరి బేసిన్ లో ఆంధ్రప్రదేశ్ దిగువ ప్రవాహ రాష్ట్రం కావడంతో ఇతర రాష్ట్రాల హక్కులకు భంగం కలుగకుండా మిగిలిన వరద నీటిని వాడుకోవచ్చునని చెబుతున్నారు.

**రాయలసీమ కోసమే :** ఇలా వేస్ట్ గా సముద్రంలోకి పోతున్న నీటిని రాయలసీమ ప్రాంతానికి తరలించి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడం కోసం ఈ ప్రాజెక్టు ని ఏపీ ప్రభుత్వం రూపకల్పన చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం కేంద్రానికి ప్రాజెక్ట్ ఫీజుబులిటీ రిపోర్ట్ సైతం సమర్పించింది. కేంద్రం సూచనలమేరకే మార్పులు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ కి సంబంధించి డిపిఆర్ కి సంబంధించిన టెండర్లు కేవలం ముందస్తు సన్నాహక చర్య మాత్రమే అని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెబుతున్నారు. ఇక చట్టపరమైన అన్ని అనుమతులు వచ్చాకే పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు చేపడతామని ఆయన అంటున్నారు. ఈ నేపథ్యంలో న్యాయం ఏపీ వైపే ఉందని, ఈ కేసు విషయంలో గట్టిగా వాదించాలని ఆయన అధికారులను న్యాయవాదులను కోరుతున్నారు. ఇక ఏపీ తరఫున ఈ కేసులో సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదిస్తున్నారు.

# నెల్లూరులో సీటూ ఫేటూ మారుతుందట..?




నెల్లూరు జిల్లా అంటే రాజకీయంగా ఎంతో చైతన్యవంతమైన ప్రాంతంగా చెప్పుకుంటారు. అక్కడ నుంచి ఎందరో రాజకీయంగా తెలుగు నాట కీర్తిని గడించారు. అలాంటి నెల్లూరు జిల్లాలో ఇపుడు రాజకీయ కలకలం రేగుతోంది. మరో అయిదు నెలలలో ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు అవుతుంది. ఈ ఏడాది కచ్చితంగా మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని అంటున్నారు. అందులో కొంత మందిని పక్కన పెడతారు అని గట్టిగా వినవస్తున్న మాట. ఇదే ఇపుడు పెద్ద ఎత్తున ప్రచారంగా సాగుతోంది.

**కీలక జిల్లా :**

వైసీపీకి అంతకు ముందు కాంగ్రెస్ కి అడ్డా లాంటి నెల్లూరు జిల్లాలో తొలిసారిగా టీడీపీ కూటమి పూర్తి ఆధిక్యత సాధించింది. పదికి పది సీట్లను తన ఖాతాలో వేసుకోవడమే కాదు ఎంపీని కూడా గెలుచుకుంది. వైసీపీ పోటీకి వచ్చాక 2014, 2019లలో టీడీపీకి ఈ జిల్లాలో ఎదురుగాలే వీచింది అలాంటి చోట బ్రహ్మరథం పట్టారు. దాంతో నెల్లూరు జిల్లాలో అదే రాజకీయాన్ని పదిలపరచుకోవాలని టీడీపీ కూటమి భావిస్తోంది ఇక 2024లో ప్రభుత్వం ఏర్పాటు అయినపుడు ఈ జిల్లా నుంచి సీనియర్ నేత ఆనం రామనారాయణరెడ్డికి కేబినెట్ లోకి తీసుకున్నారు. ఆయనకు దేవాదాయ శాఖను కేటాయించారు. అయితే ఎంతో సీనియర్ అయిన తనకు కీలక మంత్రిత్వ శాఖలు ఇస్తారని ఆయన ఊహించారు. కానీ అలా కాకపోవడంతో ఆయన తన శాఖ వరకూ మాత్రమే రియాక్ట్ అవుతున్నారు, పరిమితంగానే ఆయన రాజకీయం కూడా ఉంది అని అంటున్నారు.

**ఆయనకు నో చాన్స్ :** ఈ నేపథ్యంలో ఆనం కి ఈసారి చాన్స్ ఉండకపోవచ్చు అని జిల్లాలో గట్టిగా వినిపిస్తున్న మాటగా ఉంది. ఇక ఈ జిల్లాలో ఎపుడు మంత్రి పదవి ఇవ్వాలన్నా మొదటి పేరు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిదే అవుతుంది. ఆయన ఎమ్మెల్యేగా ఓటమి చెందినా 2014లో ఎమ్మెల్సీని చేసి మరీ వ్యవసాయ శాఖ వంటి కీలక శాఖను అప్పగించారు అలాంటిది ఈసారి సర్వేపల్లి నుంచి గెలిచి వచ్చినా ఎమ్మెల్యేగా ఉండిపోయారు. దాంతో ఆయనకు కనుక చాన్స్ ఇస్తే మాత్రం కేబినెట్ బెర్త్ ఖాయమని అంటున్నారు. ఒకవేళ కాదు అనుకుంటే వైసీపీ నుంచి టీడీపీలో చేరిన డైనమిక్ లీడర్ నెల్లూరు రూరల్ కి చెందిన కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. అయితే ఆయన పదవికి అర్బన్ నుంచి మంత్రిగా ఉన్న నారాయణ అడ్డు అవుతారని అంటున్నారు. ఒకే పరిధిలో ఇద్దరికి మంత్రి పదవి ఇస్తే జిల్లా మొత్తం మీద ప్రాంతీయ సమతూకం దెబ్బ తింటుంది అని అంటున్నారు.

**ఆమెకు ష్యూర్ నా :** ఈ నేపథ్యంలో మహిళ, రెడ్డి సామాజిక వర్గం, అంగబలం అర్థం బలం అన్నీ చూసుకుంటే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేరు సైతం బలంగా వినిపిస్తోంది అని అంటున్నారు. ఆమె వైసీపీకి కంచుకోట లాంటి కోవూరు నుంచి గెలుపొందారు. ఇక్కడ మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన 2014, 2019 లలో వరసగా గెలిచారు అంతకు ముందు కూడా గెలిచారు. కానీ 2024లో ఓటమి చెందారు, ఆయన పలుకుబడిని దెబ్బ తీసి టీడీపీకి గట్టి పునాదులు వేయాలి అనుకుంటే కనుక ఆమెకే చాన్స్ అంటున్నారు. మొత్తం మీద నెల్లూరు జిల్లాలో రెండవ మంత్రి పదవి కీలక రెడ్ల మధ్యనే చక్కర్లు కొడుతోంది అని అంటున్నారు. ఈ మొత్తం ప్రచారంలో ఒక్క విషయం ఏమిటి అంటే ఆనం కి మంత్రి పదవీ వియోగం తప్పదని. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## క్రీడా వాయిస్

# విరాట్ కోహ్లీని ఇమిటేట్ చేసిన యువీ..

### చూస్తే కడుపుబ్బ నవ్వాల్సిందే..



కపిల్ శర్మ తన నెట్‌ఫ్లిక్స్ కామెడీ షో ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో(సీజన్ 4)లో మరోసారి నవ్వుల విందు చేశారు. ఈసారి గెస్టులుగా వచ్చిన క్రికెట్ లెజెండ్స్ యువరాజ్ సింగ్, వీరేంద్ర సెహ్వాగ్, మహమ్మద్ కైఫ్ చేసిన అల్లరి అంతా ఇంతా కాదు. ముఖ్యంగా విరాట్ కోహ్లీని ఇమిటేట్ చేస్తూ యువీ చేసిన యాక్షన్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న కపిల్ శర్మ షో తాజా ఎపిసోడ్‌లో క్రికెట్ దిగ్గజాలు తమ పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. షో మధ్యలో కపిల్ శర్మ ఒక సరదా గేమ్ ఆడించారు. ఒకరు తన తలపై ఉన్న కార్డుపై ఉన్న పేరును చూసుకోకుండా, మిగిలిన ఇద్దరు ఇచ్చే క్లూలతో ఆ పేరును కనిపెట్టాలి. సెహ్వాగ్ తలపై ఉన్న కార్డు మీద విరాట్ కోహ్లీ పేరు రాసి ఉంది. ఈ క్లూ ఇచ్చే క్రమంలో యువరాజ్ సింగ్ తనదైన శైలిలో కోహ్లీ ముఖకవళికలను, పాత కాలపు దూకుడును ఇమిటేట్ చేశాడు. అది చూసిన సెహ్వాగ్ వెంటనే విరాట్ పేరు చెప్పేయడంతో సెట్ మొత్తం నవ్వులతో నిండిపోయింది. షోలో నవ్వులు పూయించడానికి మరో కారణం కూడా ఉంది. ఆడియెన్స్ గ్యాలరీలో విరాట్ కోహ్లీలా ఉండే ఇద్దరు వ్యక్తులు కూర్చున్నారు. వారిని చూసిన కపిల్ శర్మ తన మార్కు పంచ్?లతో రెచ్చిపోయారు. "ఒకరు అచ్చు అసలు కోహ్లీలా ఉన్నారు.. కానీ ఇంకొకరు మాత్రం కోహ్లీని నీళ్లలో నానబెట్టి తీసినట్లు ఉన్నారు.. అందుకే కోహ్లీ కా కాస్త కోహ్లా అయ్యాడు" అని జోక్ చేయడంతో గెస్టులు కిందపడి నవ్వుకున్నారు. యువరాజ్ కూడా వారిని చూస్తూ కోహ్లీ పాత కోపాన్ని గుర్తు చేస్తూ సైగలు చేయడం సోషల్ మీడియాలో హైలైట్ గా నిలిచింది. విరాట్ కోహ్లీ కెరీర్ ప్రారంభంలో మైదానంలో చాలా దూకుడుగా ఉండేవారు. వికెట్ తీసినప్పుడు లేదా కోపం వచ్చినప్పుడు ఆయన అన్న ఒక హిందీ తిట్టు, ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ పేరులా వినిపిస్తుందని అప్పట్లో పెద్ద మీమ్ నడిచింది. యువరాజ్ సింగ్ కపిల్ షోలో ఏమీ మాట్లాడకుండానే ఆ మీమ్‌ను తన యాక్షన్‌తో గుర్తు చేశారు. "హస్నా నహీ థా.. బస్ యేహీ బోల్నా థా" (నవ్వకూడదు.. కేవలం ఇదే చెప్పాలి) అంటూ యువీ ఇన్ డైరెక్ట్ గా కోహ్లీ దూకుడును ప్రదర్శించడంతో జడ్జీలు అర్చన పురాణ్ సింగ్, నవజ్యోత్ సింగ్ సిద్ధూ షాక్ అయ్యారు. ఈ వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. యువీ టైమింగ్ ఎప్పటికీ సూపర్.. విరాట్ ని సరిగ్గా పట్టేశాడు అని కొందరు అంటుంటే, కోహ్లీ ఫామ్?లో ఉంటే యువీ ఇలాంటి సరదా ఆటలు ఆడటం సహజమే అని మరికొందరు కామెంట్ చేస్తున్నారు. తాజాగా ఇండోర్ వన్డేలో కోహ్లీ సెంచరీ బాదడంతో, యువీ ఇన్స్టాగ్రామ్ లో కూడా కోహ్లీని కొనియాడుతూ పోస్ట్ పెట్టారు. మైదానం వెలుపల వీరు పంచుకునే స్నేహం అభిమానులను ఎంతో ఆకట్టుకుంటోంది.

# విరాట్, రోహిత్ ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్..

### మైదానంలో చూడాలంటే మరో ఐదు నెలలు ఆగాల్సిందే..



న్యూజిలాండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్ టీమిండియాకు చేదు జ్ఞాపకాన్ని మిగిల్చింది. ఇండోర్ వేదికగా జరిగిన చివరి వన్డేలో భారత్ 41 పరుగుల తేడాతో ఓడిపోవడమే కాకుండా, సిరీస్‌ను 2-1తో కివీస్‌కు అప్పగించింది. ఈ ఏడాది జూన్‌లో అఫ్గానిస్థాన్ జట్టు భారత్‌లో పర్యటించనుంది. న్యూజిలాండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్ టీమిండియాకు చేదు జ్ఞాపకాన్ని మిగిల్చింది. ఇండోర్ వేదికగా జరిగిన చివరి వన్డేలో భారత్ 41 పరుగుల తేడాతో ఓడిపోవడమే కాకుండా, సిరీస్‌ను 2-1తో కివీస్‌కు అప్పగించింది. ఈ సిరీస్‌లో విరాట్ కోహ్లీ అద్భుతమైన ఫామ్‌ను కనబరిచినప్పటికీ, రోహిత్ శర్మ మాత్రం బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. నిర్ణయాత్మకమైన మూడో వన్డేలో విరాట్ తన 54వ వన్డే సెంచరీ (124 పరుగులు) బాదినప్పటికీ, ఇతర ఆటగాళ్ల సహకారం లేక భారత్ చారిత్రాత్మక ఓటమిని మూటగట్టుకుంది.

**రోహిత్, విరాట్ మళ్ళీ ఎప్పుడు ఆడతారు?**

టెస్టులు, టీ20ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఈ దిగ్గజ ద్వయం కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కనిపిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం.. వీరు మళ్ళీ భారత జెర్సీలో కనిపించాలంటే ఈ ఏడాది జూన్ వరకు నిరీక్షించాల్సిందే. ప్రస్తుతం న్యూజిలాండ్‌తో జరగబోయే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో వీరు భాగం కాదు. వచ్చే నెలలో జరగబోయే టీ20 వరల్డ్ కప్ 2026కు సన్నద్ధమవుతున్న తరుణంలో, కోహ్లీ మరియు రోహిత్ కొంతకాలం అంతర్జాతీయ క్రికెట్‌కు విరామం తీసుకోనున్నారు.

**అఫ్గానిస్థాన్‌తో తదుపరి పోరు**

ఐసీసీ ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్ (2023-27) ప్రకారం.. ఈ ఏడాది జూన్?లో అఫ్గానిస్థాన్ జట్టు భారత్?లో పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా జరిగే మూడు వన్డేల సిరీస్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మళ్ళీ మైదానంలోకి దిగనున్నారు. ఈ సిరీస్‌కు సంబంధించిన షెడ్యూల్ ఇంకా అధికారికంగా ఖరారు కాలేదు. ఆ తర్వాత జూలై 14 నుంచి జూలై 19 వరకు ఇంగ్లాండ్‌లో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో కూడా వీరు పాల్గొంటారు. ఎడ్జ్‌బాస్టన్ నుంచి లార్డ్స్ వరకు జరిగే ఈ సిరీస్ భారత జట్టుకు అత్యంత కీలకం కానుంది.

**మధ్యలో ఐపీఎల్ హంగామా**

అంతర్జాతీయ మ్యాచ్‌లకు విరామం ఉన్నప్పటికీ, మార్చి 26 నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026లో విరాట్, రోహిత్ తమ సత్తా చాటనున్నారు. విరాట్ కోహ్లీ డిఫెండింగ్ ఛాంపియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున బరిలోకి దిగుతుండగా, రోహిత్ శర్మ ఐదుసార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్ తరపున ఆడనున్నాడు. అంతర్జాతీయ వన్డేల కంటే ముందే అభిమానులు తమ ఫేవరెట్ హీరోలను ఐపీఎల్ రంగురంగుల జెర్సీల్లో చూసి ఆనందించవచ్చు.



# హిట్‌మాన్‌లో కసి చచ్చిపోయిందా?..

ఇండోర్‌లో జరిగిన సిరీస్ డిసైడర్ అయిన మూడో వన్డేలో 338 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రోహిత్ కేవలం 11 పరుగులకే వెనుదిరగడం అభిమానులను నిరాశకు గురిచేసింది. గతేడాది ఆస్ట్రేలియాపై ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన రోహిత్, ఇప్పుడు కివీస్‌పై కనీసం ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేకపోవడం చర్చనీయాంశమైంది. న్యూజిలాండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో రోహిత్ శర్మ ఘోరంగా ఫెయిలయ్యాడు. మూడు ఇన్నింగ్స్?ల్లో కలిపి అతను కేవలం 61 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇందులో అతని అత్యధిక స్కోరు 26 పరుగులు. ముఖ్యంగా ఇండోర్‌లో జరిగిన సిరీస్ డిసైడర్ అయిన మూడో వన్డేలో 338 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రోహిత్ కేవలం 11 పరుగులకే వెనుదిరగడం అభిమానులను నిరాశకు గురిచేసింది. గతేడాది

## కివీస్ మాజీ స్టార్ షాకింగ్ కామెంట్స్.. 2027 వరల్డ్ కప్ కలేనా?

ఆస్ట్రేలియాపై ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన రోహిత్, ఇప్పుడు కివీస్‌పై కనీసం ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేకపోవడం చర్చనీయాంశమైంది. సైమన్ డౌల్ ఏమన్నారంటే? రోహిత్ ఆటతీరును గమనించిన న్యూజిలాండ్ మాజీ పేసర్, కామెంటేటర్ సైమన్ డౌల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "రోహిత్‌కు ఎప్పుడూ ఒక టార్గెట్ ఉంటుంది.. టీ20 వరల్డ్ కప్ లేదా 50 ఓవర్ల వరల్డ్ కప్ వంటి గోల్ ఉంటేనే అతను కసితో ఆడతాడు. కానీ 2027 వన్డే వరల్డ్ కప్ ఇంకా చాలా దూరంలో ఉంది. అంతవరకు ఆడే కసి రోహిత్‌లో ఉందా? అని నాకు అనుమానంగా ఉంది" అని డౌల్ విశ్లేషించారు. రోహిత్ ప్రస్తుతం కేవలం వన్డే ఫార్మాట్‌కే పరిమితం అవ్వడం వల్ల, అతనికి తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లభించడం లేదని, ఇది అతని ఫామ్‌పై ప్రభావం చూపుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. రోహిత్ ఫామ్‌పై విమర్శలు వస్తున్న తరుణంలో, టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అతనికి సపోర్టుగా నిలిచాడు. "రోహిత్ భాయ్ మంచి ఫామ్‌లోనే ఉన్నాడు. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా సిరీస్‌ల్లో అతను బాగా ఆడాడు. ప్రతి మ్యాచ్‌లోనూ భారీ స్కోర్లు చేయడం ఎవరికైనా సాధ్యం కాదు. అతను త్వరలోనే పుంజుకుంటాడు" అని గిల్ ధీమా వ్యక్తం చేశాడు. అయితే మాజీ కోచ్ రవిశాస్త్రి మాత్రం డౌల్ వ్యాఖ్యలతో కొంతవరకు ఏకీభవించారు. క్రికెట్‌లో సుదీర్ఘకాలం రాణించాలంటే ఆటపై కసి, కోరిక చాలా ముఖ్యమని శాస్త్రి పేర్కొన్నారు. టెస్టులు, టీ20ల నుంచి తప్పుకున్న రోహిత్.. మళ్ళీ భారత జెర్సీలో కనిపించాలంటే జూలైలో జరిగే ఇంగ్లాండ్ పర్యటన వరకు ఆగాల్సిందే. అంటే దాదాపు ఐదు నెలల పాటు అతనికి అంతర్జాతీయ మ్యాచ్?లు లేవు. ఈ లోపు మార్చిలో ప్రారంభమయ్యే ఐపీఎల్ 2026లో రోహిత్ ముంబై ఇండియన్స్ తరపున ఆడనున్నాడు. తనపై వస్తున్న విమర్శలకు బ్యాట్?తోనే సమాధానం చెప్పాలని హిట్ మాన్ పట్టుదలతో ఉన్నాడు.

# ఓడినా సరే ఫ్యాన్స్ మనసు గెలుచుకున్న విరాట్..

### కివీస్ పరుగుల వీరుడికి కోహ్లీ కానుక



భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన వన్డే సిరీస్‌లో టీమిండియాకు ఓటమి ఎదురైనప్పటికీ, మైదానం వెలుపల ఒక అద్భుతమైన సన్నివేశం చోటుచేసుకుంది. న్యూజిలాండ్ చారిత్రాత్మక విజయంలో కీలక పాత్ర పోషించిన డారిల్ మిచెలను భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అభినందించారు. భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన వన్డే సిరీస్‌లో టీమిండియాకు ఓటమి ఎదురైనప్పటికీ, మైదానం వెలుపల ఒక అద్భుతమైన సన్నివేశం చోటుచేసుకుంది. న్యూజిలాండ్ చారిత్రాత్మక విజయంలో కీలక పాత్ర పోషించిన డారిల్ మిచెల్‌ను భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అభినందించారు. తనను ఆదర్శంగా భావించే మిచెల్‌కు కోహ్లీ ఒక అమూల్యమైన బహుమతిని అందించాడు. భారత ఆటగాళ్లందరి సంతకాలు ఉన్న తన జెర్సీని మిచెల్?కు కానుకగా ఇచ్చి తన పెద్ద మనసును చాటుకున్నాడు. ఈ ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ వన్డే సిరీస్?లో డారిల్ మిచెల్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. మూడు మ్యాచ్?ల్లో ఏకంగా 352 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును దక్కించుకున్నాడు. ఇందులో 8 భారీ సిక్సర్లు, 31 ఫోర్లు ఉన్నాయి. అతని బ్యాటింగ్ సగటు చూస్తే కళ్లు చెదిరిపోవాల్సిందే.. ఏకంగా 176 సగటుతో మిచెల్ పరుగులు సాధించాడు. తన రోల్ మోడల్ అయిన విరాట్ కోహ్లీని కూడా ఈ సిరీస్?లో మిచెల్ అధిగమించాడు. కోహ్లీ 240 పరుగులు చేయగా, మిచెల్ అంతకంటే వంద పరుగులు ఎక్కువే చేసి కివీస్ సిరీస్ గెలవడంలో ప్రధాన కారకుడయ్యాడు. భారత పిచ్‌లపై ఇంతలా ఎలా రాణించగలిగారని అడిగినప్పుడు, మిచెల్ దీనికి కారణం ఐపీఎల్ అని సమాధానమిచ్చాడు. చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల తరపున ఆడిన అనుభవం తనకు ఇక్కడ బాగా పనికొచ్చిందని చెప్పాడు. భారత వాతావరణం, ఇక్కడి అభిమానుల మధ్య ఆడటం తనకు ఎంతో ఇష్టమని మిచెల్ పేర్కొన్నాడు. అయితే విచారకరమైన విషయం ఏమిటంటే.. 2026 ఐపీఎల్ వేలంలో ఏ జట్టూ అతనిని కొనుగోలు చేయలేదు. కానీ లేటెస్ట్ ఫామ్ చూశాక.. ఎవరైనా ఆటగాడు గాయపడితే మిచెల్‌కు వెంటనే పిలుపు రావడం ఖాయం. సిరీస్ విజయం అనంతరం మిచెల్ ఉద్వేగంగా మాట్లాడాడు. "భారత్?ను వారి సొంత గడ్డపై టెస్ట్, వన్డే ఫార్మాట్లలో ఓడించడం మామూలు విషయం కాదు. గతంలో చాలా కివీస్ జట్లు ఇక్కడ పర్యటించాయి, కానీ ఈ టీమ్ సాధించిన ఘనత చాలా ప్రత్యేకం" అని చెప్పాడు. భారత్ వంటి పటిష్టమైన జట్టును వారి గడ్డపై ఓడించడం ప్రతి ఆటగాడికి గర్వకారణమని ఆయన భావించాడు. కోహ్లీ ఇచ్చిన జెర్సీని తన జీవితాంతం గుర్తుంచుకుంటానని, ఇది ఒక గొప్ప జ్ఞాపకమని ఆనందం వ్యక్తం చేశాడు. మైదానంలో ఎంత దూకుడుగా ఉన్నా, బయట విరాట్ కోహ్లీ ప్రవర్తించే తీరు ఎప్పుడూ ప్రశంసనీయం. ప్రత్యర్థి జట్టు ఆటగాడైనా, మంచి ప్రదర్శన చేసినప్పుడు వారిని ప్రోత్సహించడంలో విరాట్ ముందుంటాడు. గతంలో బాబర్ ఆజం, రిజ్వాన్ వంటి ఆటగాళ్లకు కూడా కోహ్లీ తన జెర్సీని బహుమతిగా ఇచ్చాడు. ఇప్పుడు మిచెల్‌కు కూడా జెర్సీని ఇచ్చి, ప్రపంచవ్యాప్తంగా తనకున్న అభిమానుల సంఖ్యను మరింత పెంచుకున్నాడు.

# మొహ్సిన్ నఖ్వీ భారీ స్కెచ్..

### టీ20 వరల్డ్ కప్‌ను అడ్డుకునేందుకు పాక్ సరికొత్త డ్రామా





బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ తాము భారత్ రాబోమని అధికారికంగా ప్రకటించడానికి భద్రతా కారణాలను సాకుగా చూపిస్తోంది. అయితే దీని వెనుక మాత్రం అక్కడి మొహమ్మద్ యూనస్ ప్రభుత్వ ఒత్తిడి బలంగా ఉందని సమాచారం. భారత్?లో తమ జట్టుకు రక్షణ ఉండదని వారు వాదిస్తున్నారు. 2026లో భారత్ వేదికగా జరగాల్సిన టీ20 వరల్డ్ కప్‌కు ముందే పొలిటికల్ హీట్ మొదలైంది. క్రికెట్ కంటే ఎక్కువగా ఇప్పుడు దేశాల మధ్య విభేదాలు చర్చనీయాంశంగా మారాయి. బంగ్లాదేశ్ జట్టు భారత్?కు వచ్చి ఆడేందుకు నిరాకరించడం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. అయితే ఈ వ్యవహారం వెనుక బంగ్లాదేశ్ కంటే పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ చక్రం తిప్పుతున్నట్లు అంతర్జాతీయ క్రీడా వర్గాల్లో చర్చ నడుస్తోంది. భారత్‌లో టోర్నీని సజావుగా సాగనివ్వకూడదనే కుట్ర ఇందులో దాగి ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**బంగ్లాదేశ్ భద్రతా సాకులు.. అసలు కథ వేరే?**

బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ తాము భారత్ రాబోమని అధికారికంగా ప్రకటించడానికి భద్రతా కారణాలను సాకుగా చూపిస్తోంది. అయితే దీని వెనుక మాత్రం అక్కడి మొహమ్మద్ యూనస్ ప్రభుత్వ ఒత్తిడి బలంగా ఉందని సమాచారం. భారత్?లో తమ జట్టుకు రక్షణ ఉండదని వారు వాదిస్తున్నారు. ఈ క్రమంలోనే బంగ్లాదేశ్ ప్రభుత్వం పాకిస్థాన్ మద్దతు కోరింది. ఆశ్చర్యకరంగా పాకిస్థాన్ వెనుకాముందు ఆలోచించకుండా బంగ్లాదేశ్?కు జై కొట్టింది. బంగ్లాదేశ్ మ్యాచ్?లను భారత్ వెలుపల నిర్వహించాలని పాక్ డిమాండ్ చేయడం విశేషం.

**పాకిస్థాన్ మైండ్ గేమ్.. ఐసీసీకి హెచ్చరిక?**

పాకిస్థాన్ కేవలం సపోర్టు పలకడమే కాకుండా ఒక అడుగు ముందుకు వేసి ఐసీసీని బెదిరించే ధోరణిలో వ్యవహరిస్తోంది. ఒకవేళ బంగ్లాదేశ్‌ను టోర్నీ నుంచి తప్పిస్తే తాము కూడా వరల్డ్ కప్ నుంచి తప్పుకుంటామని సంకేతాలు ఇచ్చింది. ఆసియా క్రికెట్‌లో బీసీసీఐ ఆధిపత్యానికి గండి కొట్టేందుకే మొహ్సిన్ నఖ్వీ ఈ తరహా ఎత్తుగడలు వేస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. జియో సూపర్ వంటి పాకిస్థాన్ మీడియా సంస్థలు కూడా ఇదే విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. పాక్ ప్రభుత్వం బంగ్లాదేశ్ నిర్ణయాన్ని సమర్థిస్తూ, భారత్‌పై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నిస్తోంది.

**ఐసీసీ డెడ్ లైన్.. తేల్చి చెప్పిన కౌన్సిల్**

ఈ గందరగోళం మధ్య అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తన వైఖరిని స్పష్టం చేసింది. టీ20 వరల్డ్ కప్ వేదికలను మార్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. ఇప్పటికే ఐసీసీ ప్రతినిధులు బంగ్లాదేశ్ వెళ్లి చర్చలు జరిపినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో ఐసీసీ జనవరి 21 వరకు బంగ్లాదేశ్‌కు చివరి అవకాశం ఇచ్చింది. ఆ తేదీ లోపు తమ నిర్ణయాన్ని మార్చుకోకపోతే బంగ్లాదేశ్ స్థానంలో వేరే జట్టును టోర్నీలోకి తీసుకుంటామని హెచ్చరించింది. అటు భారత్ కూడా భద్రత విషయంలో ఎలాంటి లోటు ఉండదని భరోసా ఇస్తున్నా, బంగ్లాదేశ్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు.

**టోర్నీ షెడ్యూల్ పట్టాలెక్కుతుందా?**

జనవరి 21 తర్వాత ఈ వివాదం ఏ మలుపు తిరుగుతుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ బంగ్లాదేశ్, పాకిస్థాన్ రెండూ టోర్నీకి దూరమైతే, ఐసీసీకి భారీ ఆర్థిక నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అదే సమయంలో భారత్ నిర్వహించే ప్రతిష్టాత్మక టోర్నీని అభాసుపాలు చేయాలనే పాక్ వ్యూహం ఎంతవరకు పారుతుందో చూడాలి. ఏదేమైనా క్రికెట్ అభిమానులు మాత్రం ఆటను ఆటలాగే చూడాలని, రాజకీయాలను మైదానంలోకి తీసుకురావొద్దని కోరుకుంటున్నారు.

సినీ వాయిస్ CINEMA

# ఓవర్ నైట్ స్టార్ అయిపోయిన చైల్డ్ ఆర్టిస్ట్..

## ఫస్ట్ మూవీతోనే బ్లాక్ బస్టర్.. ఇప్పుడు తెలుగులోకి ఎంట్రీ..



సినీరంగంలో హీరోయిన్ గా నిలదొక్కుకోవడం అంత సులభం కాదు. ఎన్నో ఆశలతో ఇండస్ట్రీలోకి అడుగుపెడుతుంటారు. కొందరు సక్సెస్ కాగా.. మరికొందరు మాత్రం హిట్టు కోసం వెయిట్ చేస్తుంటారు. కానీ కొందరు ముద్దుగుమ్మలు మాత్రం ఫస్ట్ మూవీతోనే ఓవర్ నైట్ స్టార్ అయిపోతుంటారు. ఒక్క సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షిస్తుంటారు. సినిమా ప్రపంచంలో హీరోయిన్లుగా గుర్తింపు తెచ్చుకోవడం అంత సులభం కాదు. ఒక్క సినిమాతో సకటచవతీతీచ్చస్ అయినవారు చాలా మంది ఉన్నారు. కానీ మొదటి సినిమా ఫలితం కాస్త అటు ఇటు అయితే పరిస్థితి మొత్తం మారిపోతుంది. కొన్నిసార్లు తారల జీవితాలు కూడా మారిపోతుంటాయి. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న హీరోయిన్ సైతం ఆ జాబితాలోకి చెందినవారే. ఇప్పుడు సోషల్ మీడియాలో మారుమోగుతున్న పేరు సారా అర్జున్. మొన్నటి వరకు చైల్డ్ ఆర్టిస్టుగా మెప్పించిన ఈ అమ్మడు.. ఇప్పుడు హీరోయిన్ గా అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. కథానాయికగా తొలి చిత్రంతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. హిందీలో ధురంధర్ సినిమాతో కథానాయికగా కనిపించింది సారా. ఈ సినిమాతో ఆమె పేరు పాన్ ఇండియా లెవల్లో మారుమోగింది. తొలి చిత్రంతోనే ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. ఇప్పుడు యుఫోరియా సినిమాతో తెలుగు తెరకు హీరోయిన్ గా పరిచయం కాబోతుంది. ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో భూమిక కథానాయికగా నటిస్తుండగా.. ఇందులో సారా అర్జున్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. యుఫోరియా సినిమాతో ఇప్పుడు ఆమె పేరు తెగ వినిపిస్తుంది. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 6న విడుదల చేయనున్నారు. ఇప్పుడు ఈ సినిమా తర్వాత తెలుగులో సారా అర్జున్ కు మరిన్ని ఆఫర్స్ రావడం ఖాయమని తెలుస్తోంది. సారా అర్జున్... గతంలో సౌత్ ఇండస్ట్రీలో చైల్డ్ ఆర్టిస్టుగా కనిపించింది. విక్రమ్ చియాన్ నటించిన నాన్న సినిమాలో నటించింది. ఇందులో విక్రమ్, సారా అర్జున్ బాండింగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. చాలా కాలం తర్వాత పొన్నియన్ సెల్వన్ చిత్రంలో ఐశ్వర్యరాయ్ టీనేజ్ అమ్మాయి పాత్రలో కనిపించింది.

# అతను నాకు గురువు.. ఎలా ప్రపోజ్ చేస్తా..!

## పిచ్చి పిచ్చి రూమర్స్ వల్ల చాలా బాధపడ్డా: అక్సా ఖాన్



టీవీ షోలతో పాపులర్ అయిన వారిలో అక్సా ఖాన్ ఒకరు. ఈ అమ్మడు తన డాన్స్ తో ప్రేక్షకులను విశేషంగా కట్టుకుంది ఈ చిన్నది. అక్సా ఖాన్ తన డాన్స్ తో ఎంతో మంది ఫ్యాన్స్ ను సొంతం చేసుకుంది. అలాగే తన అందంతోనూ ఆకట్టుకుంటుంది. అలాగే పలు సినిమాల్లోనూ పని చేస్తుంది. ఢీ షో ద్వారా పాపులర్ అయిన వారిలో అక్సా ఖాన్ ఒకరు. తన డాన్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ అందాల తార. డాన్స్ తో పాటు పలు టీవీ షోల్లోనూ పాల్గొంది, అలాగే సినిమాల్లోనూ చేస్తూ ఆకట్టుకుంది అక్సా ఖాన్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. ఈ ఇంటర్వ్యూలో తన కెరీర్, వ్యక్తిగత జీవితంపై వస్తున్న పలు రూమర్స్?పై క్లారిటీ ఇచ్చింది అక్సా ఖాన్. బిగ్ బాస్ షో గురించి ప్రస్తావించగా.. ప్రతి సంవత్సరం బిగ్ బాస్ టీమ్ తనను అప్రోచ్ అవుతుందని అక్సా ఖాన్ తెలిపింది. అయితే, ప్రస్తుతం తన చేతిలో ఉన్న సినిమా ప్రాజెక్టుల కారణంగా షోలో పాల్గొనలేకపోతున్నానని ఆమె తెలిపింది. బిగ్ బాస్ ఒక మంచి ప్లాట్?ఫామ్ అయినప్పటికీ, తాను సున్నితమైన వ్యక్తిత్వం కలిగిన దానిని కాబట్టి షోకు సెట్ అవ్వనని భావిస్తున్నట్లు చెప్పుకొచ్చింది. అయినప్పటికీ, భవిష్యత్తులో ఛాన్స్ వస్తే ప్రయత్నించాలని ఉందని ఆమె చెప్పుకొచ్చింది. బిగ్ బాస్ అప్డేట్స్ వచ్చే వీడియోలలో తన పేరు తరచుగా వినిపిస్తుంటుందని, తన అభిమానులు కూడా బిగ్ బాస్‌కు వెళ్లమని కోరుతుంటారని ఆమె తెలిపారు. ఢీ షోలో తాను రెమ్యూనరేషన్ తీసుకోలేదని, కేవలం ఫేమ్ కోసం మాత్రమే కష్టపడ్డానని స్పష్టం చేసింది అక్సా ఖాన్. మాస్టర్లకు మాత్రమే పారితోషికం లభించేదని, దుస్తులు, ఆహారం వంటి ఖర్చులన్నీ మాస్టర్లకే ఇచ్చేవారని అక్సా ఖాన్ తెలిపింది. ఢీ షో ద్వారానే తనకు మంచి గుర్తింపు, స్టార్?డమ్ లభించాయని, అందుకే తెలుగు ఇండస్ట్రీలోనే ఉండి మంచి మంచి ప్రాజెక్టులు చేయాలనుకుంటున్నానని ఆమె తెలిపింది. ఇక్కడే తన స్థానాన్ని పదిలం చేసుకుంటానని చెప్పుకొచ్చింది. ప్రమోషన్స్ కోసం ప్రస్తుతం తాను మంచి పారితోషికం తీసుకుంటున్నట్లు అక్సా ఖాన్ తెలిపింది. ఢీ నుంచి వచ్చిన ఎవరితోనూ టచ్?లో లేనని అక్సా ఖాన్ స్పష్టం చేశారు. తాను ఎక్కువగా స్నేహపూర్వకంగా ఉండనని, తనకంటూ ఒక ప్రత్యేకమైన జోనర్ అలవాటు అని తెలిపింది. ఒక పెద్ద సర్కిల్ లేకపోతే కెరీర్ నెమ్మదిస్తుందని తాను నమ్మడం లేదని, తాను వర్క్ హాలిక్ లాంటి వ్యక్తి అని, ఇతర విషయాలపై పెద్దగా ఆసక్తి ఉండదని తెలిపింది. తన వివాహం గురించి బయట ప్రచారం జరుగుతోందని, అయితే అది అవాస్తవమని, ఒకవేళ పెళ్లి జరిగితే సోషల్ మీడియా ద్వారా స్వయంగా వెల్లడిస్తానని ఆమె స్పష్టం చేశారు. అలాగే, సుడిగాలి సుధీర్?కు తాను పెళ్లి ప్రపోజ్ చేశాననే రూమర్?ను ఆమె తీవ్రంగా ఖండించారు. సుధీర్ సార్ తనకు మెంటర్, గురువుతో సమానమని, ఆయన పట్ల తనకు ఎంతో గౌరవం ఉందని చెప్పారు. తాను ఒక స్టూడెంట్‌గా ఆయన నుంచి చాలా నేర్చుకున్నానని, అలాంటి గురువుకు ఎలా ప్రపోజ్ చేస్తానని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఈ రూమర్స్ వల్ల తాను చాలా బాధపడ్డానని, ఇదంతా ఎవరు క్రియేట్ చేశారో తెలియదని అన్నారు. రిలేషన్?షిప్ రూమర్స్ గురించి మాట్లాడగా, తాను ఇంకా సింగిల్‌నని అక్సా ఖాన్ తెలిపింది.

# నో రూల్స్ అంటున్న సమంత, నయన్, రష్మిక..



మాస్ కమర్షియల్ సినిమా అంటే హీరో సెంట్రికే అన్న రూల్స్‌కు చెక్ పెట్టేస్తున్నారు కొంత మంది బ్యూటీస్. కంటెంట్ డ్రివెన్ కథలు మాత్రమే కాదు అవసరమైతే యాక్షన్? మూవీస్‌తోనూ సత్తా చాటగలం అని ప్రూవ్ చేస్తున్నారు. ముఖ్యంగా సీనియర్ హీరోయిన్లంతా ఇప్పుడు యాక్షన్ మోడ్‌లోనే ఉన్నారు. సీనియర్ హీరోయిన్స్ కెరీర్ పై ఫోకస్ చేశారు. ఎప్పుడూ వెళ్లే రూట్‌లో కాకుండా, కాస్త కొత్తగా తమ అభిమానులను ఎంటర్ టైన్ చేయాలి అని, యాక్షన్ సినిమాల వైపు మొగ్గు చూపుతున్నారు. సమంత నుంచి నయన్, త్రిష వరకు అందరూ ఇదే బాటలో వెళ్తున్నారు. ఈ మధ్య సినిమాల విషయంలో సెలెక్టివ్‌గా ఉంటున్న సమంత ఎక్కువగా యాక్షన్ రోల్స్ మీదే కాన్సన్‌ట్రేట్ చేస్తున్నారు. వరుసగా ఓటీటీలో యాక్షన్ ప్రాజెక్ట్స్‌లో కనిపించిన ఈ బ్యూటీ, బిగ్ స్క్రీన్ మీద కూడా అదే ట్రెండ్ కంటిన్యూ చేస్తున్నారు. మా ఇంటి బంగారం మూవీలో యాక్షన్ అవతార్‌లో కనిపించబోతున్నారు. క్లాస్ మాస్‌ను పర్ఫెక్ట్‌గా బ్యాలెన్స్ చేస్తున్నారు లేడీ సూపర్ స్టార్ నయనతార. ఓ వైపు స్టార్ హీరోల సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తూనే మరో వైపు లేడీ ఓరియంటెడ్ సబ్జెక్ట్స్‌తో దుమ్మురేపుతున్నారు. రీసెంట్‌గా మన శంకరవరప్రసాద్‌గారితో కలిసి సూపర్ హిట్ అందుకున్న నయన్, త్వరలో రాక్కాయిగా యాక్షన్ లుక్‌లో కనిపించబోతున్నారు. పాన్ ఇండియా బ్లాక్ బస్టర్స్‌తో నేషనల్ లెవల్‌లో నెంబర్ వన్ రేసులో ఉన్న రష్మిక కూడా యాక్షన్ మూవీస్ మీద కాన్సన్‌ట్రేట్ చేస్తున్నారు. రీసెంట్‌గా గర్ల్‌ఫ్రెండ్ లాంటి ఎమోషనల్ డ్రామాతో మెప్పించిన ఈ బ్యూటీ నెక్ట్స్ మైసాతో యాక్షన్ హీరోయిన్‌గానూ ప్రూవ్ చేసుకునే పనిలో ఉన్నారు. ఇప్పటికే కమర్షియల్ ట్రెండ్‌కు దూరమైన త్రిష, తమన్నా, కాజల్ లాంటి బ్యూటీస్ కూడా ఎక్కువగా యాక్షన్, లేడీ ఓరియంటెడ్ సబ్జెక్ట్స్ వైపే చూస్తున్నారు. అయితే బిగ్ స్క్రీన్ మీద, లేదంటే ఓటీటీలో డిఫరెంట్ సబ్జెక్ట్స్‌తో గ్లామర్ వరల్డ్‌లో గ్యాప్ రాకుండా చూసుకుంటున్నారు.

# సొంత ఇల్లు కూడా లేదు.. వచ్చిన డబ్బులన్నీ దానికే ఖర్చు చేశా..

## సౌమ్య రావు ఇంట్రెస్టింగ్ కామెంట్స్



జబర్దస్త్ ద్వారా చాలా మంది సినిమా ఇండస్ట్రీలో అవకాశాలు అందుకున్న విషయం తెలిసిందే. చాలా మంది కమెడియన్స్‌గా ఇండస్ట్రీలో సినిమాలు చేస్తున్నారు. కొంతమంది హీరోలుగా మరికొంతమంది దర్శకులుగా రాణిస్తున్నారు. వీరితో పాటు యాంకర్స్ కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అనసూయ యాంకర్ నుంచి ఇప్పుడు యాక్టర్ గా మారారు. జబర్దస్త్ ద్వారా కేవలం నటులు మాత్రమే కాదు యాంకర్స్ కూడా మంచి క్రేజ్ సొంతం చేసుకున్నారు. అనసూయ, రష్మీ గౌతమ్ లాంటి వారు మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ కామెడీ షో ద్వారానే.. అలాగే ఆ మధ్య జబర్దస్త్ ద్వారా యాంకర్ గా మారింది ఓ ముద్దుగుమ్మ ఆమె సౌమ్య రావు. సీరియల్స్ ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి సౌమ్య రావు. ఇక జబర్దస్త్ ద్వారా ఈ అమ్మడు మంచి గుర్తింపు తెచ్చుకుంది. యాంకర్ గా చేసింది కొన్ని రోజులే కానీ తన మాటలతో, చలాకీతనంతో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ భామ. ఇక జబర్దస్త్ నుంచి బయటకు వచ్చిన తర్వాత పలు టీవీ షోల్లో పాల్గొంది. అలాగే కొన్ని ఇంటర్వ్యూల్లో ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఈ క్రమంలోనే ఓ ఇంటర్వ్యూలో ఆమె కొన్ని ఎమోషనల్ కామెంట్స్ చేసింది. ఈ ఇంటర్వ్యూలో తన యూట్యూబ్ రెవెన్యూ, నెలవారీ ఖర్చులు, లైఫ్ స్టైల్ , ప్రేమ జీవితం గురించి పలు విషయాలను పంచుకున్నారు. ముందుగా, తన సోషల్ మీడియా వాడకం గురించి మాట్లాడుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో తాను మంచి మేకప్ వేసుకున్నా, మంచి డ్రెస్ వేసుకున్నా అవుట్‌ఫిట్ చూపించడానికి మాత్రమే పెడతానని, కానీ కొంతమంది తినే ఫుడ్ నుంచి ఇంట్లోకి వచ్చిన కాక్రోచ్ వరకు మొత్తం షేర్ చేస్తుంటారు అని తెలిపింది. అలాగే తన యూట్యూబ్ ఛానెల్ గురించి మాట్లాడుతూ.. గతంలో డబ్బులు బాగానే వచ్చాయని, కానీ ప్రస్తుతం ఛానెల్ యాక్టివ్‌గా లేనందున ఎలాంటి రెవెన్యూ రావడం లేదని తెలిపింది. తన నెలవారీ ఖర్చుల గురించి చెప్తూ.. తాను 5 వేలు, 10 వేల రూపాయలతో కూడా బ్రతకడం తెలుసని చెప్పుకొచ్చింది. ఒక సాధారణ ఆర్టిస్ట్?కు నెలకు 30-40 వేల రూపాయలుంటే సరిపోతుందని, తాను కూడా అంతే ఖర్చు చేస్తానని ఆమె తేల్చి చెప్పింది. ఖరీదైన పార్లర్?ల వైపు తాను వెళ్ళనని, తమది ఒక నార్మల్ మిడిల్ క్లాస్ కుటుంబమని తెలిపింది. తాను ప్రస్తుతం ఒక చిన్న అద్దె ఇంట్లో నివసిస్తున్నానని, సొంత ఇల్లు కూడా లేదని స్పష్టం చేశారు. ఇన్ని సంవత్సరాలుగా పరిశ్రమలో ఉన్నా సొంత ఇల్లు ఎందుకు తీసుకోలేకపోయారు అని అడగ్గా, జబర్దస్త్ కు ముందు సీరియల్స్ చేసినప్పుడు వచ్చిన డబ్బులన్నీ తన కాస్ట్యూమ్స్, నెలవారీ ఖర్చులకే సరిపోయేవని, పెద్దగా సేవింగ్స్ లేవని తెలిపింది.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL